ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 05.07.2025 | సంపుటి :11 సంచిక : 347 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








## జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ సాధించేవరకు

# పోరు ఆగదు



## కేంద్రంలో అధికారంలోకొస్తాం..దేశాన్ని రక్షిస్తాం : మల్లికార్జున ఖర్గే

దేశ ఆర్థిక పరిస్థితిని మోదీ చిన్నాభిన్నం చేశారు • 11 ఏళ్లలో తెలంగాణకు ఆయన చేసింది శూన్యం • అబద్ధాల ప్రచారంలో సిద్ధహస్తుడు
భారత్‌-పాక్‌ ఘర్షణలో అమెరికా జోక్యంపై మౌనమెందుకు? • విదేశీలు చుట్టే మోడీకి..మణిపూర్‌ వెళ్లే తీరిక లేదు • ఆ రాష్ట్రం దేశంలో భాగం కాదా?
• ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం • కాంగ్రెస్‌ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు

**హైదరాబాద్‌(జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్‌ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. దేశరక్షణ కాంగ్రెస్‌ పార్టీకే సాధ్యమని ఆయన పురుద్ఘాటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్‌ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్దాలేనన్నారు. దేశానికి మోదీ, అమిత్‌ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటు న్నారని ఎద్దేవా చేశారు. కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణకు చేసిందేమి టని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్‌ మాత్రం వెళ్లలేదని మండిపడ్డారు. పాక్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం మిగతా 2లో..

### లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్‌, ఖర్గే 2లో



## మాది రైతురాజ్యం

• బీఆర్‌ఎస్‌,భాజాపాతో చర్చకు సిద్ధం 2లో
• ఢిల్లీలో ఉండే మోడీ.. ఉండే కెడీ అయినా ఒకే..
• తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం మూణ్నాళ్ల ముచ్చటే అన్నారు..
• కానీ అపోహలను పటాపంచలు చేశాం
• కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
• ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
• హామీలను అమలు చేస్తున్న ఘనత మాదే : సీఎం రేవంత్‌

## కొత్త,పాత తేడాలేదు

### చేరాక అందరూ సమానమే..

• అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలి
• గాంధీభవన్‌లో పీఏసీ సమావేశంలో ఖర్గే
• తెలంగాణలో వచ్చే పదేళ్లు మనదే అధికారం
• అధికారంలోకి రావడం ఖాయం: రేవంత్‌రెడ్డి



2లో

## కార్మికుల మరణాలను సీఎం ఫోటోషూట్‌లా చూస్తున్నారు

### ముఖ్యమంత్రి రేవంత్‌పై కేటీఆర్‌ విమర్శలు



**హైదరాబాద్‌(జనంసాక్షి):** పాశమైలారం పేలుడు ఘటనలో దాదాపు 50 మంది కార్మికుల మరణాలను సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఫొటో షూట్‌గా చూస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ ఆక్షేపించారు. మృత దేహాలను కార్డ్‌ బోర్డ్‌ పెట్టెల్లో తరలిస్తున్నారని మండిపడ్డారు. తమవారి సమాచారం కోసం కుటుంబ సభ్యులు పోలీసుల కాళ్లపై పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో ఘటనా స్థలంలో ఎంతమంది ఉన్నారన్న దానిపై కచ్చితమైన సమాచారం అందుబాటులో లేదని విమర్శించారు. కొవిడ్‌ సమయంలో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు వలస కార్మికులను వదిలేసినప్పుడు.. చాలా మంది హృదయాల్లో ప్రతిధ్వనించింది కేసీఆర్‌ పేరు మాత్రమేనని గుర్తు చేశారు. వలస కార్మికులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు, సమాన వాటాదారులు అని కేసీఆర్‌ చెప్పారని వివరించారు. వారికి ఉచితంగా రేషన్‌, సొంత ప్రాంతానికి రవాణా, వైద్య సదుపాయాలు కల్పించి గౌరవం, ఆశ కల్పించారని పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌బీసీ ఘటనలో పరిహారం అందక 8 బాధిత కుటుంబాలు ఇంకా వేచి చూస్తున్నాయన్నారు. మిగతా 2లో..



## హిమాచల్‌లో వరదబీభత్సం

భారీ వర్షాలకు 63మంది మృతి..

పలువురు గల్లంతు

**సిమ్లా(జనంసాక్షి):** హిమాచల్‌ప్రదేశ్‌పై జలఖడ్గం విరుచుకుపడింది. గత కొద్ది రోజులుగా ప్రకృతి ప్రకోపం చల్లారడం లేదు. ఓ వైపు కుండపోత వర్షాలు.. ఇంకోవైపు కొండచరియలు విరిగిపడడంతో భారీగా ప్రాణ, ఆస్తి జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు మిగతా 9లో..

### ఆపరేషన్‌ సిందూర్‌... ఒక్కరు కాదు..

## ముగ్గురు శత్రువులతో యుద్ధం చేశాం

పాక్‌కు మద్దతుగా చైనా, టర్కీల సాయం • భారత్‌ బలగాల సమిష్టి విజయం ఇది
డిప్యూటీ ఆర్మీ చీఫ్‌ లెఫ్టినెంట్‌ జనరల్‌ రాహుల్‌ ఆర్‌ సింగ్‌

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఆపరేషన్‌ సిందూర్‌ సమయంలో ఒకేసారి మేడు దేశాలతో యుద్ధం చేయాల్సి వచ్చిందని భారత డిప్యూటీ ఆర్మీ చీఫ్‌ లెఫ్టినెంట్‌ జనరల్‌ రాహుల్‌ ఆర్‌ సింగ్‌ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ ఆపరేషన్‌ సింధూర్‌ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌కు చైనా, టర్కీలు మద్దతుగా నిలిచాయన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూ ఏజ్‌ మిలటరీ టెక్నాలజీస్‌ అనే అంశంపై లెఫ్టినెంట్‌ జనరల్‌ రాహుల్‌ ఆర్‌ సింగ్‌ మాట్లాడారు. ఆపరేషన్‌ సిందూర్‌ నిర్వహించిన సమయంలో పాకిస్థాన్‌ను చైనా ఎప్పటికప్పుడు సమాయత్తం చేసిందన్నారు. భారత్‌కు ఒక సరిహద్దు.. ఇద్దరు శుత్రువులు ఉన్నారన్నారు. కానీ నిజానికి ముగ్గు రు శత్రువులు అని ఆ



యన వివరించారు. అందులో పాకిస్థాన్‌ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందన్నారు. పాకిస్థాన్‌ మిలటరీ వినియోగిస్తున్న హార్డ్‌వేం లో 81 శాతం చైనాకు చెందినవేనని ఈ సందర్భంగా ఆయన సోదాహరణగా వివరించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నడుమ భారత్‌పై పాక్‌ నిర్వహించిన దాడుల్లో చైనా తన ఆయుధాలను పరీక్షించుకుందని చెప్పారు. అదే సమయంలో పాకిస్థాన్‌కు మిగతా 2లో..



### పరామర్శకు వచ్చిన వారితో తాజా రాజకీయ పరిణామాలపై

## కేసీఆర్‌ చర్చ

**హైదరాబాద్‌(జనంసాక్షి):** సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం గురువారం యశోద దవాఖా నలో అడ్మిటైన బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ను పరామర్శించేందుకు పార్టీ నేతలు పలువురు వచ్చారు. ఈ సందర్భంలో.. వారితో అధినేత కేసీఆర్‌ ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా, ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు, తదితర ప్రజా సమస్యలు.. వర్తమాన అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ నేతలు, ఉద్యమకారుల నుంచి కేసీఆర్‌ ఫీడ్‌ బ్యాక్‌ తీసుకున్నారు. కాగా బీఆంఎస్‌ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌ రావును ఆయన కూతురు కవిత పరామర్శించారు. స్వల్ప అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని చూసేందుకు కవిత శుక్రవారం మిగతా 2లో..

### సాధారణ వైద్య పరీక్షల కోసమే.. ఆస్పత్రికి కేసీఆర్‌

మాజీ సీఎం ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన కేటీఆర్‌ 2లో

## ట్రినిడాడ్‌లో మోదీకి అపూర్వస్వాగతం



**పోర్ట్‌ఆఫ్‌ స్పేయిన్‌(జనంసాక్షి):** భారత ప్రధాని నరేంద్రమోదీ కరీబియన్‌ దేశమైన ట్రినిడాడ్‌ అండ్‌ టొబాగోలో పర్యటిస్తున్నారు. మోదీ ఆ దేశంలో దిగిన వెంటనే అ పూర్వ స్వాగతం లభించింది. ట్రిని డాడ్‌ ప్రధాని కమ్లా ప్రసాద్‌ బిసె స్సార్‌ విమానాశ్రయానికి వచ్చి స్వాగతించారు. ఈ క్రమంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ట్రినిడాడ్‌ ప్రధాని నోట నరేంద్రమోదీ రాసిన కవిత వినిపించింది. గుజరాతీ భాషలో మోదీ రాసిన పుస్తకంలోని కవితను ఆమె ప్రస్తావించారు. తన ప్రయాణంలోని జ్ఞాపకాలు, పోరాటాలను మన ప్రధాని ఆ కవితలో పొందుపర్చారు. దానిని ట్రినిడాడ్‌ ప్రధాని వినిపించడం అక్కడున్నవారిని ఆశ్చర్యపర్చింది. మిగతా 2లో..

### మతపరమైన అంశాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదు 2లో

దలైలామా విషయంలో చైనాకు భారత్‌ కౌంటర్‌

## ఉక్రెయిన్‌పై రష్యా భీకరదాడి



• 539 డ్రోన్లు, 11 క్షిపణులతో బాంబుల వర్షం
• దెబ్బతిన్న పోలండ్‌ దౌత్య కార్యాలయం

నిషేధిత రసాయన ఆయుధాలతో పుతిన్‌సేనలు దాడి చేశాయని కీవ్‌ ఆరోపణ

**కీవ్‌(జనంసాక్షి):** ఉక్రెయిన్‌-రష్యా యుద్ధం కొనసాగుతోంది. యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ.. ఫలితం ఉండటం లేదు. తాజాగా శుక్రవారం మరోసారి కీవ్‌పై మాస్కో భీకర దాడి సాగించింది. డ్రోన్లతో విరుచుకుపడింది. మొత్తం 539 డ్రోన్లు, 11 క్షిపణులతో దాడి చేసినట్లు ఉక్రెయిన్‌ ఎయిర్‌ఫోర్స్‌ వెల్లడించింది. తాజా దాడుల్లో కీవ్‌లోని పోలండ్‌ దౌత్యకార్యాలయం దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్‌ వెల్లడించింది. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదని తెలిపింది. దాడి జరుగుతున్న సమయంలో తమ ప్రాణాలు రక్షించుకునేందుకు స్థానికులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు పెడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ అయ్యాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం సహా వివిధ అంశాలపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్‌ గురువారం సుదీర్ఘంగా చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. గంటల వ్యవధిలోనే రష్యా మరోసారి దాడులకు దిగడం గమనార్హం. ఉక్రెయిన్‌లోని 8 ప్రాంతాల్లో రష్యా దాడులు చేసినట్లు కీవ్‌ ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం 40 అపార్ట్‌మెంట్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. రైల్వే మౌలిక సదుపాయాలకు, పాఠశాలలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపింది. రైల్వే ట్రాక్‌లు, సిగ్నలింగ్‌ వ్యవస్థ దెబ్బతినడంతో మిగతా 2లో..



ఇజ్రాయెల్‌, అమెరికాల నుంచి ఎలాంటి దురాక్రమణలు ఉండవని హామీ ఇస్తేనే

## అణు చర్చలు

ట్రంప్‌,నెతన్యాహులకు ఇరాన్‌ షరతులు వార్త 2లో



## సుస్థిర మైనింగ్‌ విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి

నిబంధనల సరళీకృతం, సాంకేతికత,పర్యావరణ పరిరక్షణలకే ప్రాధాన్యత
మైనింగ్‌ తరువాత యధాతథస్థితి ఏర్పడేలా ప్రణాళికలు
తమిళనాడు గనులను ఆదర్శంగా తీసుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌ రెడ్డి

**గోదావరిఖని, జనంసాక్షి :** వికసిత్‌ భారత్‌ లో భాగంగా దేశంలోని వివిధ ఖనిజ పరిశ్రమలు తమ ఉత్పత్తులు పెంచాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో ప్రకృతి పట్ల, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా మైనింగ్‌ ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌ లోని ట్రైడెంట్‌ హెూటల్లో వరల్డ్‌ మైనింగ్‌ కాంగ్రెస్‌ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి మైనింగ్‌ సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్‌ అనే అంశంపై ఈ సదస్సును కేంద్ర బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
05.07.2025



## లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్, ఖర్గే

**హైదరాబాద్(జనంసాక్షి):**నగరంలోని లక్డీకాపూల్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు.రోశయ్య జయంతి సందర్భంగా నేతలు నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పరామర్శకు వచ్చిన వారితో తాజారాజకీయ పరిణామాలపై కేసీఆర్ చర్చ

వచ్చారు. కవిత ఆస్పత్రికి వెళ్లి కేసీఆర్‌ను పరామర్శించారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో ఆమె మాట్లాడారు. గురువారం సాయంత్రం కేసీఆర్ అస్వస్థతకు గురికావడంతో వైద్యుల సలహాతో ఆస్పత్రిలో చేరారు. అనంతరం వైద్య బృందం ఆయనకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించింది. వీటిలో బ్లడ్ షుగర్ స్థాయిలు ఎక్కువగా ఉండటం, సోడియం స్థాయిలు తగ్గినట్టు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు అవసరమైన వైద్యసహాయం అందిస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై గురువారం రాత్రి వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. 'కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది. నిశితంగా పర్యవేక్షణ కొనసాగుతోందని హెల్త్ బులిటెన్‌లో వివరించారు.

## సాధారణ వైద్య పరీక్షల కోసమే ఆస్పత్రికి కేసీఆర్

### మాజీ సీఎం ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** మాజీ ముఖ్యమంత్రి, భారాస అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సాధారణ వైద్య పరీక్షల కోసం నిన్న సాయంత్రం ఆయన సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారని తెలిపారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలు పర్యవేక్షించేందుకు కొన్ని రోజులు ఆసుపత్రిలో ఉండాలని వైద్యులు సూచించినట్టు చెప్పారు. ఎలాంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు లేవని, వైటల్స్ అన్నీ సాధారణంగానే ఉన్నాయన్నారు. కేసీఆర్ క్షేమం గురించి ఆరాతీస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు రోజులుగా నీరసంగా ఉండడంతో కేసీఆర్ గురువారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎంవీ రావు సూచనతో ఆసుపత్రిలో చేరారు. వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వర్గాలు గురువారం రాత్రి 9.30 సమయంలో బులెటిన్ విడుదల చేశాయి. "నీరసంతో బాధపడుతూ కేసీఆర్ ఆసుపత్రిలో చేరారు. ప్రాథమిక పరీక్షల్లో రక్తంలో షుగర్ స్థాయిలు అధికంగా, సోడియం స్థాయిలు తక్కువగా ఉన్నట్లు తేలింది. కేసీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉంది. షుగర్, సోడియం సాధారణ స్థాయికి వచ్చే వరకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతారు' అని హెల్త్ బులిటెన్‌లో డాక్టర్ ఎంవీ రావు పేర్కొన్నారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకరదాడి..

పలు రైళ్లను దారి మళ్లిం చినట్లు అక్కడి రైల్వే శాఖ వెల్లడించింది. సుదీర్ఘకాలంగా రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్త తలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఉక్రెయిన్ పై పట్టు సాధించేందుకు రష్యా ఆ దేశంపై నిషేధిత రసాయన ఆయుధాలను ప్రయోగిం చినట్లు తెలుస్తోంది. నెదర్లాండ్స్ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ వెల్లడించిన ఈ విషయాలు ప్రస్తుతం ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. ఈ రసాయన ఆయుధాల వాడకానికి సంబంధించిన ఆధారాలను ది హేగ్, డచ్ నిఘా సంస్థలు సేకరించాయి. కీవ్ సైనికులను ఉక్కిరిబిక్కిరి చేసి చంపేందుకు మాస్కో వీటిని ఉపయోగిస్తుందని డచ్ రక్షణ మంత్రి రూబెన్ బ్రెకెల్‌మాన్స్ రాయిటర్స్‌తో పేర్కొన్నారు. ఈనేపథ్యంలో మాస్కోపై కఠిన ఆంక్షలు విధించాలని రూబెన్ పిలుపునిచ్చారు. ఈ రసాయన ఆయుధాలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ మొదట ఉపయోగించిన క్లోరోపిక్రిన్‌ను రష్యా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. డచ్ మిలిటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధిపతి పీటర్ రీసింక్ మాట్లాడుతూ.. తమకొచ్చిన నిఘా సమాచారం ప్రకారం నిర్వహించిన సొంత దర్యాప్తులో ఈ విషయాలు వెల్లడైనట్లు తెలిపారు. ఈ రసాయన ఆయుధాల కారణంగా ఉక్రెయిన్‌లో ముగ్గురు మరణించారని రూబెన్ ఆరోపించారు. 2,500 మంది వరకు గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్యశాఖ అధికారుల నివేదికలో తేలిందన్నారు. రష్యా ఈ రసాయన ఆయుధాలను విపరీతంగా ఉపయోగించడం ఉక్రెయిన్‌తో పాటు ఇతర దేశాలకు హానికరమేనన్నారు. ఈ క్రమంలో ఆ దేశంపై మరింత ఒత్తిడి తెచ్చి, పలు ఆంక్షలు విధించాలన్నారు. ఇంటెలిజెన్స్ తాజా నివేదికను డచ్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. గతేడాది తొలిసారిగా అమెరికా ఇలాంటి ఆరోపణలే చేసింది. ఉక్రెయిన్‌పై పైచేయి సాధించేందుకు రష్యా ఈ క్లోరోపిక్రిన్‌ను ఉపయోగిస్తుందని పేర్కొంది. అయితే, అప్పుడు మాస్కో వీటిని ఖండించింది. తాజా నివేదికలపై రష్యా రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. తాము ఇలాంటి ఆయుధాలు ఏమీ ఉపయోగించలేదని, ఉక్రెయినే ఇలాంటివి చేస్తుందని ఆరోపించింది. ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మరియా జఖరోవా మాట్లాడుతూ.. ఫెడరల్ సెక్యూరిటీ అధికారులు ఉక్రెయిన్‌కు తూర్పువైపున ఈ క్లోరోపిక్రిన్ కలిగిన పేలుడు పరికరాల నిల్వలను కనుగొన్నట్లు తెలిపారు. కాగా, ఈ రసాయన వాడకానికి రష్యా ఏజెంట్లను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆయుధాలకు భారీగా పెట్టుబడులు పెట్టడంతో పాటు కొత్త శాస్త్రవేత్తలను కూడా నియమిస్తున్నట్లు సమాచారం.

## తెలంగాణ ప్రయోజనాలపై రాజీపడం: హరీశ్

**హైదరాబాద్(జనంసాక్షి):**నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్‌ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు. పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డి పోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు నిలదీశారు. నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్‌ఎస్ పార్టీ సహించదు.

## జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్ సాధించేవరకు పోరుఆగదు



ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు. పహల్గాం ఘటన తరవాత ఆపరేషన్ సింధూర్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు. మణిపుర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపుర్ వాసులు భారతీయులు కాదా?అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు' అని ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీలాగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసివేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు. ాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్దాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు.

## మాది రైతురాజ్యం

**హైదరాబాద్,జులై (జనంసాక్షి):**ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించ గలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు.

## కొత్తపాత తేడాలేదు

**హైదరాబాద్(జనంసాక్షి):**
పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశమైంది. తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమం తరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వ యం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు.

**తెలంగాణలో వచ్చే పదేళ్లు మనదే అధికారం - సీఎం రేవంత్‌రెడ్డి**

కాంగ్రెస్ పార్టీ పదవులను నేతలు సాధారణంగా తీసుకోవద్దని.. వాటితోనే గుర్తింపు, గౌరవం వస్తుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.రాజకీయాల్లో ఎదిగేందుకు అవి ఉపయోగపడతాయని చెప్పారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో వచ్చే పదేళ్లు మన పార్టీయే అధికారంలో ఉంటుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. "నేను పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు 45 లక్షల సభ్యత్వాలు చేశాం. యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ విభాగాల వారితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి ప్రభుత్వంలో పదవులు వచ్చాయి. రానున్న రోజుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయి. మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికలు ప్రభావితం చేయబోతున్నాయి. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలి. నాయకులుగా ఎదగాలంటే ఇప్పటి నుంచే కష్టపడాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమన్వయంతో పనిచేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో చాలా విజయాలు సాధించాం. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలి. కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**90 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం - టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**

సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. చేసిన అభివృద్ధితో పార్టీ మరోసారి 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ.. సామాజిక న్యాయానికి కట్టుబడి అగ్రవర్ణాలకు చెందిన రేవంత్‌రెడ్డికి సీఎం, బీసీనైన తనకు పీసీసీ చీఫ్, నలుగురు దళితులకు క్యాబినెట్‌లో చోటు కల్పించిందని మహేశ్‌కుమార్ అన్నారు. మరో దళిత బిడ్డకు స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించిందని చెప్పారు. కొత్తగా నియమితులైన నేతలకు పార్టీ చక్కని అవకాశం కల్పించిందని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో గ్రామస్థాయి అధ్యక్షులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

## కార్మికుల మరణాలను ఫోటోషూట్‌లా చూస్తున్నారు.

వలస కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి అంత చులకనా అని ప్రశ్నించారు. కనీసం మరణంలో కూడా తగిన గౌరవం ఇవ్వరా, కుటుంబాలను గౌరవించరా అని ప్రశ్నించారు.

## ట్రినిడాడ్‌లో మోదీకి అపూర్వస్వాగతం

ఇక, ఈ దేశంలో భారత సంతతికి చెందిన ప్రజలు 40శాతం మంది ఉన్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఇప్పటికీ వారి ఆహారం, సంగీతం, భాషల్లో స్పష్టంగా కన్పిస్తాయి.అంతకుముందు ప్రవాస భారతీయులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ప్రధానమంత్రి కమ్లాను బిహార్‌కు ముద్దుబిడ్డగా పేర్కొన్నారు. కమ్లా పూర్వీకులు బిహార్‌లోని బక్సర్‌కు చెందినవారని తెలిపారు. అక్కడి ప్రజలు ఆమెను బిహార్ కుమార్తెగా భావిస్తారన్నారు. ఆ రాష్ట్ర వారసత్వం ప్రపంచానికే గర్వకారణమన్నారు. శతాబ్దాలుగా వివిధ రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య బలమైన స్నేహం ఉందన్నారు. ట్రినిడాడ్‌లోని పలు వీధులకు బనారస్, పట్నా, కోల్‌కతా, దిల్లీ వంటి పేర్లు ఉన్నాయన్నారు.

## ఆగస్టు 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

### నెలరోజులపాటు జరగనున్న వర్షాకాల భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్నాయి. ఆగస్టు 21 వరకు నెల రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల షెడ్యూల్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు ఉండవని తెలిపారు. ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉగ్రవాద దాడిపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ సమావేశాల్లోనే బీమా సవరణ బిల్లును ప్రవేశపెట్టే అవకాశముంది. బీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచుతున్నట్లు తెలుస్తోంది. బిల్లు ముసాయిదా సిద్ధంగా ఉంది. పహల్గాం ఉగ్రదాడి, ఆ తరువాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

## సుస్థిర మైనింగ్ విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశ అవసరాలకు అనుగుణంగా తగినంత బొగ్గు, అల్యూమినియం, రాగి తదితర ఖనిజాలను ఉత్పత్తి చేసి, ఈ రంగాలలో దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉందని, అదే సమయంలో ప్రకృతికి నష్టం జరగకుండా, ప్రజలకు ఉపయోగపడే విధంగా బాధ్యతాయుత మైనింగ్ ను నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ దిశగా పటిష్టమైన నిబంధనలను రూపొందించుకొని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.బొగ్గు గనులు ప్రారంభించడంతో పాటు అవి నడుస్తున్నప్పుడు, మూత పడినప్పుడు కూడా ఆ ప్రాంత ప్రకృతికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా, యధాతథస్థితిని నెలకొల్పే విధంగా పరిశ్రమలు చర్యలు తీసుకోవాలన్నారు. తమిళనాడు రాష్ట్రంలో కొన్ని గనులు ఈ విషయంలో దేశానికి ఆదర్శప్రాయంగా ఉన్నాయని పేర్కొన్నారు.మూసివేసిన గనుల ద్వారా స్థానిక ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించారని, ఈ తరహా పద్ధతులను ఇతర పరిశ్రమల వారు కూడా ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు గనుల్లో అనుసరిస్తున్న గనుల మూసివేత విధానాలను ఇతర ఖనిజ పరిశ్రమలలో కూడా అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణహిత మైనింగ్ తో పాటు ప్రజల భాగస్వామ్యంతో వారి అభివృద్ధికి తోడ్పడే విధానాలను మైనింగ్ పరిశ్రమ ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విచ్చేసిన మైనింగ్ సంస్థల వారు, మైనింగ్ మేధావులు ఈ సదస్సులో తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపేంద్ర బ్రార్, కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, వివిధ పీ.ఎస్.యూల సీఎండీలు, బొగ్గు, అల్యూమినియం, రాగి పరిశ్రమల అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ముందుగా పర్యావరణహిత, ప్రజాహిత మైనింగ్ ప్రక్రియ విషయాలను వివరిస్తూ రూపొందించిన మిషన్ గ్రీన్ బుక్, రిక్లెయిమ్ అనే పుస్తకాలను కేంద్ర మంత్రి ఆవిష్కరించారు. అలాగే అన్వేషణ విభాగం కోసం సింగిల్ విండో విధానం అమలు జరుపుతూ రూపొందించిన పోర్టల్ ను కూడా ఆవిష్కరించారు. అలాగే ఆన్ లైన్ ద్వారా 24వ నైవేలి బుక్ ఫెయిర్ 2025ను కూడా ప్రారంభించారు .హైదరాబాద్‌లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడిన ముఖ్యాంశాలు ఈ సదస్సుకు దేశంలోని పబ్లిక్ సెక్టార్‌లో పనిచేస్తున్న మైనింగ్ కంపెనీలు, అంతర్జాతీయ మైనింగ్ సంస్థల నుంచి సుమారు 8 దేశాలకు చెందిన 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు .మైనింగ్ రంగంలో, కోల్, లైమ్‌స్టోన్, ఐరన్ ఓర్ వంటి ఖనిజాల అన్వేషణ పూర్తయిన తర్వాత శాస్త్రీయ పద్ధతిలో మైన్ క్లోజర్ యాక్టివిటీ చేయాల్సిన అవసరం ఉంది.మైన్ క్లోజర్ యాక్టివిటీలను విస్మరించడం వల్ల పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి, భూములు ఉపయోగపడట్లేదు, ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. మైనింగ్ పూర్తయిన తర్వాత ఆ భూమిని చదును చేసి, స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని ప్రాంతాల్లో మైనింగ్ పూర్తయిన భూముల్లో ఫిషరీస్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.మైనింగ్ పూర్తయిన తర్వాత భూములను ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంగా ఆదేశించారు.ప్రభుత్వపరంగా ఇప్పటివరకు 143 మైనింగ్ ప్రాజెక్టులు మైనింగ్ పూర్తయిన అనంతరం డీకోల్ అయ్యాయి. ఈ మైన్స్ అన్నింటినీ మైన్ క్లోజర్ యాక్టివిటీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ యాక్టివిటీలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ఇప్పటికే రూపొందించబడింది.వచ్చే మూడు సంవత్సరాల్లో ఈ కోల్ బ్లాక్స్ అన్నిటికీ మైన్ క్లోజర్ యాక్టివిటీస్ చేపట్టి, పర్యావరణాన్ని రక్షించేందుకు, ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రకృతికి అనుకూలమైన అభివృద్ధి కోసం మైన్ క్లోజర్ యాక్టివిటీలను కొనసాగించేలా కార్యాచరణ రూపొందించబడుతోంది.మైన్ క్లోజర్ యాక్టివిటీలకు సంబంధించి విస్తృతంగా చర్చ జరుగుతోంది.

## ముగ్గురు శత్రువుతో యుద్ధం చేశాం

టర్కీ సైతం అదే తరహాలో సహాయం చేసిందన్నారు. ఈ యుద్ధంలో టర్కీ పైలట్లు నేరుగా పాల్గొన్నారని వివరించారు. పాక్, చైనాను ఎదుర్కొవడానికి బలమైన వాయు రక్షణ వ్యవస్థ ఉండాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద స్థావరాలను గుర్తించి.. వాటిని ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించిన భారత సైనిక బలగాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్ వల్ల కొన్ని పాఠాలను సైతం నేర్చుకున్నామని చెప్పారు. మానవ మేధస్సుతోపాటు సాంకేతిక ద్వారా లెక్కలేనంత సమాచారాన్ని సేకరించి.. ఈ దాడులు నిర్వహించామని లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ వివరించారు. గతంలో మాత్రం ఇలా సమాచారాన్ని సేకరించడంలో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్న మాట మాత్రం వాస్తవమన్నారు. అయితే పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో 21 లక్ష్యాలను గుర్తించి.. వాటిలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. అందుకు చివరి రోజు.. చివరి నిమిషంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. త్రివిధ దళాలు ఐక్యత కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఎప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గంలో పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ లష్కరే తోయిబాకు చెందిన ది రిసిస్టెన్స్ ఫ్రెంట్ ప్రకటించింది. దీంతో ఈ ఘటనకు కర్త, కర్మ, క్రియా అంతా పాకిస్థాన్ అని భారత్ నమ్మింది. దీంతో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అదే సమయంలో పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఇక పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించింది. ఆ క్రమంలో తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసి.. 100 మందికి పైగా ఉగ్రవాదులను హతమార్చిన సంగతి తెలిసిందే.

## మతపరమైన అంశాల్లో ప్రభుత్వ జోక్యం ఉండదు

### దలైలామా విషయంలో చైనాకు భారత్ కౌంటర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భవిష్యత్తులో తన వారసత్వం కొనసాగుతుందని.. వారు అమ్మాయైనా, అబ్బాయైనా కావొచ్చని టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. మరోవైపు దలైలామా వారసుడి ఎంపిక నిర్ణయంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో.. ఈ అంశంలో జోక్యం చేసుకోవడం తగదంటూ భారత్‌పై చైనా వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామాల వేళ భారత ప్రభుత్వం స్పందించింది. మత విశ్వాసాలు, ఆచారాల్లో భారత్ ఎప్పుడూ జోక్యం చేసుకోదని స్పష్టం చేసింది. దీర్ఘకాలంగా ఇదే వైఖరిని కొనసాగిస్తున్నామని పేర్కొంటూ విదేశాంగశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది."తన వారసత్వం గురించి ప్రస్తుత దలైలామా ప్రకటనకు సంబంధించిన నివేదికలు చూశాం. అటువంటి మతపరమైన అంశాల్లో భారత్ ఎప్పుడూ జోక్యం చేసుకోదు. దీర్ఘకాలంగా ఇదే వైఖరిని కొనసాగిస్తోంది" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. భారత్‌లోని అందరి మత స్వేచ్ఛను ప్రభుత్వం గౌరవిస్తుందని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తుందన్నారు.దలైలామా వారసుడి ఎంపిక నిర్ణయంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల మాట్లాడటంపై స్పందించిన చైనా.. టిబెట్ విషయాల్లో భారత్ జోక్యం చేసుకోవడం తగదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవాలని పరోక్ష హెచ్చరికలు చేసింది.

## ఇజ్రాయెల్, అమెరికాల నుంచి ఎలాంటి దురాక్రమణలు ఉండవని హామీ ఇస్తేనే అణు చర్చలు

### ట్రంప్,నెతన్యాహులకు ఇరాన్ షరతులు

టెహ్రాన్(జనంసాక్షి):అణు ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు ఇరాన్ పలు షరతులు విధించింది. ఇజ్రాయెల్, అమెరికాల నుంచి భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు ఉండకూడదని పేర్కొంది.భారత్‌లోని ఇరాన్ రాయబారి ఇరాజ్ ఎలాహి ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.భవిష్యత్తులో ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్ ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడకూడదని తెలిపారు. అలాంటి విశ్వసనీయమైన హామీ అగ్రరాజ్యం ఇస్తే తప్ప ఆ దేశంతో అణుఒప్పందంపై జరిగే చర్చలకు అర్థం ఉండదన్నారు. ఈక్రమంలోనే ఇటీవల అణుకేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేసిన 'ఆపరేషన్ రైజింగ్ లయన్' గురించి కూడా ప్రస్తావించారు. టెల్‌అవీవ్ వద్ద ఇంకా అణ్వాయుధాలు ఉన్నాయని, అయినా వారు అణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయలేదన్నారు. అలాంటి దేశం అణ్వాయుధాలు కలిగిఉండకూడదనే నెపంతో మాపై దాడులు చేయడం సరికాదన్నారు. ఈ దాడులు ఐక్యరాజ్యసమితి చట్టాలను ఉల్లంఘించాయన్నారు. ఇక, మూడు అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడులను దుందుడుకు చర్యగా ఆయన అభివర్ణించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో ఇజ్రాయెల్ ఆ దేశంతో చేతులు కలిపి ఈ దాడులకు పాల్పడిందన్నారు. ఇది దౌత్య ద్రోహమన్నారు.

# ముఖ్యమంత్రి జూరాల ప్రాజెక్టును సందర్శించాలి

**గేట్ల మరమ్మతుల విషయంలో వాస్తవాలను కప్పిపుచ్చుతున్న మంత్రులు,అధికారులు**

**ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలి**

**సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



**గద్వాల (జనంసాక్షి) :** పాలమూరు జిల్లా రైతులకు వరప్రదాయిని గా నిలిచిన జూరాల ప్రాజెక్టు ప్రమాదంలో పడటానికి పాలకులు చేసిన పాపలే కారణం అని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ అన్నారు. శుక్రవారం ఆయన జూరాల ప్రాజెక్టును సందర్శించి తెగిపోయిన క్రస్ట్ గేట్ల రోప్ లను పరిశీలించారు. అక్కడే ప్రాజెక్టు అధికారులతో విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు లక్ష ఎకరాలకు సాగు నీరును అందించే జూరాల ప్రాజెక్టు పై స్థానిక పాలకులు అనుసరించిన నిర్లక్ష్య విధానాల వల్లే ప్రాజెక్టు ప్రమాదంలో పడటానికి కారణాలని విమర్శించారు. ప్రాజెక్టు నిర్వహణ క్రస్ట్ గేట్ల మరమ్మతుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనబడుతోందని ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి లోపాలను సరి చేయడంలో నిర్లక్ష్యం చేసిందని అన్నారు. 8 గేట్లు రోప్ లు తెగిపోయి ప్రమాదంలో ఉంటే ముఖ్యమంత్రి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే ముఖ్యమంత్రి జూరాల ప్రాజెక్టును సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. సొంత జిల్లా లో ఉండే ముఖ్యమైన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. క్రస్ట్ గేట్ల రోప్ లను నాలుగు ఐదు సంవత్సరాల ఒకసారి మార్చాల్సి ఉన్నా ఎనిమిది పది సంవత్సరాలుగా మార్చడం లేదని కనీసం రోప్ లకు గ్రీసు వేయటంలో కూడా అధికారులు నిర్లక్ష్యం చేశారని గేట్ల నిర్వహణ మరమ్మతుల విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడుతున్నట్టుగా రైతులు చెబుతున్నారని వాటిపై విచారణ జరపాలని అన్నారు. ప్రాజెక్టు నిర్వహణ విషయంలో ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టుకే ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. వాహనాల రాకపోకల కోసం బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం మంచి పరిణామం అని కానీ కేవలం కాగితాల వరకే పరిమితం కాకుండా వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టుపై వాహనాల రాకపోకలు ఇలాగే కొనసాగితే ప్రాజెక్టు కు ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వెంటనే ప్రాజెక్టును సందర్శించాలని, జూరాల ప్రాజెక్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, గేట్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రాజెక్టుపై కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తూ జాన్ వెస్లీ నిరసన తెలిపారు.

ఆల్ ఇండియా కిసాన్ సభ అఖిలభారత ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు బహుళార్ధ సాధక ప్రాజెక్టు అని ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల ఎకరాల సాగు భూమికి నీరు అందించే ఇంతటి ప్రాజెక్టుకు గత బడ్జెట్లో 17 కోట్లు కేటాయించారని కానీ ఒక్క పైసా ఖర్చు చేయలేదని మళ్లీ ఈసారి కూడా 17 కోట్లే కేటాయించారని ఖర్చు చేయడంలో ప్రభుత్వాలు తాత్సారం చేయకూడదని అన్నారు. ప్రాజెక్టులపై ఎక్కడా వాహనాల రాకపోకలు ఉండకూడదని కానీ జూరాల ప్రాజెక్టుపై వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని దానివల్ల ప్రాజెక్టు భద్రతకు మరింత ముప్పు ఉంటుందని అన్నారు. వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ బ్రిడ్జి నిర్మాణం కోసం 122 కోట్ల రూపాయలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని కానీ గతంలో కూడా ఇటువంటి అనేక జీవోలు విడుదల చేసి మధ్యలో ఆగిపోయాయని, ప్రభుత్వము తక్షణమే బ్రిడ్జికి టెండర్లు వేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లా ఇప్పటికి వెనుకబడి ఉందని ఈ జిల్లా నుండి కూలీలు ఇప్పటికీ వలసలు వెళ్తున్నారని పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులు అన్నీ పూర్తి కావాలంటే ప్రభుత్వం తక్షణమే 2500 కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి మాట్లాడుతూ 18 టిఎంసిల సామర్థ్యం గల జూరాల ప్రాజెక్టును పాలకుల అసమర్ధ విధానాల వద్ద 9 టీఎంసీలకు పరిమితం చేశారని విమర్శించారు. జూరాల నిర్వహణకు సంబంధించిన సీఈ కార్యాలయాన్ని గద్వాల నుండి తరలిస్తున్న సందర్భంగా ప్రస్తుత అధికార ప్రతిపక్షాలు కనీసం మాట మాత్రమైన ప్రశ్నించలేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఆర్.శ్రీరామ్ నాయక్ గద్వాల, వనపర్తి జిల్లాల కార్యదర్శులు ఏ.వెంకటస్వామి, పుట్ట ఆంజనేయులు నాయకులు ఎండి. జబ్బార్, ఎండి. మహమూద్, బాల్ రెడ్డి, గోపి, ఉప్పేర్ నరసింహ, రేపల్లె దేవదాసు, పరంజ్యోతి, ఈదన్న, మంచాల నరసింహ వెంకటస్వామి, రామకృష్ణ, గజేంద్ర, వీరేష్, పవన్, మేకల నరసింహులు, మోష, వినయ్, కృష్ణ, ఆనంద్ ,వెంకటరామయ్య తో పాటు గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన సిపిఎం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణిలో 246 దరఖాస్తులు

**దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 246 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 80, రెవెన్యూ శాఖకు సంబంధించి 42, విద్యుత్ శాఖకు 18, పౌర సరఫరా శాఖకు 08, ఇందిరమ్మ ఇండ్ల కోసం 30, దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పొరేటర్



**హైదరాబాద్, జూలై4 (జనంసాక్షి) :** హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పొరేటర్ అడ్డుకున్నారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు. హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారిణి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకోవద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.



## మార్కెట్ కమిటీ ఉద్యోగి పై దాడికి టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం ఖండన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వ్యవసాయ మార్కెట్ కమిటీ మహబూబ్ నగర్ కార్యదర్శి భాస్కర్ పై వైస్ ఛైర్మెన్ విజయ్ కుమార్ చేసిన దాడిని గౌరవ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు సంచాలకులు సురేంద్ర మోహన్ కు టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం నాయకత్వం తో కలిసి జరిగిన సంఘటన గురించి సవివరంగా వివరించి వైస్ ఛైర్మెన్ ను వెంటనే పదవి నుండి తొలగించవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం టీఎన్‌జీవోస్ జనరల్ సెక్రటరీ ముజీబ్ హుస్సినీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమములో టీఎన్‌జీవోస్ సహ అధ్యక్షులు వెంకటేశం, సెంట్రల్ యూనియన్ కార్యదర్శి సంతోష్ సెంట్రల్ ఫోరమ్ బాద్యులు అశోక్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, విజయ్ కిషోర్, రేవంత్, శ్రీకాంత్, రవి కుమార్, హైదరాబాద్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు ఖలీద్ , మురళి పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో లస్కర్ మృతి

**ఖమ్మం, జులై 4 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ లస్కర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగింది. కలకోట గ్రామానికి చెందిన యంగల అప్పయ్య (50) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లస్కర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కలకోట గ్రామం నుంచి బోనకల్లులో గల ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి తన బైక్‌పై బయల్దేరాడు. రావినూతల గ్రామం వద్ద బర్రె బైక్‌కు తగలడంతో కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన బోనకల్లు సబ్ డివిజన్ డీఈఈ తమ్మరపు వెంకటేశ్వర్లు, ఏఈఈ రాజేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

**నంద్యాల, జూలై4 (జనంసాక్షి) :** నంద్యాల జిల్లాలో దారుణం జరిగింది. పాఠశాలకు వెళ్లిన తొలిరోజే ఓ చిన్నారి స్కూల్ బస్సు చక్రాల కింద పడి మృతి చెందింది. ఈఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో జరిగింది. ఎంవీ నగర్‌కు చెందిన శ్రీధర్, వనజ దంపతుల కుమార్తె హరిప్రియ (5). ఓ ప్రైవేటు-పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. శుక్రవారం ఉదయమే చిన్నారి తొలిసారి పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం పాఠశాల బస్సు దిగిన చిన్నారి.. ముందువైపు నుంచి నడుస్తూ ఇంటికి చేరుకోబోయింది. ఇంతలోనే డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వడంతో బాలిక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది.

## అనిరుద్ వ్యాఖ్యలపై పీసీసీ సీరియస్

**హైదరాబాద్, జూలై4 (జనంసాక్షి) :** జడ్చర్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిపై పీసీసీ సీరియస్ అయింది. అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలపై నివేదిక ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీకి టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగే క్రమశిక్షణ కమిటి సమావేశంలో అనిరుద్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఇటీ-వల జడ్చర్లలో కీలక కామెంట్స్ చేసిన అనిరుద్ రెడ్డి. తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారని వ్యాఖ్యాలు చేశారు. ఇరిగేషన్, రోడ్ల కాంట్రాక్టులు అవ్వడం మానేస్తే.. అంతా సెట్ అవుతుందన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పేర్కొన్నాడు.

### రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో
## అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ



**హైదరాబాద్, జులై 4 (జనంసాక్షి) :** ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018-2019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

### పాఠశాల యాజమాన్యం
## మందలించిందని కోడలు ఆత్మహత్య

**మరణవార్త విని మామ గుండెపోటుతో మృతి**



**పెద్దవంగర జులై 04(జనం సాక్షి) :** ఉరి వేసుకుని కోడలు.. గుండెపోటుతో మామ మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవతాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో అవుతాపురంలో విషాదం చోటుచేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అవతాపురం గ్రామానికి చెందిన వేముల సంతోష్(40) కు మంచిర్యాలకు చెందిన ఝాన్సీ (35) కి గత 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు అఖిల్ తేజ్, కూతురు అబిదామిని ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం లేకపోవడంతో భార్యాభర్తలిద్దరూ ప్రైవేట్ గా చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ తమ పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నారు. సంతోష్ పెద్ద వంగర మండలంలో సిఆర్పి గా ఝాన్సీ తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనులు చేసుకుంటూ తమ ఇద్దరి పిల్లలను చదివించుకుంటూ పిల్లలకు ఏ లోటు లేకుండా చూసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అవుతాపురం గ్రామానికి చెందిన తల్లిదండ్రి ప్రవీణ్ బీటెక్ పూర్తి చేశాడు. తొర్రూర్ కు చెందిన చిదిరాల రాజు గతంలో ఝాన్సీ పనిచేసిన పాఠశాలలో పీఈటిగా పనిచేశాడు. గత మూడు రోజుల క్రితం ఝాన్సీ పనిచేస్తున్న ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. పాఠశాల యాజమాన్యం ఝాన్సీని గట్టిగా మందలించింది. దీంతో పాఠశాలకు వెళ్ళనని ఇంటి వద్ద ఆమె భర్తకు చెప్పింది. గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో తీవ్ర మనస్థాపన చెందిన ఝాన్సీ తన సొంత ఇంటిలో ఉరి వేసుకుంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు తొర్రూర్ లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యుడు ఆమె అప్పటికే మృతి చెందిందని చెప్పారు. కొంతకాలంగా గుండె జబ్బుతో ఇబ్బంది పడుతున్న ఆమె మామ వేముల లక్ష్మణ్ (60) కోడలు మరణ వార్త విని గుండెపోటుతో అప్పటికప్పుడే ఇంటి వద్ద మృతి చెందాడు. రేపటి నుంచి తాము పాఠశాలకు వెళ్లడానికి ఎవరు మమ్మల్ని తయారు చేస్తారని, మా ఆలనా పాలన ఎవరు చూసుకుంటారని అఖిల్ తేజ్, అభిదాబిని వారి తల్లి మృదేహంపై పడి రోదించడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు కంటతడి పెట్టారు. తన కూతురు మృతి చెందడానికి సలిదండి ప్రవీణ్ చిదిరాల రాజులపై అనుమానంగా ఉందని మృతురాలి తండ్రి చింతకింది వెంకట సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

### ఖమ్మం-వరంగల్ రహదారిపై
# ఘోర ప్రమాదం

**రెండు లారీలు ఢీకొని మంటల్లో ముగ్గురు దహనం**




**మహబూబాబాద్, జూలై4 (జనంసాక్షి) :** ఖమ్మం - వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతి చెందారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన వివరాల్లోకి వెళితే రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజి సమీపంలోని జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్, కేజర్ల ప్రాంతానికి చెందిన రాజూరాం చౌదరికి ఇద్దరు కుమారులు. లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగానే చేపల దాణా కోసం విజయవాడ వెళ్లిన తండ్రి, చిన్న కుమారుడు సర్వణ్ రాం (23) రెండు లారీలతో విజయవాడ నుంచి రాజస్థాన్‌కు లారీలతో బయల్దేరారు. కుమారుడు లారీ ముందు వస్తుండగా పది నిమిషాల వ్యవధిలో తండ్రి లారీ వెనుక నుంచి వస్తోంది. అదే క్రమంలో వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోత్ గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో కాకినాడకు వెళ్తున్నాడు.మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్ రాం నడుపుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాళ్లు క్యాబిన్లపైకి దూసుకు రావటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోత్ గణేష్, సర్వణ్, రాం క్లీనర్ బర్గత్ ఖాన్ (23) సజీవ దహనమయ్యారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో కొడుకు లారీ వెనకాలే వస్తున్న తండ్రి రాజురాం చౌదరి తన కుమారుడి వాహనం ప్రమాదానికి గురైనట్లు- గుర్తించాడు. మృతుడు గణేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్‌కు కూడా ఇటీవలే వివాహమైనట్లు- తెలుస్తోంది. జాతీయ రహదారిపై లారీలు దహనమవుతుండటంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిపోయాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ
## అనుమతులు రద్దు చేయాలి


**సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు మూర్తి**




**సంగారెడ్డి (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా పాశ మైలారం సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదానికి, కార్మికుల మరణానికి కారణమైన సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందం పాశమైలారం సిగాచి కెమికల్ ఫ్యాక్టరీని సందర్శించారు. బాధిత కుటుంబాలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ మూర్తి మాట్లాడుతూ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు ఒక్కొ కుటుంబానికి కోటి రూపాయలు అందించాలని, తీవ్రంగా గాయపడిన కార్మికులకు 50 లక్షల రూపాయల చొప్పున చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కంపెనీ యాజమాన్యం ఇచ్చే ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియే చెల్లించాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఈ ప్రమాదంలో 40 మంది మృతి చెందినట్లు, 33 మంది గాయపడినట్లు సమాచారం వచ్చిందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. నాలుగైదు రాష్ట్రాలకు సంబంధించిన కార్మికులు చనిపోయారని వారి పూర్తి వివరాలు వెల్లడించాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన అన్నారు. ఆ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారి వివరాలు లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. పేర్లు నమోదు కానీ కార్మికుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వారిని గుర్తించి న్యాయం చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, కెమికల్ ఫ్యాక్టరీలో సరైన భద్రత ప్రమాణాలను కంపెనీ యాజమాన్యం పాటించకపోవడంతో సోమవారం రియాక్టర్ పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. కార్మికుల మృతి పట్ల తీవ్రమైన సంతాపాన్ని, సానుభూతిని ఆ కుటుంబాలకు తెలియజేశారు. నిర్లక్ష్యం వహించిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అనేక ఫ్యాక్టరీలలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, తనిఖీలు నిర్వహించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశాలలో భద్రత పరమైన సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఏఐసిసిటియు) రాష్ట్ర కార్యదర్శి రొయ్యల రాజు, రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపల్లి యాదగిరి తదితరులు ఉన్నారు.


# మోదీ దశాబ్ద పాలనలో ఆర్థిక సంక్షోభం

## రుణ భారంతో ప్రజలు




భారతదేశం గత దశాబ్ద కాలంలో అనేక ఆర్థిక సంస్కరణలు, సామాజిక పథకాలు, రాజకీయ మార్పులను చవి చూసింది. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, దేశ ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఎన్నో బూటకపు వాగ్దానాలు చేసింది. అయితే, ఇటీవలి ఆర్థిక నివేదికలు మరియు సామాజిక వాస్తవాలు సామాన్య పౌరుడి జీవితంలో పెరిగిన అప్పుల భారాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల విడుదల చేసిన 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ రిపోర్ట్-2025' ప్రకారం, దేశంలోని ప్రతి పౌరుడిపై సగటున రూ. 4.8 లక్షల అప్పు ఉంది. ఇది గత రెండేళ్లలో రూ. 90,000 మేర పెరిగింది. ఈ గణాంకాలు సామాన్యుడి జీవన పరిస్థితులు ఎంత దిగజారాయో చాటుతున్నాయి.

**అప్పుల ఊబిలో సామాన్యుడు:**
ఆర్బీఐ నివేదిక ప్రకారం, 2023 మార్చిలో ఒక్కో పౌరుడిపై అప్పు రూ. 3.9 లక్షలుగా ఉండగా, 2025 మార్చి నాటికి ఇది రూ. 4.8 లక్షలకు చేరింది. ఈ రూ. 90,000 పెరుగుదల సామాన్యుడి ఆర్థిక ఒత్తిడిని సూచిస్తుంది. దేశ జీడీపీలో అప్పుల వాటా 41.9 శాతం గా ఉంది. ఇందులో గృహ రుణాలు 29 శాతం. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, మొబైల్ ఈఎంఐలు 54.9 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మరో ఆందోళనకర అంశం ఏమిటంటే, లోన్-టు-వాల్యూ (ఎల్టీవీ) రేషియో 70 శాతానికి పైగా ఉండటం. ఇది రుణాల రికవరీని కష్టతరం చేస్తుంది. అంతేకాక, 25 శాతం రిటైల్ రుణాలు సురక్షితం కానివిగా గుర్తించారు. ఇది ఆర్థిక వ్యవస్థలో అస్థిరతను సూచిస్తుంది.




ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, దేశంలో సగటు తలసరి ఆదాయం రూ. 2.16 లక్షలు మాత్రమే. అంటే, సామాన్యుడి అప్పు అతని ఆదాయం కంటే రెండింతలకు పైగా ఉంది. ఈ అసమతుల్యత సామాన్య పౌరుడు తన రోజువారీ జీవన అవసరాల కోసం అప్పులపై ఆధారపడుతున్నాడని స్పష్టం చేస్తుంది. ఆర్బీఐ గణాంకాలు చెప్పేది ఏమిటంటే, 55 శాతం అప్పులు ఆస్తుల సృష్టికి కాకుండా, కేవలం జీవన ఖర్చుల కోసమే తీసుకోబడుతు న్నాయి. క్రెడిట్ కార్డుల వాడకం, వ్యక్తిగత రుణాలు, ఈఎంఐలు ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.

**అప్పులు తీసుకోవటానికి కారణాలు- ఒక విశ్లేషణ:**
సామాన్యుడు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది, నిత్యావసర వస్తువుల ధరలు గత 11 ఏళ్లలో దాదాపు 300 శాతం పెరిగాయి. ఆహారం, ఇంధనం, గృహ ఖర్చులు, విద్య, వైద్యం వంటి అంశాలు సామాన్యుడికి భారంగా మారాయి. రెండవది, ద్రవ్యోల్బణం పెరిగినా, వేతనాలు దానికి అనుగుణంగా పెరగలేదు. చాలీచాలని జీతాలతో కుటుంబ ఖర్చులను భరించలేక, ప్రజలు అప్పులపై ఆధారపడుతున్నారు.

మూడవది, నైపుణ్యానికి తగిన ఉపాధి అవకాశాలు తగ్గాయి. యువతలో నిరుద్యోగం రేటు గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది, ఇది ఆర్థిక అస్థిరతకు దారితీస్తోంది.

ఈ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని పథకాలుఉదాహరణకు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై), ఆయుష్మాన్ భారత్పేదలకు సహాయం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డా యి. అయితే, ఈ పథకాలు అమలులో లోపాలు, అవగాహ న లేమి, లేదా అర్హత సమస్యల వల్ల సామాన్యుడికి పూర్తి ప్రయోజనం చేకూరడం లేదు. ఉదాహరణకు, పీఎంఏవై కింద గృహ రుణాలపై సబ్సిడీలు అందుతున్నప్పటికీ, అర్హత నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియలు సంక్లిష్టంగా ఉండటం వల్ల చాలామంది ఈ ప్రయోజనాలను పొందలేక పోతున్నారు.

**ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు:**
కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వంటి విమర్శకులు, మోదీ ప్రభుత్వం గత 11 ఏళ్లలో సామాన్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విఫలమైందని ఆరోపిస్తున్నారు. "అచ్చే దిన్" నినాదంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం, వాస్తవానికి ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టిందని వారు వాదిస్తున్నారు. ఒకవైపు సామాన్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే, ప్రభుత్వానికి సన్నిహిత వ్యాపారవేత్తలు మాత్రం అపార సంపదను సృష్టించుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఉదాహరణకు, ఐటి హార్డ్‌వేర్, బయోటెక్నాలజీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రోత్సాహకాలు అందిస్తున్నప్పటికీ, ఈ ప్రయోజనాలు ప్రధానంగా కార్పొరేట్ రంగానికే చేకూరుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

**పరిష్కార మార్గాలు:**
ఈ ఆర్థిక సంక్షోభాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. మొదట, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలి. నిత్యావసర వస్తువుల ధరలను స్థిరీకరించడం అత్యవసరం. రెండవది, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలి. మూడవది, రుణాల విషయంలో పారదర్శకత, సురక్షిత రుణ విధానాలను అమలు చేయాలి. అంతేకాక, సామాన్యులకు విద్య, వైద్యం, గృహ సౌకర్యాలు అందించే పథకాలు సులభతరం చేయాలి. తద్వారా వారు అప్పులపై ఆధారపడకుండా ఉండగలరు.

చివరిగా మోదీ పాలనలో దేశం కొన్ని రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ, సామాన్యుడి జీవన పరిస్థితులు మాత్రం ఆశాజనకంగా లేవు. పెరిగిన అప్పుల భారం, ద్రవ్యోల్బణం, ఉపాధి అవకాశాల కొరత వంటివి పేద, మధ్య తరగతి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక స్థిరత్వం, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే, సామాన్యుడి జీవితం మరింత కష్టాల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## తెలంగాణ సాయుధ పోరాట జ్వాల
# దొడ్డి కొమురయ్య



నిజాం నిరంకుశత్వాన్ని, దొరల దాష్టీకాలను మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. 'బాంచెన్ దొరా నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమొందించారు. వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందాయి.

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర అనగానే మొట్టమొదటగా స్ఫురించే విప్లవ జ్వాల దొడ్డి కొమురయ్య. అందువలన తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం 'భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం' అనే నినాదాలుగా మారుమోగి ఉద్యమం సాయుధ పోరాటంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణం అని చెప్పవచ్చు. జనగామ జిల్లా లోని కడివెండి గ్రామంలో కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబములో దొడ్డి కొమురయ్య 1927 ఏప్రిల్ 3 నాడు జన్మించాడు.

తెలంగాణలో భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య. విస్నూర్ గ్రామంలోని దేశ్ముఖ్ రామచంద్రారెడ్డి ప్రజల పట్ల అతి క్రూరంగా వ్యవహరించేవారు. ఆయన తల్లి జానకమ్మ దొరసాని కడివెండి గ్రామంలో ఉండి ప్రజల చేత 'దొరసాని' అని పిలిపించుకునేది. ఆమె కడివెండి గ్రామాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకొని ప్రజానీకం పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారు. అలాగే నిజాంకు తొత్తులుగా ఉన్న దొరలు, భూస్వాములు ప్రజలపై జులుం చెలాయించేవారు.

ఈ అణచివేతలని ఎదుర్కోవడానికి 1944 భువనగిరి ఆంధ్ర మహాసభ ఆశాకిరణంగా నిలిచింది. దొరలు - భూస్వాములు కొనసాగిస్తున్న దోపిడి - దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఆరుట్ల రాంచంద్రారెడ్డి కడివెండి గ్రామ ప్రజలకి చైతన్యాన్ని రగిలించారు. గొల్ల, కురుమల నాయకుడు గాను, ఆంధ్ర మహాసభలో సభ్యుడిగాను ఉన్న తన అన్న దొడ్డి మల్లయ్య ప్రభావంతో దొడ్డి కొమురయ్య ఆ సంఘంలో చేరి దొరలకు వ్యతిరేకంగా పోరాడాడు. తెలంగాణ ప్రాంతం అంతా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో సంఘాన్ని ఏర్పరుచుకొని వెట్టిచాకిరి రద్దు కోసం ఉద్యమబాట పట్టింది. దీనిని సహించని దొరలు ఉద్యమాన్ని అణచడం కోసం అనేక పన్నాగాలు పన్నారు.

వందలాది మంది ప్రజలు రైతులు సంఘం పిలుపు అందుకొని 1946 జూలై 4 సాయంత్రం కడివెండి గ్రామంలో దొడ్డి మల్లయ్య నేతృత్వంలో ఊరేగింపుతో బయలుదేరారు. విస్నూరు రామచంద్రారెడ్డి రౌడీలు 40 మంది ఎలాంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో దొడ్డి కొమురయ్య కడుపులోకి తూటా దిగడంతో ఆయన కుప్పకూలి 'ఆంధ్రమహాసభకు జై', 'కమ్యూనిస్టు పార్టీకి జై' అని నినదిస్తూ వీర మరణం పొందాడు. తెలంగాణ రైతాంగ పోరాటంలో అమరుడైన తొలి వ్యక్తిగా దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

దొడ్డి కొమురయ్య మరణ వార్తతో చుట్టుపక్కల గల గ్రామాల ప్రజలంతా ఆవేశపూరితులై కడివెండి గ్రామానికి చేరుకుని ప్రతీకార చర్యలలో భాగంగా కర్రలు, బడిశెలు, గునపాలు అందుకుని దొర గూండాలను తరిమికొట్టారు. దొడ్డి కొమురయ్య బలి దానం తెలంగాణ సాయుధ పోరాటానికి ఆజ్యం పోసింది. క్రమంగా సంఘం పిలుపుతో ప్రజలు సాయుధ మార్గం దిశగా ఉద్యుక్తులు అయ్యారు. ఆ రకంగా దొడ్డి కొముర య్య హత్యతో శాంతియుతంగా సాగుతున్న రైతాంగ ఉద్యమం సాయుధ విప్లవోద్యమంగా మారింది. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడుగా ప్రజా హృదయాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని పదిలపరచుకున్న దొడ్డి కొమురయ్య జయంతి (ఏప్రిల్ 3) మరియు వర్ధంతి (జూలై 4) లను అధికారికంగా నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 2 నాడు ఉత్తర్వులు జారీ చేసి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతుండడాన్ని 'ప్రజా పోరాటాల విజయాలను సమున్నతంగా ఎత్తిపడుతుంది' అని సగర్వంగా చెప్పవచ్చు. అదేవిధంగా జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరుని పెట్టాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

**(జూలై 4 దొడ్డి కొమురయ్య వర్ధంతి)**



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690.

## ఇంటి దొంగలు!

జనాన్ని విడదీశారు
వైషమ్యాలు పెంచారు
బానిసలనిచేసారుజి
ఇంతకంటే దొంగలా?
బుద్ధుణ్ణి పంపేశారు
గాంధీని చంపేశారు
గాడ్సేకి జై కొట్టారు!
మీరు ఇంటిదొంగలు!
ఇప్పటికీ దుర్మార్గమే!
అంబేద్కర్ దళితుడు!
కమ్యూనిస్టులునచ్చరుజి
ప్రజాస్వామ్యం వద్దు!
మతాన్నిరెచ్చగొడతారుజి
సామరస్యంచెరిపేస్తారు
ఆదివాసీలు చావాలి
కార్పొరేట్లు కావాలి!
రాజ్యాంగం స్థానంలో
మనుస్మృతి అంటారు!
ఏకఛత్రం కావాలిమీకు!
మీకంటే దొంగలెవరు?

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## స్కూల్ మేనేజ్మెంట్‌లో క్రమశిక్షణ ప్రాధాన్యం



క్రమశిక్షణ అనేది ఏదైనా సంస్థ లేదా వ్యవస్థ యొక్క విజయానికి మూలస్తంభం. విద్యాసంస్థలలో, ముఖ్యంగా స్కూల్ మేనేజ్మెంట్‌లో, క్రమశిక్షణ అనేది విద్యార్థుల అభ్యాసం, ఉపాధ్యాయుల పనితీరు, మరియు స్కూల్ యొక్క సమగ్ర అభివృద్ధికి ఒక కీలక అంశం. ఈ వ్యాసంలో, స్కూల్ మేనేజ్మెంట్‌లో క్రమశిక్షణ యొక్క నిర్వచనం, రకాలు, నియమాలు, స్కూల్‌లోని వివిధ వర్గాలు అనగా ప్రిన్సిపాల్, ఆఫీస్ స్టాఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాటించవలసిన క్రమ శిక్షణ గురించి వివరణాత్మకంగా చర్చిస్తాము.

క్రమశిక్షణ అనేది అనేక నియమాలు, విధానాలు, వ్యవస్థల ద్వారా వ్యక్తుల కు లేదా సమూహాల ప్రవర్తనను నియంత్రించే ప్రక్రియ. స్కూల్ సందర్భంలో, క్రమశిక్షణ అనేది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది స్కూల్ యొక్క లక్ష్యాలను సాధించడానికి సహకరించే విధంగా ప్రవర్తించేలా చేసే విధానం. ఇది కేవలం శిక్షలు లేదా నియమాల అమలుకు మాత్రమే పరిమితం కాదు. బదులుగా సానుకూల ప్రవర్తన, బాధ్యత, అలాగే స్వీయ-నియం త్రణను ప్రోత్సహిం చడం కూడా ఇందులో భాగంగా ఉంటుంది. క్రమశిక్షణను రెండు రకాలుగా విభజించవచ్చు:

**సానుకూల క్రమశిక్షణ (పాజిటివ్ డిసిప్లిన్ ):**
ఇది సానుకూల ప్రవర్తనను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తుంది. ఉదాహరణకు, విద్యార్థులకు ప్రశంసలు, బహుమతులు, లేదా గుర్తింపు ద్వారా మంచి ప్రవర్తనను ప్రోత్సహించడం. దిద్దుబాటు క్రమశిక్షణ (కొహెర్సివ్ క్రమశిక్షణ ): ఇది తప్పిదాలను సరిదిద్దడం మరియు నియమాల ఉల్లంఘనలను నిరోధించడంపై దృష్టి పెడుతుంది. ఉదాహరణకు, హెచ్చరికలు, శిక్షలు, లేదా తల్లిదండ్రులతో చర్చలు.

**స్కూల్ మేనేజ్మెంట్‌లో క్రమశిక్షణ యొక్క ప్రాధాన్యత:**
క్రమశిక్షణ లేని స్కూల్ వాతావరణం అస్తవ్యస్తంగా మారి, విద్యార్థుల అభ్యాసానికి అలాగే స్కూల్ యొక్క సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తుంది. క్రమశిక్షణ ద్వారా స్కూల్‌లో సురక్షితమైన, సానుకూలమైన, మరియు ఉత్పాదక వాతావరణాన్ని సృష్టించవచ్చు. ఇది విద్యార్థులలో సమయపాలన, బాధ్యత, మరియు సహకార భావనను పెంపొందిస్తుంది.

**స్కూల్‌లో క్రమశిక్షణ నియమాలు:**
స్కూల్‌లో క్రమశిక్షణ నియమాలు స్పష్టంగా, న్యాయంగా అందరికీ సమానంగా వర్తించేలా ఉండాలి. కొన్ని సాధారణ నియమాలు ఏమిటంటే సరైన సమయపాలనతో తరగతులకు, స్కూల్ కార్యక్రమాలకు క్రమం తప్పకుండా సమయానికి హాజరవ్వడం. గౌరవనీయ ఉపాధ్యాయుల పట్ల సహవిద్యార్థులు, మరియు స్కూల్ సిబ్బంది పట్ల గౌరవంగా ప్రవర్తించాలి.

**స్కూల్ ఆస్తిని దెబ్బతీయకుండా జాగ్రత్తగా ఉపయోగించడం.**
- **డ్రెస్ కోడ్:** స్కూల్ నిర్దేశించిన యూనిఫాం లేదా డ్రెస్ కోడ్‌ను పాటించడం.
- **హింస నిషేధం:** శారీరక లేదా మానసిక హింసకు పాల్పడకుండా ఉండటం.

**వివిధ వర్గాలు పాటించవలసిన క్రమశిక్షణ:**
స్కూల్ మేనేజ్మెంట్‌లో క్రమశిక్షణ అనేది అత్యంత ముఖ్యమైనది.అందరి సమిష్టి కృషి ద్వారానే సాధ్యమవుతుంది. ఇందులో ప్రిన్సిపాల్, ఆఫీస్ స్టాఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు ఒక్కొక్కరూ తమ వంతు బాధ్యతను విడివిడిగానూ, సమిష్టిగానూ సక్రమంగా, సకాలంలో నిర్వహించాలి.

- ప్రిన్సిపాల్ పాఠశాల మొత్తానికి నాయకుడు. ఆయనే స్కూల్ పరిసరాల్లో క్రమశిక్షణ అమలుకు ప్రధాన బాధ్యుడు. వారు స్కూల్ యొక్క విధానాలను రూపొందించడం, నియమాలను స్పష్టంగా వివరించడం, అందరూ వాటిని పాటించేలా చూడటం అవసరం. ప్రిన్సిపాల్ స్వయంగా క్రమ శిక్షణతో ఉండి, సమయపాలన, న్యాయబద్ధమైన నిర్ణయాలు, సానుకూల నాయకత్వాన్ని ప్రదర్శిం చాలి. ఉదాహరణకు, విద్యార్థులు లేదా సిబ్బంది మధ్య వివాదాలను నిష్పక్షపాతంగా పరిష్కరించడం, స్కూల్ వాతావరణాన్ని సానుకూలంగా ఉంచడం వారి బాధ్యత.
- ఆఫీస్ స్టాఫ్ స్కూల్ యొక్క పరిపాలనా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలి. వారు సమయ పాలన పాటించడం అవసరం.స్కూల్‌లో అనేక రికార్డులను సరైన సమయంలో నిర్వహణ చేయాలి. పైఅధికారులు ప్రధానంగా చూసేది రికార్డుల నిర్వహణే. అలాగే తల్లిదండ్రులతో సమర్థవంతమైన సమాచార మార్పిడిని నిర్ధారించాలి. ఉదాహరణకు, ఫీజుల సేకరణ, పరీక్షల షెడ్యూల్, లేదా స్కూల్ కార్యక్రమాల గురించి సమాచారాన్ని సకాలంలో వారికి అందించడం ద్వారా వారు క్రమశిక్షణకు దోహదపడతారు.
- ఉపాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్స్‌గా ఉండాలి. వారు తరగతి గదిలో క్రమశిక్షణను పాటించటం, విద్యార్థులు పాటించేలా చేయటం వారి విధిని నిర్వహించడంగా చెప్పుకోవాలి. సమయానికి తరగతులు నిర్వహించడం, విద్యార్థులలో సానుకూల ప్రవర్తనను ప్రోత్సహించడం అవసరం. ఉపాధ్యాయులు తమ పాఠాలను సమర్థవంతంగా ప్లాన్ చేయడం, విద్యార్థులతో గౌరవ ంగా మాట్లాడటం, నియమాలను స్థిరంగా అమలు చేయడం ద్వారా క్రమశిక్షణకు దోహద పడతాయి. ఉదాహరణకు, తరగతి గదిలో సమయ వ్యవస్థాపన మరియు నిశ్శబ్ద వాతావరణాన్ని నిర్వహించడం ద్వారా విద్యార్థులు అభ్యాసంపై దృష్టి పెట్టేలా చేయవచ్చు.
- విద్యార్థులు స్కూల్ నియమాలను పాటించడం, సమయపాలన, గౌరవం, బాధ్యతా యుతమైన ప్రవర్తనను ప్రదర్శించడం ద్వారా క్రమశిక్షణకు దోహదపడతారు. వారు స్కూల్ యూనిఫాం ధరించడం, హోంవర్క్ సకాలంలో పూర్తి చేయడం, సహవిద్యార్థులతో సహకరించడం వంటి వాటిని పాటించాలి. స్వీయ-క్రమశిక్షణ విద్యార్థులలో జీవిత నైపుణ్యాలను పెంపొందిస్తుంది. భవిష్యత్తులో వారి విజయానికి దోహదపడుతుంది.
- తల్లిదండ్రులు స్కూల్ నియమాలను గౌరవించడం, స్కూల్ కార్యక్రమాలలో పాల్గొనడం, మరియు వారి పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడం అవసరం. వారు స్కూల్‌తో సమాచార మార్పిడిని కొనసాగించడం, తమ పిల్లల హోంవర్క్, ప్రవర్తనను పర్యవేక్షించడం, మరియు స్కూల్ విధానాల ను సమర్థించడం ద్వారా క్రమశిక్షణకు దోహదపడతారు. స్కూల్ మేనేజ్మెంట్‌లో క్రమశిక్షణ అనేది కేవలం నియమాల అమలుకు మాత్రమే పరిమితం కాదు. ఇది పాఠశాల లో సానుకూల వాతావర ణాన్ని సృష్టించడం. క్రమశిక్షణ అనేది కేవలం నియమాల అమలు మాత్రమే కాదు, ఇది ఒక సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేసే ప్రక్రియ కూడా.


దండెబోయిన అశోక్ యాదవ్,
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్, జనగాం. 9440521990.

## నీడలా నా వెంటే సంచరిస్తూ...

తడియారని జ్ఞాపకాలు తలను చుట్టేస్తుంటే
మనసులో తెలియని బిడియం ఆవహిస్తుంది
నన్ను నేను నమ్మలేక పోతున్నాను
నేను మరెవరికో వశమై సాగుతున్నానని..
నన్ను ఆడించేవాడెవడో తెలియదు
నన్ను నన్నుగా సాగనీయక అడ్డుపడి
నా రెక్కల చప్పుడు వినిపించకుండా
నాలుగు గోడల మధ్య బంధిస్తున్నాడు...
బోనులో నన్ను బంధించి ఆడిస్తున్నాడు..
కళ్ళు మూస్తే స్వప్నంలో విహరిస్తూ
నా చుట్టూ ఒక వలయాన్ని సృష్టించి
తనలోని కోరికలన్నీ తీర్చుకుంటున్నాడు...
వాడిని వెతకడం ఎందుకు
నేనే నీ ఆత్మారామున్ని అంటూ వెంటబడి
నా జీవితానికి తాను ఒక కర్తలా కదులుతూ
ప్రతిక్షణం ప్రబోధకుడిలా కనిపిస్తున్నాడు...

కొప్పుల ప్రసాద్
నంద్యాల, 9885066236

# ఉన్నత విద్యలో గ్రంథాలయాల పాత్ర



గ్రంథాలయాలు అనేవి జ్ఞానాన్ని సేకరించే, పరిరక్షించే మరియు పంచే కేంద్రాలుగా ఉంటాయి. ఉన్నత విద్యా సంస్థలైన విశ్వవిద్యా లయాలు, డిగ్రీ, పీజీ కళాశాలలు, మరియు పరిశోధనా సంస్థలలో గ్రంథాలయాలు కీలకమైన భాగంగా నిలుస్తాయి. ఇవి విద్యార్థులు మరియు అధ్యాపకులకు విజ్ఞానాన్ని పొందేందుకు, విశ్లేషించేందుకు మరియు కొత్తగా సృష్టించేందుకు సహాయపడతాయి. గ్రంథాల యాలు అన్నివిధాలుగా ఉన్నత విద్యావ్యవస్థకు మౌలిక స్థంభాలుగా నిలుస్తాయి. గ్రంథాలయాలు అనేవి జ్ఞానానికి ద్వారాలు. పుస్తకాలు, పత్రికలు, పరిశోధన పత్రాలు, డిజిటల్ వనరులు వంటి సమాచార వనరులను అందించే కేంద్రంగా గ్రంథాలయాలు పనిచేస్తాయి

ఉన్నత విద్యలో గ్రంథాలయాల ముఖ్య పాత్రలు:

**1.జ్ఞానవృద్ధికి ఆధారం:**
గ్రంథాలయాలు మనలో పఠన అలవాటును పెంచి, నూతన విషయాలను తెలుసుకునే ఆసక్తిని పెంపొందిస్తాయి. లైబ్రరీలో పాఠ్యపుస్తకాలు, ఉపపాఠ్యపుస్తకాలు, జర్నల్స్, పరిశోధనా పత్రాలు లభ్యమవుతాయి. ఇవి విద్యార్థులకు పాఠ్యాంశాలను బాగా అర్థం చేసుకోవడంలో సహాయపడతాయి.

**2.విద్యకు మద్దతు:**
విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర అదనపు సమాచారాన్ని గ్రంథాలయాల ద్వారా పొందగలుగుతారు. ఇది వారి అర్థన, అభివృద్ధికి సహాయపడుతుంది.

**3.పరిశోధనకు మద్దతు:**
ఉన్నత విద్యలో పరిశోధనకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. గ్రంథాలయాలు పాత మరియు నూతన పరిశోధనా పత్రాలు, థీసిస్లు, డిజిటల్ ఆర్కైవ్లు, మరియు ఇతర సమాచారం వనరుల ద్వారా పరిశోధకులకు మద్దతు ఇస్తాయి. పీజీ విద్యార్థులు, పరిశోధకులు తమ పరిశోధన కోసం కావలసిన సమాచారం, పాత పరిశోధన పత్రాలు, డేటాబేసులు లైబ్రరీలలో పొందగలుగుతారు.

4. పఠనానికి అనువైన వాతావరణం:
గ్రంథాలయాలు శాంతియుతమైన పఠన వాతావరణాన్ని కల్పిస్తాయి. గ్రూప్ స్టడీ రూములు, ఇంటర్నెట్ సదుపాయాలు, మల్టీమీడియా కేంద్రాలు విద్యార్థుల సమర్థ అభ్యాసాన్ని ప్రోత్సహిస్తాయి.

**5.విద్యా వనరుల ప్రదానం:**
గ్రంథాలయాలు పాఠ్యపుస్తకాలు, సబ్జెక్ట్ సంబంధిత పత్రికలు, జర్నల్స్, ఈ-బుక్స్, డేటాబేసులు వంటి అనేక సమాచారం వనరుల ను అందుబాటులో ఉంచుతాయి. విద్యార్థులు వీటిని ఉపయోగించి తమ విద్యాభ్యాసాన్ని మెరుగుపరచుకోవచ్చు.

**6.నాణ్యమైన సమాచారం అందుబాటులో ఉండడం**
ఇంటర్నెట్లో కనిపించే సమాచారంలో చాలావరకు నమ్మకమైనవి కాకపోవచ్చు. కానీ లైబ్రరీలలో ఉండే పుస్తకాలు, జర్నల్స్ నాణ్యమైనవిగా, విశ్వసనీయమైనవిగా ఉంటాయి.

**7.విద్యా సమానత్వానికి తోడ్పాటు**
విద్యార్థుల ఆర్థిక స్థితి ఎలా ఉన్నా, లైబ్రరీలో అందుబాటులో ఉన్న వనరులు ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. ఇది విద్యా సమానత్వాన్ని పెంపొందిస్తుంది.

**8. డిజిటల్ సేవలు మరియు సాంకేతికత:**
ఈ-లైబ్రరీలు, Institutional Repositories, OPAC (Online Public Access Catalogue), రిమోట్ యాక్సెస్, మొబైల్ యాప్స్ వంటివి విద్యార్థులకు సులభంగా సమాచారం పొందే అవకాశం కల్పిస్తున్నాయి. ఇది డిజిటల్ యుగంలో చదువులో సహాయప డుతుంది. ఈ-బుక్స్, ఈ-జర్నల్స్, డిజిటల్ డేటాబేసులు విద్యా ర్థులకు ఎక్కడినుండైనా ప్రాప్తిని అందిస్తున్నాయి. Shodhganga, NDL (National Digital Library), JSTOR, IEEE Xplore వంటి వనరుల ద్వారా పరిశోధనకు సహాయం, సులభంగా సమాచారం పొందే అవకాశం కల్పిస్తున్నాయి.

**9.ఇన్ఫర్మేషన్ లిటరసీ అభివృద్ధి:**
గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు సమాచారాన్ని ఎలా సేకరించాలి, వడపోసుకోవాలి, వినియోగించుకోవాలో శిక్షణ ఇస్తారు. ఇది విద్యార్థుల్లో సమాచారం వినియోగంపై అవగాహన పెంచుతుంది.

**ఉన్నత విద్యలో గ్రంథాలయాల పాత్ర:**
ఉన్నత విద్యలో గ్రంథాలయాలు ఒక మౌలిక సదుపాయం. పాఠ్య పుస్తకాలకే పరిమితంగా కాకుండా, గ్రంథాలయాల్లో సబ్జెక్ట్ మీద లోతుగా అధ్యయనం చేసేందుకు విస్తృతమైన వనరులు లభిస్తాయి. పరిశోధన చేసే వారికి ఇది నిజంగా ఎంతో ఉపయోగకరం." గ్రంథాలయం అంటే కేవలం చదవటానికి కాదు. అది ఒక అభ్యాస కేంద్రంగా, ఆలోచనలు పంచుకునే వేదికగా మారుతోంది. గ్రూప్ డిస్కషన్ రూమ్స్, ప్రెజెంటేషన్ ప్రాక్టీస్ సెంటర్స్ కూడా ఉన్నాయి." కొన్ని కళాశాలలు విద్యార్థులకు ఇన్ఫర్మేషన్ లిటరసీ శిక్షణలు కూడా అందిస్తున్నాయి. ఎలా సమాచారం సేకరించాలి? ఎలా ఫిల్టర్ చేయాలి? ప్లేజరిజం ఎలా నివారించాలి? అనే విషయాల్లో గ్రంథాలయ సిబ్బంది సహాయపడుతు న్నారు."ప్రపంచం వేగంగా డిజిటల్ మార్పులు చెందుతున్న నేపథ్యంలో, ఉన్నత విద్యా రంగంలో కూడా గ్రంథాలయాలు తగిన విధంగా మానవీయ మరియు సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మారుతున్నాయి. డిజిటల్ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, విద్యార్థులు మరియు పరిశోధ కులకు వేగవంతమైన, సులభమైన సమాచార ప్రాప్తి అవసరం అవుతుంది. ఈ క్రమంలో డిజిటల్ గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. అంతర్జాలంలో ఉన్న సమాచారం అంతా విశ్వసనీయమైనది కాదు. గ్రంథాలయాల్లో మాత్రం నాణ్యమైన, రివ్యూలు అయిన జర్నల్స్, పరిశోధనా పత్రాలు లభిస్తాయి."

చాలామంది విద్యార్థులు ఈ-గ్రంథాలయాల ఉపయోగాన్ని కూడా పూర్తిగా ఉపయోగించుకోరు. ఇప్పటి డిజిటల్ గ్రంథాలయాల ద్వారా ఏకకాలంలో ఎన్నో పత్రికలు, పుస్తకాలు చదవచ్చు. గ్రంథాలయాలు నేడు డిజిటల్ పరిణామానికి అనుగుణంగా మారిపోతున్నాయి."

ఉన్నత విద్యలో గ్రంథాలయాలు నేటికీ ఒక ముఖ్యమైన భాగం. ఇవి మౌలిక విద్యా వనరులుగా, పరిశోధన కేంద్రాలుగా, మరియు విద్యార్థి అభివృద్ధి కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. డిజిటల్ పరిజ్ఞానాన్ని సమర్థంగా వాడటం ద్వారా గ్రంథాలయాల ప్రాముఖ్యత మరింత పెరుగుతోంది."

గ్రంథాలయాల ప్రాముఖ్యత కాలంతో మారదు, కానీ రూపం మాత్రం మారుతుంది. గతంలో పుస్తకాల రూపంలో ఉన్న జ్ఞానం, నేడు డిజిటల్ రూపంలో అందుబాటులోకి వచ్చింది. కానీ వాటిని అందించే కేంద్రం ఇప్పటికీ "గ్రంథాలయం" నే. అందుకే ప్రతి వ్యక్తి జీవితంలో గ్రంథాలయానికి ఒక ప్రత్యేక స్థానం ఉండాలి.

లైబ్రరీలు విద్యారంగానికి పట్టుకొమ్మలు. ఇవి లేకుండా నాణ్యమైన విద్య, సత్ఫలితాలవైపు ప్రయాణం అసాధ్యమే. కాబట్టి విద్యార్థులు లైబ్రరీలని సంపూర్ణంగా ఉపయోగించుకోవాలి.

గ్రంథాలయాలు ఉన్నత విద్యలో ఒక అనివార్య భాగంగా మారాయి. ఇవి కేవలం పుస్తకాల నిల్వగదులు కాదు, జ్ఞానం పంచే కేంద్రాలు. ప్రస్తుత డిజిటల్ యుగంలో కూడా వాటి ప్రాముఖ్యత క్షీణించకుండా, మరింత విస్తృతమవుతోంది. అందువల్ల ప్రతి విద్యాసంస్థ గ్రంథాలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి.



డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డి
9849375829

# పట్లూరు బాలుర వసతి గృహం మూత..

- వసతి గృహాన్ని ఎత్తివేసే యోచనలో అధికారులు
- వసతి గృహ సిబ్బందిని ఇతర మండలాలకు బదిలీ
- నిద్రమత్తులో ప్రజాప్రతినిధులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 4 (జనం సాక్షి) :** పూటకు పిడికెడు మెతుకులు లేని కాలంలో ఎందరో పేద విద్యార్థులకు ఆ హాస్టల్ అన్నం పెట్టింది. దశాబ్దాల కాలంగా ఎందరో పేద విద్యార్థులు అక్కడ ఉండి చదువుకుంటూ శాస్త్రవేత్తలు ఉద్యోగస్తులు ప్రజాప్రతినిధులు సంఘసంస్కర్తలుగా ఎదిగారు. ఇప్పుడు వారంతా జాతికి సేవలందిస్తున్నారు. అలాంటి చరిత్ర ఉన్న ఆ హాస్టల్ మరుగున పడిపోతుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు లేరు అనే సాకుతో హాస్టల్లో ఎత్తివేసే యోచనలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే హాస్టల్ కు తాళం వేసి అధికారుల చేతులు దులుపుకున్నారు వివరాల్లోకి వెళితే ఎంతో చరిత్ర కలిగిన మర్పల్లి మండలం పట్లూరు గ్రామానికి చెందిన సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ప్రస్తుతం మూతపడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాయంలో ఈ హాస్టల్ ఎందరో పేద విద్యార్థులకు అన్నం పెట్టి ఆదరించింది. ఉన్నత స్థానానికి ఎదగడానికి తోడ్పడింది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ హాస్టల్ సొంత భవన నిర్మాణానికి 1987 అక్టోబర్ 11న అప్పటి ఉమ్మడి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు అప్పటి విద్యా శాఖ మంత్రి కీర్తిశేషులు ఇంద్రారెడ్డి అప్పటి ఎమ్మెల్యే చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. 1991 డిసెంబర్ 24న అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీదేవి అప్పటి అటవీ శాఖ మంత్రి చంద్రశేఖర్ వికారాబాద్ ఎమ్మెల్యే చంద్రశేఖర్ సొంత భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎంతోమంది పేద విద్యార్థులు ఈ హాస్టల్లో ఉంటూ చదువుకొని ఉన్నత స్థానానికి ఎదిగారు. అయితే ఎంతో చరిత్ర కలిగిన ఈ హాస్టలకు ఆదరణ కరువైంది. హాస్టల్ కు శాశ్విత వార్డెన్ లేకపోవడంతో నిర్లక్ష్యానికి గురి అయింది. క్రమ క్రమంగా హాస్టల్లో ఉంటూ చదువుకునే విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. దీనిని సాకుగా చూపి సాంఘిక సంక్షేమ అధికారులు శాశ్వతంగా హాస్టల్‌ను ఎత్తివేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. 2025 – 26 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభించలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వ హాస్టల్లో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే నొక్కి చెప్పిన అధికారులు చలనం లేదు. హాస్టల్లో విద్యార్థులను చేర్పించడానికి సాంఘిక సంక్షేమ అధికారులు సీరియస్‌గా పరిగణించిన దాఖలాలు లేవు. తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తూ హాస్టల్లో మూసి వేసే స్థాయికి దిగజార్చారు. హాస్టల్లో ఎత్తివేయాలని ఉద్దేశంతో ఇక్కడ పర్మనెంట్ ఉద్యోగస్తులుగా పనిచేస్తున్న వారిని యాలాల వికారాబాద్ మండలాలలో ఉన్న హాస్టళ్లకు బదిలీ చేశారు. మంచి వాతావరణంలో సు విశాలమైన 20 గదులు 20 మరుగుదొడ్లు ఆట స్థలం తో పాటు సొంత భవనం కలిగి ఉంది. సకల సౌకర్యాలు కలిగిన హాస్టల్లో విద్యార్థులను చేర్పించకుండా ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులను ఇతర హాస్టల్లకు బదిలీ చేస్తూ హాస్టల్లో మూసివేశారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు చర్యలు తీసుకోకపోవడం కోస మెరుపు.. పట్లూర్ హాస్టల్ లో ఎత్తి వేసే విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు పట్లూర్ హాస్టల్ ను ఎత్తివేయకుండా ఆగస్టు అకాడమిక్ ఇయర్ వరకు విద్యార్థులను హాస్టల్లో చేర్పించి హాస్టల్ నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

# 10 కోట్లతో పోలీస్ స్టేషన్‌లకు సొంతభవనాలు

- కెమికల్ డ్రగ్స్ తయారు చేసే పది పరిశ్రమల సీజ్
- యువత మత్తుకు బానిస కావొద్దు
- రాష్ట్ర డిజిపి జితేందర్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 4 (జనం సాక్షి) :** మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని యువతకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ హితవు పలికారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో 10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే పోలీస్ స్టేషన్లకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జై న్, డిఐజి తాఫ్సీర్ ఎగ్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజిపి రమేష్ లతో కలిసి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ కొడంగల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శంకుస్థాపనలు గావించి, భూమి పూజ చేశారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ 2.96 కోట్లు, సర్కిల్ పోలీస్ స్టేషన్ 84.50 లక్షలు, దుద్యాల పోలీస్ స్టేషన్ 3 కోట్లు, బొమ్మరాస్ పెట 2.96 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పనులకు డైరెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ జనరల్ జితేందర్ శంకుస్థాపన గావించారు. అనంతరం డీజీ జితేందర్ మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కొడంగల్ పరిధిలో 10 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని అని ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మాదకద్రవ్యాల తరలింపుపై ప్రత్యేక నిఘాతో దోషులను గుర్తించడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కెమికల్ డ్రగ్స్ తయారుచేసే పది పరిశ్రమలను గుర్తించి సీజ్ చేసినట్లు తెలియజేశారు. గంజాయి రహిత తెలంగాణను ఏర్పాటు చేయడానికి పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని చాక్లెట్లు సరఫరా జరిగిందని వాటిని పట్టుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. మారకద్రవ్యాలు సంబంధించి కేసులో మహారాష్ట్ర గోవాకు చెందిన కొందరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. యువత చెడు వ్యసనాలకు గురి కావడం వల్ల కుటుంబాలు చెల్లాచెదురు అవుతున్నాయని, ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థానాలను తెలుసుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. పోలీస్ స్టేషన్ల శంకుస్థాపన కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, పరిగి డిఎస్పి శ్రీనివాస్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విజయకుమార్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# బొంరాస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**బొంరాస్‌పేట, జూలై 4 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారిని లలితా దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు సంభవించకుండా గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. నూతన వైద్యాధికారిగా మొదటిసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఆమెను మండల వైద్యాధికారి హేమంత్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో రవీంద్ర యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

బొంరాస్ పేట మండలం ఏర్పుమళ్ళ గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫ్రైడే డ్రై డే సందర్భంగా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, పల్లె దవాఖాన వైద్యాధికారి అక్షయ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, ఆశా వర్కర్లు నర్సమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



**శివ్వంపేట, జూలై 4 (జనంసాక్షి) :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సీఐటీయూ శివ్వంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే వారి యొక్క అకౌంట్ లో వేయాలని శివ్వంపేట ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు గత మూడు నెలల నుండి పెండింగ్ వేతనాలు రాకపోవడం తో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటురన్నారు. మల్టీపర్పస్ విధానం తీసుకొచ్చిన తర్వాత గ్రామాలలో అనేక పనులు చేయిస్తూ ఉంటుంది తప్ప వారి ఖాతాలో డబ్బులు జమ చేసే దాంట్లో విఫలమైందని ఆయన అన్నారు. కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని పెండింగ్లో ఉన్న వేతనాల తక్షణమే వారి ఖాతాల్లో జమ చేస్తామని ఎంపీడీఓ ,ఎంపీఓలు గతంలో హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి యొక్క న్యాయమైన డిమాండ్లు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, జీవో నెంబర్ 51 సవరించి జివో ను అమలు చేయాలి వీరి యొక్క డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి శంకర్, బిక్షపతి ,స్వామి, చంద్రయ్య, శ్రీకాంత్, ఆగమయ్య, నర్సింలు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు విలేకరులు

- పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి




**బోడుప్పల్, జూలై 4 (జనంసాక్షి) :** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి లాంటి వారు పత్రిక విలేకరులని ఫీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆవరణలో కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు వి. సూర్యనారాయణ రెడ్డి ,మాజీ అధ్యక్షుడు కల్యారి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్ , కోశాధికారి మరాటి మల్లేష్ ఉపాధ్యక్షులు సైరెడ్డి సాగర్ రెడ్డి ,చింత రమేష్, కోఆర్డినేటర్ రావు నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు, నీరుడు అంజన్ కుమార్, దాసరి దయాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బుషా గణేష్ ,భాస్కర చారీ, శేరి కరుణాకర్ రెడ్డి, మరాటి మత్స్యగిరి,జక్కు భగీరథరెడ్డి,జంగా నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్యాంటు జేబులో సెల్‌ఫోన్ పేలి గాయాలు





**రాజేంద్రనగర్, జూలై 4 (జనం సాక్షి) :** ప్యాంటూ జేబులో పెట్టుకున్న ఫోన్ పేలిన ఘటన రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్‌లో చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం, అత్తాపూర్ సమీపంలోని శ్రీనివాస్ అనే యువకుడు తన ప్యాంటు జేబులో మొబైల్ ఫోన్ పెట్టుకొని బైక్ పై వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా ఫోన్ హీటెక్కి మంటలు రావడంతో వెంటనే జేబులో నుంచి ఆ ఫోన్ బయటకు తీశాడు. అప్పటికే ఫోన్ హీట్ వల్ల తీవ్రంగా కాలు కాలింది. వెంటనే స్థానికంగా ఉన్న హాస్పటల్ కి వెళ్ళాడు. వైద్యం చేసిన డాక్టర్ తన తొడ పైభాగంలో ఉన్న చర్మం కాలి మరో లేయర్ వరకు చేరుకుందని వెంటనే అప్రమత్తం అవ్వకుంటే లేయర్ తో పాటు కండరాల వరకు కాలి తీవ్రంగా నష్టం జరిగేదని డాక్టర్ తెలిపారు.

# పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి



**ఇబ్రహీంపట్నం, జూలై 4 (జనం సాక్షి) :** సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తపస్ మంచాల మండల శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలను సందర్శించడమైనది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేసి, పిఆర్‌సిని అమలు చెయ్యాలని, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ స్కూళ్ల సమస్యలను పరిష్కరించడానికి తపస్ సంఘం కట్టుబడి ఉందని, పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల కోసం తపస్ సంఘం ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధంగా ఉందని.. అందుకు ఉపాధ్యాయుల మద్దతు టిపియుఎస్ సంఘానికి ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేయగా.. స్పందించిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున సంఘానికి సభ్యత్వం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ, మంచాల మండల శాఖ అధ్యక్షులు రావుల శివ కుమార్, ప్రధాన కార్యదర్శి మాధవరం రవీందర్ రావు, మండల నాయకులు వెంకటేష్, బాలరాజ్, యాదగిరి, ఐలయ్య, నర్సింహా పాల్గొన్నారు.

# సమాన పనికి, సమాన వేతనం అందించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బాగి కృష్ణయ్య



**జడ్చర్ల, జూలై 4 (జనం సాక్షి) :** అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి, సమాన వేతనం అందించి, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు భాగి కృష్ణయ్య డిమాండ్ చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య జడ్చర్ల ఏరియా ఆస్పత్రి కార్మికులతో కలిసి ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రకళకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా బాగి కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల శ్రేయస్సుకై, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై జులై 9న నిర్వహిస్తున్న దేశవాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో 47 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ భద్రత, కనీస మౌలిక వసతులు అందుతున్నాయని, 40 కోట్ల మంది కార్మికులకు కనీస వసతులు, ఉద్యోగ భద్రత లేక, అధిక పని గంటలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య జడ్చర్ల ఏరియా ఆస్పత్రి సంఘం అధ్యక్షులు నరసింహా, రామకృష్ణ, అలివేల, భార్గవి, నీరజ, సుక్కమ్మ, అలివేలు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి పరిశ్రమ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలు
- త్వరలో మృతుల కుటుంబాలకు, క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 4 (జనం సాక్షి) :** సిగాచి పరిశ్రమంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన పటాన్చెరువు మండలం, పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమను సందర్శించారు. స్పెషల్ సెక్రటరీ రెవెన్యూ , డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖ,అరవింద్ కుమార్ , పరిశ్రమలు, కార్మిక శాఖ , స్పెషల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అగ్నిమాపక శాఖ అధికారులు పరిశ్రమలో అగ్నిమాపక శాఖ, పొల్యూషన్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, పరిశ్రమల శాఖ సిబ్బంది,కంపెనీ ప్రతినిధులు ,పోలీసులు ,రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష జరిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పరిశ్రమల భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ మెకానిజం నిర్వహణపై సంబంధిత శాఖలతో ఆయన సమీక్షించారు. పరిశ్రమలో రియాక్టర్లు, డ్రైయర్లు, ఫైర్ ఫైట్ సిస్టం, ఉద్యోగుల రక్షణ మార్గాలు, ఇతర భద్రతా అంశాలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ... ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల కోసం ఐలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతోమాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా త్వరలో మృతుల కుటుంబాలకు క్షతగాత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహయ చర్యలు మరింత సమర్థవంతంగా సాగేందుకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఖర్గే సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



**ఉప్పల్, జూలై 4 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి నేతృత్వంలో శుక్రవారం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులను సభకు తరలించారు. ఈ సందర్భంగా వార్డు, గ్రామ కమిటీ అధ్యక్షులతో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆత్మీయ సమ్మేళనంలో కలువనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలోను ఖర్గే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతారు. జాతీయ అధ్యక్షులు తొలిసారిగా ఖర్గే రాష్ట్రానికి వచ్చినట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. గ్రామ, వార్డు కమిటీలను ఒక జాతీయ అధ్యక్షులు కలువడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
05 జూలై 2025

# సిగాచి పరిశ్రమలో కొనసాగుతున్న సహాయక చర్యలు

- శిథిలాల కింద బయటపడుతున్న మృతదేహాలు
- బయటపడ్డ 10 మంది మృతదేహాలు
- ఆచూకీ లభించని 10 మంది కార్మికులు
- బాధలు వెల్లబోసుకుంటున్న మృతుల కుటుంబ సభ్యులు



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 4 (జనం సాక్షి) :** పటాన్‌చెరువు పాశమైలారంలో ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడుస్తున్న సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇంకా శిథిలాల కింద మృతదేహాలు బయట పడుతున్నాయి. గురువారం నుంచి ఇప్పటివరకు మరో పది మృతదేహాలు లభ్యమయ్యాయి. 10 మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. పరిశ్రమ వద్ద మృతుల కుటుంబ సభ్యులు తమ బాధలు వెల్లబోసుకుంటున్నారు. నాలుగు రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్న గల్లంతైన 10 మంది కార్మికుల ఆచూకీ లభ్యం కాలేదు. అంత దేహాలు లభ్యమైనప్పటికీ ఎవరివి అనేది గుర్తించలేకపోతున్నారు. నాలుగు రోజులు గడుస్తున్న తమ వారి ఆచూకీ దొరకక పోవడంతో కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అవ సరమైతే సహాయక చర్యలలో తాము పాల్గొంటామని అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. అయితే అధికారులు వారికి సర్ది చెప్తూ సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. పరిశ్రమలో ధ్వంసం అయిన శిథి లాలను అధికారులు పక్కన ఉన్న ఖాళీ స్థలానికి తరలిస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి టిప్పర్ల సహాయంతో శిథిలాలను తరలిస్తున్నారు. ఆ శిథిలాల్లో సహాయక బృందాలు మళ్లీ తనిఖీలు చేస్తున్నారు. అందులో కొన్ని శరీర భాగాలతో పాటు ఎముకలు లభ్యమయ్యాయి. ఈ భాగాలను అధికా రులు ఫోరెన్సిక్ కు తరలించారు. మూడు రోజులుగా సేకరించిన కుటుంబ సభ్యుల రక్త నమూనాలతో సరి పోల్చడానికి డీఎన్ఏ పరీక్షలకు పంపించారు. ఇంకా సహాయక చర్యలు ఉధృతంగా కొనసాగుతున్నాయి.

# ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సీఐ భాస్కర్ రెడ్డి
- కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**కాప్రా, జూలై 4 (జనం సాక్షి) :** ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎల్ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సైబర్ నేరాలపై కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ క్రైమ్ బాధితులు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించిన వెంటనే వారికి ధైర్యం కల్పించి, దగ్గరుండి వారిని 1930 లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ సైబర్ క్రైమ్ డాట్ గవర్నమెంట్ డాట్ ఇన్ వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్ ఫిర్యాదు చేయించి, సకాలంలో బాధితులు కోల్పోయిన డబ్బుని నిందితుల ఖాతాలో ఫ్రీజ్ , లైన్ చేయించి, తర్వాత తగు విచారణ ద్వారా నిందితుల వివరాలు సేకరించి, పోలీస్ స్టేషన్ లోని సైబర్ వారియర్స్ ద్వారా కోర్టులో బాధితుల అమౌంటు రిఫండ్ కొరకై రిక్విజిషన్ లను ఫైల్ చేయడం జరిగింది, అందుకుగాను కుషాయిగూడ కోర్టు గౌరవనీయులైన మెజిస్ట్రేట్ ద్వారా 90 మంది బాధితులకు గాను కోర్ట్ ఆర్డర్లు పొంది, ఈరోజు జరిగిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులో అట్టి బాధితులకు కోర్ట్ ఆర్డర్లను రిఫండ్ నిమిత్తమై అందివ్వడం జరిగినది. సదస్సులో విచ్చేసిన బాధితులు వారికి జరిగిన సైబర్ మోసాల గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాలు నుండి అప్రమత్తంగా ఉంటూ, తగు చర్యలు, జాగ్రత్తలు తీసుకుంటూ, పోలీసులకి ఎల్లవేళలా సమన్వయంగా ఉండాలని తెలియజేసినారు. అలాగే ఈరోజు జరిగిన సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులో 90మంది బాధితులకు గాను మొత్తంగా 15,23,484 /- రూపాయల విలువగల కోట్ ఆర్డర్లను పోలీస్ స్టేషన్ తరపునుండి అందజేశారు.

# సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి




ఖైరతాబాద్, జూలై 4 (జనం సాక్షి) : దేశంలో అతిపెద్ద అధునాతన అల్యూమినియం సోలార్ ఫ్రేమ్ తయారీ ప్లాంట్‌ను గుజరాత్ లోని రాజ్‌కోట్ లోని చిబ్డా గ్రామంలో కేంద్ర జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు హెచ్ అండ్ హెచ్ అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు ఉత్తమ్ పటేల్, విజయ్ కనేరియా శుక్రవా రం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యేటా 24 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ దేశంలో 6 గిగావాట్ల సౌర విద్యుత్తు సంస్థాపనకు మద్దతు ఇస్తుందన్నారు.

## వెదజల్లే పద్ధతిలో వరి సాగు లాభదాయకం




**నంగునూర్, జూలై 4 (జనం సాక్షి) :** డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలోని చల్లారం రాజశేఖర్ రెడ్డి రైతు క్షేత్రంలో వరి పంటలో నేరుగా వెదజల్లే పద్ధతి గురించి డెమో చేయడం జరిగింది. ఈ పద్ధతిలో వరి సాగుచేయడం వలన విత్తన మోతాదును మరియు కూలీల ఖర్చు కలిపి ఎకరాకు 6000-8000 వరకు ఆదా చేసుకోవచ్చునని కమ్యూనిటీ ఫెసిలిటేటర్ కే. భార్గవి తెలియజేసారు. అలాగే నూతన పద్దతులైన డ్రం సీడర్ మరియు పొడి దుక్కిలో యాంత్రిక మెట్ట వరి సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా కూలీల ఖర్చు, విత్తన మోతాదు మరియు నీటి దుర్వినియోగాన్ని తగ్గించవచ్చునని తెలియజేసారు. అలాగే డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నంగనూరు మరియు కోహెడా మండలాల్లోని వరి రైతులకు డ్రం సీడర్ మరియు మల్టీ క్రాప్ ప్లాంటర్ మెషీన్ లను ఉంచితంగా అందుబాటులోకి తెచ్చామని తెలియజేస్తూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం

**మోమిన్‌పేట, జూలై 4 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో గల నగరంలోని ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ నాయకుల ముఖాముఖి సదస్సుకు మండల పరిధిలోని నాయకులం పెద్ద ఎత్తున తరలి వెళ్లామని నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో ఖర్గే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ ఫామేన భీమ్ భరత్ నాయకత్వంలో, నవాబ్పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నవాబుపేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నవాబ్పేట్ మండల కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, మండల పరిధిలోని ప్రతి గ్రామం నుండి ఎల్బీ స్టేడియంలో జరిగే సమావేశానికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయడానికి ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయ దుందుభి మోగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బలపరుస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో నవాబ్ పెట్ మండలం నుండి సుమారు 500 పైగా ఖర్గే సమావేశానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నవాబు పేట్ మండల ఉపాధ్యక్షుడు మీనెపల్లి శివప్రసాద్,మండల యూత్ అధ్యక్షుడు తలారి శేఖర్, గణపురం ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాండూరు పట్టణ సమస్యలు పరిష్కరించండి



**తాండూరు, జూలై 4 (జనంసాక్షి) :** తాండూరు పట్టణ సమస్యలు పరిష్కరించాలనీ ఎంపీ శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి తాండూరు పట్టణ భారతీయ జనతా పార్టీ నేతలు విన్నవించారు. శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం తాండూరు పట్టణ సమస్యలు తాండూర్ టు వికారాబాద్ రోడ్డు అధ్వానంగా ఉందని, లారీ ఓనర్లు అంబులెన్స్ వాళ్ళు సొంత కారు ఓనర్లు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ప్రాణం హరీ చేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలోని బీసీ స్మశానవాటికలు అగమ్యగోచరంగా మారాయి. స్మశాన వాటికలో ఎటువంటి కనీస అవసరాలు తీర్చే బోరు గాని, ఇంటర్నల్ రోడ్లు గాని, షెడ్డు గాని ఏమీ లేక పట్టణ ప్రజలు ముఖ్యంగా బీసీ కులాల వారు చనిపోతే వర్షం పడినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్మశాన వాటికను కూడా కబ్జా చేయడం జరిగిందని ఎంపి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ , సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

# జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ నాయకులు ఎర్రోళ్ల రవి




**కొల్లాపూర్, జూలై 4 (జనం సాక్షి) :** జులై 9 నా దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘా లు సార్వత్రిక సమ్మె పిలుపునిచ్చాయని సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని క్రౌన్ బీర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సిఐటియు నాయకులు రవి, పిలుపునిచ్చారు. శుక్రవారం క్రౌన్ బీర్ ఇండియాప్రైవేట్ లిమిటెడ్ కార్మిక సంఘం వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ రమేష్, ఆర్గనైజర్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ ఎర్రోళ్ల రవి, శివయ్య లక్ష్మణ్ మురారి సింగ్, కాంట్రాక్ట్ యూనియన్ జనరల్ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, మాజీ ఆర్గనైజర్ సెక్రెటరీ సుధీర్ రెడ్డి, కొత్తగడి, రవి,విల్సన్, కుమార్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిది

- జాయింట్ డైరెక్టర్ యం.సోమిరెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 4 (జనంసాక్షి) :** తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని తెలంగాణ ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ యం.సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా సందర్శించారు.అనంతరం డీఈఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలలో పదవ తరగతి లోపు,డ్రాపౌట్ విద్యార్థులలను ఓపెన్ పదవ తరగతిలో పాసై ఇంటర్ డ్రాపౌట్ విద్యార్థులను,ఓపెన్ ఇంటర్లో అడ్మిషన్స్ చేయించాలని, డ్రాపౌట్ లేకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్లో ప్రవే శాలు పొందేందుకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తు సమర్పణకు జులై 11 వరకు గడువుంది. రూ.200 అపరాధ రుసుముతో ఆగస్టు 12 వరకు అవకాశం కల్పించామని తెలిపారు.ఎస్ ఇ ఆర్ పి ద్వార మహిళా సంఘాల్లో చదువురాని వారిని గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. దేశంలోని ప్రతి మ హిళకు చదువు చెప్పాలనే ఉద్దే శంతో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అన్ ఇన్ సొసైటీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. 15 ఏండ్ల వయస్సు పైబడిన నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం, వారికి అవసరమైన నైపుణ్యాలను నేర్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. అడిషనల్ కలెక్టర్ ఏల్‌బి అధ్వర్యంలో నిర్వహించిన కన్వర్జెన్స్ సమావేశంలో డి ఆర్ డి ఓ తో సమావేశం కు, తెలంగాణ ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ యం.సోమిరెడ్డి , డీఈవో మహమ్మద్ అబ్దుల్ ఘని, డి ఆర్ డి ఓ ఉమాదేవి,డిపిఎం ప్రభాకర్, బి డబ్ల్యు ఓ సుధారాణి , స్టేట్ గర్ల్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నితిన్, అడల్ట్ ఎడ్యుకేషన్ ఏ పీ ఓ రాజేంద్ర ప్రసాద్, టాస్క్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# సంప్రదాయాలు, సంస్కృతికి పుట్టినిల్లు భారత్

- కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది
- బీదర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ పరమేశ్వర్
- న్యాల్‌కల్ మండలంలో అట్టహాసంగా కళాకారుల ప్రదర్శన



**న్యాల్‌కల్, జూలై 4 (జనం సాక్షి) :** విభిన్న సంప్రదాయాలు, సంస్కృతి, కళాకారుల పుట్టినిల్లు, విశ్వ గురు మాతృదేశం భారత్ అని, కళాకారులను, కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీదర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డాక్టర్ పరమేశ్వర్, జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ జక్కుల హనుమంతు స్పష్టం చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, మామిడిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో.. "కర్ణాటక సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి సంస్థ", "ఓం సాయి గ్రామీణాభివృద్ధి సంస్థ గణేష్ పూర్" వారి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు శివశరణప్ప, డాక్టర్ జగన్నాథ్ హెబ్బాళే అధ్యక్షతన మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా కొనసాగింది. ప్రొఫెసర్ పరమేశ్వర్, సీఐ జక్కుల హనుమంతు, ముఖ్య అథితి శివయ్య స్వామి, గౌరవ అతిథులు సంజీవ్ కుమార్, తదితరులు డోలు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. ప్రొఫెసర్ డాక్టర్ పరమేశ్వర్, జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు మార్గదర్శించడం చేస్తూ.. ప్రస్తుత తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, చరవాణి వాడకంలో కొంతమేరకు ప్రధానంగా యువత చెడు మార్గాన పయనిస్తుందని, సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతతో పాటు ప్రతి ఒక్కరు ప్రయోజనం, ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలిగే విధంగా చరవాణిని వినియోగించుకోవాలని సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్నటువంటి సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. శతాబ్దాల క్రితం నుండి సంప్రదాయంగా వచ్చిన కళలు ప్రజానీకానికి ఎంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయని సూచించారు. అనంతరం కర్ణాటకలోని బసవ కళ్యాణ్, సంతపూర్, అణదూర్ వాడి, హుమ్నాబాద్, బీదర్, తదితర ప్రాంతాలకు చెందిన కళాకారులతో పాటు స్థానిక మామిడిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు చేపట్టిన కళా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులు నిర్వహించిన కంసాళే, సుగ్గి, లంబాడి నృత్యం, బతుకమ్మ, డోలు నృత్యం, కోలాట, తదితర ఆట పాటలతో కళాకారులు సందడి చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రత్యేక ఆహ్వానితులకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ప్రదర్శన చేసిన కళాకారులకు, విద్యార్థునులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షురాలు రజిని రెడ్డి, శివశరణప్ప, డాక్టర్ రాజ్ కుమార్ హెబ్బాళే, జగన్నాథ్ రెడ్డి, రాజ్ కుమార్, సావిత్రిబాయి, సునీత, యోగేంద్ర, మహేష్, గురుదేవ్, వైద్యనాథ్ పాటిల్, జగన్నాథ్, మల్లప్ప పటేల్, రాజిరెడ్డి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు మత్తుకు దూరంగా ఉండాలి

- డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్



**కొడంగల్, జూలై 4 (జనం సాక్షి) :** యువత చెడు అలవాట్లకు మత్తుకు దూరంగా ఉండాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ హితవు పలికారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో 10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే పోలీస్ స్టేషన్లకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జై న్, డిఐజి తాఫ్సీర్ ఎగ్బాల్, ఎస్పీ నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజిపి రమేష్, కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జి తిరుపతి రెడ్డి లతో కలిసి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్ కొడంగల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శంకుస్థాపనలు గావించి, భూమి పూజ చేశారు. కొడంగల్ పోలీస్ స్టేషన్ 2.96 కోట్లు, సర్కిల్ పోలీస్ స్టేషన్ 84.50 లక్షలు, దుద్యాల పోలీస్ స్టేషన్ 3 కోట్లు, బొమ్మరాస్ పెట్ 2.96 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పనులకు డైరెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ జనరల్ జితేందర్ శంకుస్థాపన గావించారు. అనంతరం డీజీ జితేందర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కొడంగల్ పరిధిలో 10 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పోలీస్ స్టేషన్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని అని ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి మాదకద్రవ్యాల తరలింపు పై ప్రత్యేక నిఘాతో దోషులను గుర్తించడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. యువత చెడు వ్యసనాలకు గురి కావడం వల్ల కుటుంబాలు చెల్లాచెదురు అవుతున్నాయని, ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్ధానాలను తెలుసుకొని తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు.పోలీస్ స్టేషన్ల శంకుస్థాపన కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, పరిగి డిఎస్పి శ్రీనివాస్,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,తహసిల్దార్ విజయకుమార్, సీఐ శ్రీధర్ రెడ్డి,ఎస్ఐ సత్య నారాయణ స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వేయించాలని విద్యార్థుల రాస్తారోకో

### ఎమ్మెల్యే, కలెక్టర్ రావాలని విద్యార్థుల డిమాండ్

### అధికారుల హామీతో ఆందోళన విరమణ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూలై 4 ( జనం సాక్షి) :** పేరుకే డబుల్ రోడ్డు... బురదలో విద్యార్థులు ప్రతిరోజు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లి రావడం వారికి నరకయాతనగా మారింది. దీంతో విద్యార్థులు రోడ్డెక్కారు. శుక్రవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని కాగజ్ నగర్ దహెగా - డబుల్ రోడ్డు ప్రధాన రహదారి లో గల బట్పల్లిఅందమైన గ్రామాల మధ్య గల రోడ్డుపై విద్యార్థులు రాస్తారోకో చేశారు. దీంతో కిలో మీటర్ల పడవనా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా విద్యార్థు ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి 10 గంటల 30 నిమిషాల వరకు విద్యార్థులు రాస్తారోకో చేశారు. వీరికి మద్దతుగా యువకులు, ప్రయాణికులు సంఘీభావం తెలిపారు. గత 8 సంవత్సరాల క్రితం డబుల్ రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. కానీ బట్పల్లి-ఉండవెల్లి గ్రామాల మధ్య గల రైతులు తమ భూములు కోల్పోతున్నామని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు రైతులు నష్టపోతున్న భూమిలో రోడ్డు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఆర్ అండ్ బి అధికారులు సుమారు కిలోమీటర్ మేర బి.టి రోడ్డు వేయకుండా వదిలివేశారు. దీంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రోడ్లు గుంతల మయంగా తయారై విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందమైన గ్రామానికి చెందిన విద్యార్థులు బట్టుపల్లి గ్రామంలో గల ఉన్నత పాఠశాలకు ప్రతిరోజు వచ్చి వెళుతుంటారు. ఈ విధంగా రోడ్డు బురదమయంగా , గుంతలు ఏర్పడడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే లు రావాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల క్రితం ప్రస్తుతం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు ఇక్కడే రోడ్డుపైన గుంతల్లో నార్లు వేసి నిరసన తెలిపారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని , అలాగే ఈ రహదారిపై కలెక్టర్, ఇతర ఉన్నత అధికారులు ప్రతిరోజు ప్రయా ణాలు కొనసాగిస్తారని.. అయినప్పటికీ తన గోడు, బాధలు వారికి పట్టడం లేదని విద్యార్థులు, ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తపరిచారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కోట ప్రసాద్ మొదట రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యను అడిగి తెలుసుకుని, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తారని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అయినప్పటికీ విద్యార్థులు ససేమిరా అంటూ ఆందోళన చేశారు. అనంతరం కాగజ్ నగర్ తాహా సిల్దార్ మధుకర్ అక్కడ చేరుకొని సబ్ కలెక్టర్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు రెండు రోజుల్లో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులతో తాహసిల్దార్ మాట్లాడారు. విద్యార్థులు అధికారులకు వారం రోజులు గడువు ఇచ్చారు. రోడ్డుకు మరమ్మతు చేయకపోతే తహసిల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి మళ్లీ ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఆందోళన అనంతరం కాగజ్నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్, ఇస్గాన్ ఎస్ఐ కళ్యాణ్ లు స్తంభించిన ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

# అటవీ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్,జూలై 4 (జనం సాక్షి) :** జిల్లాలోని మారుమూల అటవీ,గిరిజన ప్రాంతాల ప్రజలకు రవాణా,మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ కమిటీ(డి ఎల్ సి)సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అటవీ, రెవెన్యూ, ఆర్అండ్బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 16 రహదారి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించగా, అందులో 9 ప్రాజెక్టులకు అటవీ అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన 7 ప్రాజెక్టుల విషయంపై డాక్యుమెంటేషన్, నివేదికలు పూర్తి చేయాల్సిన కారణంగా పరిశీలనను వాయిదా వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ చట్టాలను పాటిస్తూ గ్రామాల మధ్య రహదారి కనెక్టివిటీ,విద్యుత్,ఆరోగ్య సేవలు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ప్రాజెక్టులు చేపట్టే ముందు పరివేశ్ పోర్టల్ ద్వారా అటవీ అనుమతులకు సంబంధిత శాఖలు దరఖాస్తు చేయాలని,అవసరమైన మ్యాపులు,డీపీఆర్లు సమగ్రంగా సమర్పించాలని సూచించారు.అలాగే కడెం మండలం మైసం పెట్ గ్రామాన్ని పునరావాస గ్రామంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రతి కుటుంబానికి మని ప్యాకేజ్, అటవీ హక్కుల చట్టం కింద సాగు భూములకు పట్టాలు అందించే ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు.పునరావాస గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,అటవీ అధికారులు నాగిని భాను,రేవంత్ చంద్ర,ఆర్డీవో రత్న కళ్యాణి,ఆర్ అండ్ బీ ఈఈ నర్సయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియ నాయక్, గిరిజన సంక్షేమ అధికారి అంబాజి,ఏడీ ఎస్-ఎల్ఆర్ సుదర్శన్, తహసీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనిజేటి రోశయ్య జయంతి వేడుకలు

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జులై 04(జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, జిల్లా పౌర సంబంధాల అధికారి యండి రఫిక్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, సలీం రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాలకు గవర్నర్ గా విశిష్టమైన సేవలు అందించారని తెలిపారు. రోశయ్య రాజకీయ జీవితమంతా ప్రజల సంక్షేమం, నిస్వార్థ సేవకే అంకితమైందని ఆయన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొని రోశయ్య సేవల్ని స్మరించుకున్నారు.

# సెల్ షాపు, టీ స్టాల్‌లో చోరీ

### రూ. 70 వేల విలువ చేసే వస్తు సామాగ్రి అపహరణ

### డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం అధికారుల నమూనాల సేకరణ



**చెన్నారావుపేట, జూలై 4 (జనం సాక్షి):** సెల్ షాపు, టీ స్టాల్ లో చోరీ జరిగిన సంఘటన మండలంలోని ముగ్దుంపురం గ్రామ శివారులో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన కోట రాజు చెన్నారావుపేట నెక్కొండ ప్రధాన రహదారిలో జయముకి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆర్ కె సెల్ షాపు పెట్టుకుని నడుపుతున్నాడు. ముగ్దుంపురం తండాకు చెందిన మాలోతు బేబీ రాణి మణికంఠ టీ స్టాల్ ను నిర్వహిస్తుంది. రోజువారి మాదిరిగానే గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు తమ షాపులను నడుపుకొని తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి వేళలో గుర్తుతెలియని దుండగులు గడ్డపారతో తాళాలను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. సెల్ షాపులో స్పీకర్ బాక్స్ లు, పౌచులు, బ్లూటూత్ లు, చార్జర్లు, చార్జింగ్ కేబుల్ వైర్లు, సెల్ ఫోన్లకు వాడే గ్లాసులు సుమారు రూ. 30 వేల విలువచేసే సామాగ్రి, టీ స్టాల్ లో రూ.40 వేల విలువచేసే వివిధ బ్రాండ్ల సిగరెట్ బాక్సులు, కూల్ డ్రింక్స్ లను అపహరించుకు పోయారు. శుక్రవారం ఉదయం షాపులకు వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజేష్ రెడ్డి పోలీస్ సిబ్బందితో చేరుకొని చోరీ జరిగిన షాపులను పరిశీలించారు. అలాగే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రల నమూనాలను సేకరించారు.

# భూపాలపల్లి ఏరియా ఆసుపత్రిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

### డాక్టర్లను అభినందించిన ఏరియా జిఎం రాజేశ్వరరెడ్డి



**భూపాలపల్లి, జూలై 4 (జనం సాక్షి):** భూపాలపల్లి ఏరియా సింగరేణి ఆసుపత్రిలో ఈ నెలా 3,4 తేదీ లలో ఇద్దరు మహిళల రోగులకు గతకొంతకాలంగా మోకాలి నొప్పి తో బాధపడుతున్న వారికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. సంబంధించి పూర్తి వివరాలు 3 వ తారీకు నాడు మల్లమ్మ వయస్సు 61 పూర్తి కుడి మోకాలి మార్పిడి చేశారు.4 వ తారీకు నాడు అమృత వయస్సు 52 పూర్తి యెడమ కాలు మార్పిడి చేశారు. ఈ ఆపరేషన్ లను రామగుండం ఏరియా ఆసుపత్రి ఆర్థోసర్జన్ డాక్టర్ విక్రం , తిలక్ , సురేఖ, వేణుగోపాల్ భూపాలపల్లి ఏరియా డాక్టర్లు సంయుక్తంగా బృందంగా ఏర్పడి వేరే దగ్గరనుండి హాస్పిటల్ ఎక్విప్మెంట్స్ తీసుకొచ్చి ప్రత్యేక చొరవతో ఈ ఆపరేషన్ కార్పొరేట్ స్థాయిలో దాదాపుగా ఒక్కరికి లక్ష రూపాయలకు పైగా అయ్యే ఈ ఆపరేషన్ పూర్తిగా భూపాలపల్లి ఏరియా సింగరేణి లో మొదటిసారిగా చేసామని అన్నారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న సర్జెన్సును , ఆపరేషన్ టెక్నీషియన్స్ , ఏసియంఒ డాక్టర్ పద్మజ ఏరియా జిఎం వారినీ ప్రత్యేకంగా అభినందించారు అనీ ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి ప్రకటనలో తెలియచేసారు.

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై ఫోకస్ చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తహశీల్దార్లు మరింత ఫోకస్ చేయాలని, షెడ్యూల్ సిద్ధం చేసి నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై రెవెన్యూ, గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లతో మండలాల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలు, నోటీసులు జారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి తగిన షెడ్యూల్ సిద్ధం చేసి, దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేయాలని, నోటీసుల్లో సూచించిన తేదీన విచారణ పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ ఇండ్ల నిర్మాణానికి మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని డిఆర్డీఓకు సూచించారు. ఇళ్ళు నిర్మాణానికి ఇసుక కొరత లేదని దశల వారిగా నిర్మాణ ప్రగతిపై నిధులు జమ జరుగుతుందని జాప్యం చేయక నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. మంజూరు ఉత్తర్వులు జారీ చేసిన ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, డిపిఓ వీరభద్రయ్య, డిఆర్డీఓ బాలకృష్ణ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడీఓలు పాల్గొన్నారు.

# నక్షత్ర హాస్పటల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### రోగులకు అందుతున్న వైద్యంపై స్వయంగా పరిశీలన



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లా కేంద్రం లోని నక్షత్ర హాస్పటల్లో ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా విధానాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలపై అందులో పని చేస్తున్న వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు, చార్జెస్ బోర్డులు, కంప్యూటరైజ్డ్ బిల్లింగ్ వ్యవస్థ స్కానింగ్, డయాగ్నస్టిక్ సర్వీసుల ప్రమాణాలు, ఆరోగ్య శ్రీ, ఇతర ఆరోగ్య బీమా సేవలు, డ్రగ్స్ రిజిస్టర్ మెడికల్ నిల్వల నిర్వహణ , రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఆసుపత్రికి విచ్చేసిన రోగులతో స్వయంగా మాట్లాడి, వారు పొందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రజల ఆరోగ్యంపై ఆసుపత్రుల భాద్యతను గుర్తుచేసే విధంగా, అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా సేవలందించాలని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న కొన్ని లోపాలను గుర్తించి కలెక్టర్ ఆసుపత్రి యాజమాన్యానికి తగిన సూచనలు చేశారు.హాస్పిటల్ లో కార్డియాక్ కన్సల్టెంట్ డాక్టర్ పేరును డీఎంహెచ్వో ఆఫీసులో రిజిస్టర్ చేయనందుకు నోటీసు జారీ చేయాలని డిఎంహెచ్ఓ కు ఆదేశాలు జారీ చేశారు. విసిటింగ్ డాక్టర్స్ పేరుని విధిగా డిఎంహెచ్ఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు రోగులకు సంబంధించిన బిల్లు ను ప్రింటేడ్ కాపీలో ఇవ్వాలని సూచించారు.రేట్ చాట్ ను స్పష్టంగా రెండు భాషలో పేషెంట్ కి స్పష్టంగా కనబడేటట్టు ప్రదర్శించాలని, రేట్ చాట్ కంటే అధిక బిల్లు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆరోగ్య శ్రీ కార్డు సేవల. ఇన్సూరెన్స్ పై పూర్తిగా రోగికి , వాళ్ళకి సంబంధించిన వారికి అవగాహన కలిగించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన వ్యక్తి నుండి సమాచారం తీసుకున్న కలెక్టర్ అనంతరం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకున్న వ్యక్తితో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడారు. వైద్యసేవల విషయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఏవైనా అధిక ఫీజులు వసూలు చేశారా అనే ప్రశ్నకు, సదరు వ్యక్తి అలాంటిదేమీ లేదని, వైద్య సేవలు మెరుగ్గా అందించారని" వెల్లడించారు. కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, శ్రీధర్, డాక్టర్ సందీప్ ఐత్వార్, డాక్టర్ శిల్ప, ఆరోగ్య శ్రీ టీమ్ లీడర్, తదితరులు ఉన్నారు.

# మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూలై 4 (జనంసాక్షి) :** ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందిద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నాడు మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాలలో పాల్గొని మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాల్గొని పీడిత ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి అమరుడయ్యాడని, ప్రజా ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచారని తెలిపారు. పేద ప్రజల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్ గా పని చేసిన కొణిజేటి రోశయ్య గొప్ప ఆర్థికవేత్త అని, రాజకీయ, ప్రజా సేవా రంగాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. ఉ రాజ్యాంగానికి నిబద్ధత చూపుతూ తమిళనాడు గవర్నర్ గా నిష్పక్షపాతంగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో భావితరాలకు దేశ త్యాగధనుల ఆదర్శాన్ని అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, కుల సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

### ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**ములుగు ప్రతినిధి, జులై 04 (జనంసాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల రోజుల (జూలై 4వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ సూచించారు. కావునా శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# దొడ్డి కొమరయ్య ఆశయాలను కొనసాగించాలి

### జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**జనగామ ప్రతినిధి, జులై 4(జనంసాక్షి ):** శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ పోరాటం లో వెనుకబడిన తరగతుల కులాలకు అండగా నిలబడిన దొడ్డి కొమరయ్య మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వెనుకబడిన తరగతుల కులాలకు ప్రాధాన్యతనిచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నదన్నారు. వసతి గృహాలు నిర్మించి నాణ్యమైన విద్య తో పాటు భోజనాన్ని అందిస్తూ ఆర్థికంగా చేయూత అందిస్తున్నదన్నారు. వసతి గృహాలను వినియోగించుకోవాలని, విద్యార్థుల సంఖ్య 100% నమోదు కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కంచె రాములు, పట్టణ అధ్యక్షులు బల్దే మల్లేశం, పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి ఎండ్రు వైకుంఠం, యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు కానుగంటి ముత్తయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల బాలరాజు, రజక సంఘం జిల్లా సెక్రటరీ పదునూరి మాదార్, కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బల్దే వెంకట మల్లయ్య, కోపా అధ్యక్షులు కర్రే కృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్నేరు లోతట్టు ప్రాంతాల్లో నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అన్ని శాఖల యంత్రాంగం సమన్వయంతో కలిసి పని చేయాలి
- గత అనుభవాలను దృష్టా మరిన్ని పునరావాస కేంద్రాల ఏర్పాటు
- మున్నేరు లోతట్టు ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు



**ఖమ్మం రూరల్, జూలై 4 (జనం సాక్షి) :** మున్నేరు వరదలలో లోతట్టు ప్రాంతాలలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని మున్నేరు లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పర్యటించారు. కాల్వ ఒడ్డు మున్నేరు బ్రిడ్జి, బొక్కలగడ్డ, వినాయక నిమజ్జన ఘాట్ ప్రాంతం, ప్రకాష్ నగర్, జలగంనగర్ తదితర ప్రాంతాలను రాబోయే వరద ప్రభావం విపత్తు నిర్వహణపై ఎస్డీఆర్ఫ్ బృందాలు, రెవెన్యూ, ఇర్రిగేషన్, పంచాయతీ రాజ్, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు సన్నద్ధతపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విపత్తుల పట్ల ముందస్తు ఏర్పాట్లతో అధికారులు సన్నద్ధంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రజలకు కష్టం కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాలు, ప్రమాదకర నీటి వనరుల పట్ల ముందస్తుగా మ్యాపింగ్ చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయో గుర్తించి, వాటిని సరిదిద్దాలన్నారు. ఆపద మిత్ర క్రింద యువతి, యువకులను గుర్తించి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు, జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 139, పట్టణ ప్రాంతాల్లో 161 మంది యువతను నియమించినట్లు, ప్రజలకు వారి సేవలు అందించాలని సూచించారు. అధికారులు, ఆపదమిత్ర, ఫిషర్ మెన్, ఈతగాళ్లతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రమాదకర మేజర్ రోడ్లను ముందస్తుగా ఆర్టీసీ బస్సులతో బ్లాక్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పర్యాటకులను ప్రమాదకర ప్రదేశాల్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండి ముంపు ప్రాంతాల్లో ఉన్న మేజర్ టవర్ లకు ఏమైనా ఇబ్బందులు కలిగే సూచనలు ఉన్నచోట ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో 1077 నెంబర్ తో కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని తెలిపారు. గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 3 నెలల పాటు ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్ లను ముందుగా గుర్తించాలని, అవసరమైన పక్షంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను కూడా రిహాబిలిటేషన్ సెంటర్ గా ఏర్పాటు చేయాలని అన్నారు. వాతావరణ శాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు, జేసిబి, క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామాగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, సహాయ మున్సిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దారు సైదులు, రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎంపీడివో కుమార్, ఆర్ఐలు ప్రసాద్, ప్రసాద్ ఎండి ఆర్ ఎఫ్ బృందం సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, జూలై 4 (జనంసాక్షి) :** స్వామివివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. భారతీయ తత్త్వవేత్త స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలను చేవెళ్ల లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చేవెళ్ల మునిసిపాలిటీ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వామివివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కేవలం కొద్దికాలంలోనే భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని గుర్తుచేశారు. యువతలో స్ఫూర్తి నింపే ఆయన బోధనలు ఎప్పటికీ ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, మర్పల్లి కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్యాగరి రాములు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూకన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఉప సర్పంచులు గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి గుండాల రాములు, సొసైటీ డైరెక్టర్ పైండ్ల మధుసూదన్ రెడ్డి, నాయకులు గుత్తి మల్లేష్, సునిగంటి సాయికుమార్ గాంధీ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 4 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రం సమీపంలోని ఇమాంపేట తెలంగాణ గురుకుల రెసిడెన్షియల్ బాలికల కళాశాలను శుక్రవారం జిల్లా ఎస్పీ నరసింహ సందర్శించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవడం, లక్ష్య సాధనకు పట్టుదలతో నిరంతర కృషి చేయడం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి విద్యార్థులకు సృజనాత్మక అంశాలను వివరించారు.కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి రావాలని,ఉత్తమమైన, ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకోవాలని,చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వివరించారు.తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి ఎదగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అందరూ సహాయసహకారాలు అందించారని అన్నారు.మంచి మనసు మంచి మార్గంలో నడిపిస్తుందని, చెడు ఆలోచన చెడు వైపు నడిపిస్తుందని అన్నారు. ఒత్తిడికి గురవకుండా విద్యార్థులు బాగా చదువుకోవాలని, గడిచిన సమయం తిరిగిరాదని సమయాన్ని వృదా చేయకుండా ప్రతి నిమిషాన్ని మంచి చేయడానికి, జ్ఞానాన్ని సాధించడానికి వినియోగించాలని సూచించారు. గతంతో పోలిస్తే ఇప్పుడు వసతులు, అవకాశాలు బాగా పెరిగాయని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి అంశాన్ని, పాఠాలను రోజు క్రమం తప్పకుండా చదువుతూ తప్పులు చేయవద్దన్నారు.తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.సమస్యలు ఉంటే క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలుపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్,ఉపాధ్యాయులు,విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

**దేవరకొండ, జూలై 4 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం దేవరకొండ నియోజకవర్గంలో ఉన్న పలు సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను సందర్శించి రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, బాలుర ,బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను ఆమె ప్రత్యక్షంగా సందర్శించి ఆయా పాఠశాలలు, కళాశాలలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అంతేకాకుండా కావలసిన మౌలిక సదుపాయాల వివరాలను సేకరించారు. కొండమల్లేపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలను, తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను,మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలను సందర్శించి అక్కడున్న విద్యార్థుల సంఖ్య ,వసతులు,ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ అవసరమైన అదనపు మంచాలు, బాత్రూంలు, తాగునీటి వసతి, అదనపు తరగతి గదులు, డార్మేటరీ,తదితర వివరాలను కళాశాల ప్రిన్సిపల్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. గుండ్లపల్లి( డిండి) మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాల వివరాలు కనుకున్నారు. చందంపేట గిరిజన బాలికల మినీ గురుకులాన్ని సందర్శించి అక్కడ కూడా వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవరకొండలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల గురుకుల ప్రతిభా పాఠశాల/కళాశాల, గిరిజన బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల, కొండభీమనపల్లి వద్ద ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల/ కళాశాల, అలాగే తెలంగాణ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు,అవసరమైన మౌలికవసతులను పరిశీలించారు. కాగా ఆయా పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన అదనపు బ్లాకులు, విద్యార్థులకు టాయిలెట్లు, బాత్రూంలు, డ్యూయల్ డేస్కులు, తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మంచాలు,తదితర అవసరాలను అడిగి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో తాగునీటి ఓహెచ్ఎస్ఆర్ లు కావాలని, అదనంగా టాయిలెట్ బ్లాకులు కావాలని, డార్మెటరీ కావాలని, కాంపౌండ్ వాల్, బాత్రూంలు, సోలార్ ఫెన్సింగ్, డ్యూయల్ డెస్కులు, రెసిడెన్షియల్ బ్లాక్లులు, మంచాలు కావాలని జిల్లా కలెక్టర్‌తో ఆయా కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపల్స్ తెలియజేశారు.జిల్లా కలెక్టర్ వెంట ఆయా పాఠశాలల/ కళాశాలల ప్రిన్సిపల్స్ తో పాటు, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల రీజినల్ కో-ఆర్డినేటర్ బలరాం నాయక్, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు మండల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు ఉన్నారు.



# మున్నేరులో గల్లంతైన నలుగురు యువకులు





- చిన్న మండవలో విషాద ఛాయలు..
- సురక్షితంతంగా బయటపడ్డ ఇద్దరు యువకులు.
- మరో ఇద్దరు యువకుల మృతి
- గాలింపు చర్యల్లో అన్నదమ్ముల మృతదేహారు లభ్యం

**చింతకాని, జూలై 4 (జనం సాక్షి) :** చింతకాని మండలం చిన్న మండవ గ్రామంలో ఉన్న మున్నేరు పరివాహ ప్రాంతంలో నలుగురు యువకులు గల్లంతై ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలనుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నలుగురు యువకులు క్రికెట్ ఆడి తమ దగ్గర ఉన్నటువంటి బైకు శుభ్రం చేసేందుకు మున్నేరులోకి వెళ్లి బైకు శుభ్రం చేసి ఒడ్డు మీద పెట్టి మున్నేర్లకు దిగి ఈత కొడుతుండగా ఒక్కసారిగా వరద ఉధృతమై వరద ప్రవాహానికి నలుగురు యువకులు కొట్టుకుపోయారు. నలుగురిలో గోపి అనే యువకుడు ఈత కొట్టడం రావడంతో ఇద్దరు యువకుల్ని సురక్షితంగా బయటికి పంపించి తమ తమ్ముడు కోసం మరల వెళ్ళగా వరద ప్రవాహం ఎక్కువ అవడంతో తమ తమ్ముడిని కాపాడబోయి తమ్ముడు భయంతో అన్నపై గట్టిగా పట్టుకొని ఊపిరి ఆడకుండా చేయడంతో వరద ప్రవాహంలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందారని తెలిపారు. మృతి చెందిన యువకులు వివరాలు కాశీ మాల నాగ గోపి (22), కాశీ మాల నందకిషోర్ (18), తల్లిదండ్రులు చిన్న వెంకటి తల్లి సుభద్ర. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం ఇద్దరు పిల్లలు పుట్టినప్పటి నుండి చాలా గారాబంగా పోషించుకొని బ్రతికించుకొని ఈరోజు ఆ ఇద్దరు పిల్లల్ని కోల్పోవడం తల్లిదండ్రులు గుండె పగిలేలా వాపోతున్నారు దీంతో గ్రామ గ్రామం అంతా విషాద అలముకొని ప్రజలందరూ బావురుమని పిలిపిస్తున్నారు మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తామని ఏఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ టీ కరుణాకర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలకు బయటకు తీపించారు.

## గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్



**మోమిన్ పేట జూలై 4 (జనం సాక్షి) :** గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య పనులు, త్రాగునీటి సమస్య, వీధిలైట్లు, శానిటేషన్, పిచ్చి మొక్కల తొలగింపు, వంటి పనులపై దృష్టి సారించాలన్నారు గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. గ్రామాలలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆయా గ్రామాల కార్యదర్శిలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## పాఠశాలను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



**జడ్చర్ల, జూలై 4 (జనం సాక్షి):** పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ విసిటింగ్ లో భాగంగా శుక్రవారం జడ్చర్ల మండల పరిధిలోని కోడుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసర ప్రాంతాలను, పాఠశాలలో మౌలిక వసతులు, విద్యా సామాగ్రి తదితర విషయాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోడుగల్ ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు ఉపాధ్యాయులు తాహేర్ పాఠశాల అభివృద్ధికి సహకారం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన అడిషనల్ కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులా దేవి, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ రజిని రాగలత, ఉపాధ్యాయులు, విలేజ్ సెక్రటరీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



**గద్వాల నడిగడ్డ, జూలై 4 (జనం సాక్షి) :** డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్లను త్వరగా అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రాథమిక వసతులైన నీటి సరఫరా,విద్యుత్ కనెక్షన్లు, డ్రైనేజ్ వ్యవస్థ,సెప్టిక్ ట్యాంకులు,పరిసరాల శుభ్రత, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారి శ్రీనివాస రావు,విద్యుత్ శాఖ ఎస్.ఈ.తిరుపతి రావు, పంచాయతీ రాజ్ ఈ.ఈ. దామోదర్ రావు,మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో అధిక ఫీజుల దోపిడి అరికట్టాలి

- ప్రభుత్వం పీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి
- ప్రైవేటు స్కూల్ ల పై చర్యలు తీసుకొవాలి
- పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలి
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం
- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. శ్రీనివాస్



**తాండూరు, జూలై 4 (జనంసాక్షి) :** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు.. కళాశాలలో అధిక ఫీజుల దోపిడి అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ పేర్కొన్నారు. శక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్, రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు అబ్దుల్ వాహాబ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్య వ్యాపారాన్ని అరికట్టాలని పేద పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచితంగా విద్య హక్కు చట్టం ప్రకారం సీట్లు కేటాయించాలనిడిమాండ్ చేశారు. పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలో, నారాయణ స్కూల్ శ్రీ చైతన్య స్కూళ్లలో అధిక ఫీజుల దోపిడిని బుక్స్ పేరుతో యూనిఫామ్ పేరుతో అడ్మిషన్ పేరుతో అధిక ఫీజుల దోపిడిని ఆరికట్టడంలో అధికారులు ప్రభుత్వం వైఫల్యం అయిందని అని అన్నారు .తాండూరు మండల ఎంఈఓ ప్రైవేటు స్కూల్ యజమానులతో కుమ్మక్కై విచ్చలవిడిగా అధిక ధరలకు బుక్స్ యూనిఫామ్స్ పర్మిషన్ లేని బిల్డింగ్లలో రాత్రి పగలు అమ్ముకుంటున్న వాటిపై చర్య తీసుకోకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ అధికారులు జిల్లా డీఈవో కలెక్టర్ స్పందించి తాండూరు మండలం ఎంఈఓ పైన ప్రైవేటు పాఠశాలాల యజమానులపై చర్య తీసుకోవాలని తాండూరు పట్టణంలో అనుమతి లేని పాఠశాలల పై కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వ పీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారులి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాని నిర్వహించడమే కాదు ప్రభుత్వ ఉద్యోగులు, పిల్లలు ఎంపీ, ఎమ్మెల్యే ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచ్ అందరు ప్రభుత్వ బడులలో వారి పిల్లల్ని చేర్పించాలని అప్పుడే నిజమైన బడిబాట కార్యక్రమానికి ఉపయోగం జరుగుతుందని అన్నారు ప్రభుత్వం విద్యకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ ప్రైవేట్ పాఠశాలలో ఇష్టాను సారంగా ఫీజులు దోపిడివి చేస్తూ అడ్మిషన్ పేరుతో స్టేషనర్ పేరుతో దీంతో ఒక్కొక్క విద్యార్థితో, విద్యార్థుల తల్లిదండ్రులకు అనేక భారం అవుతున్న పరిస్థితి ఉంది వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల నియంత్రణ విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని. పేద,మధ్యతరగతి కుటుంబంలో ఉన్నటువంటి విద్యార్థులు చదువుకోవాలంటే చదువుకు దూరమయ్యే పరిస్థితి కనపడుతుంది ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పోరాట సంఘం తాండూర్ పట్టణ అధ్యక్షులు సాదిక్, సీపీఎం తాండూర్ నాయకులు వెంకటేష్ ,దళిత సంఘం నాయకుడు వై రాములు, ఎమ్ హెచ్ పి ఎస్ తాండూర్ డివిజన్ కన్వీనర్ సమియాదిన్, సిరాజ్, ముస్తఫా, ఎండి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.




# 'ఆర్‌కామ్'తో సంబంధం లేదు

## అంబానీ కంపెనీలు



**జనంసాక్షి:**రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఖాతాను ఫ్రాడ్ అకౌంటుగా ఎస్‌బీఐ వర్గీకరించడమనేది తమ వ్యాపారాలపై ఎలాంటి ప్రభావమూ చూపదని అనిల్ ధీరుభాయ్ అంబానీ గ్రూప్‌లో (అడాగ్) భాగమైన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ స్పష్టం చేశాయి. ఆర్‌కామ్‌తో తమకెలాంటి వ్యాపార, ఆర్థిక సంబంధాలు లేవని, తమ రెండు సంస్థలు వేర్వేరుగా లిస్టెడ్ కంపెనీలుగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు విడివిడిగా తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆర్‌కామ్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నా తమ గవర్నెన్స్, మేనేజ్‌మెంట్, కార్యకలాపాలు, ఉద్యోగులు, షేర్‌హోల్డర్లపై ఎలాంటి ప్రభావమూ ఉండదని వివరించాయి. రుణాల మళ్లింపు ఆరోపణలతో ఆర్‌కామ్ ఖాతాను ఫ్రాడ్ అకౌంటుగా వర్గీకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎస్‌బీఐ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కి ఇచ్చిన రుణాల్లో నిబంధనల ఉల్లంఘన, నిధుల దుర్వినియోగం వంటి అంశాలు కనిపించాయని పేర్కొంది. మొత్తం రూ.31,580 కోట్ల రుణాల్లో సుమారు రూ.13,667 కోట్లు ఇతర రుణాల చెల్లింపులకు, రూ.12,692 కోట్లు సంబంధిత సంస్థలకు మళ్లించారని తెలిపింది.

## వైజాగ్‌లో వొడాఫోన్ ఐడియా 5జీ..

### మరిన్ని నగరాల్లోనూ..




**జనంసాక్షి:**ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా తమ 5జీ సర్వీసులను మరో 23 నగరాలకు విస్తరించింది. వీటిలో వైజాగ్‌తో పాటు జైపూర్, కోల్‌కతా, లక్నో తదితర సిటీలు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ప్రారంభ ఆఫర్ కింద రూ.299 నుంచి డేటా ప్లాన్లను అందిస్తున్నట్లు వివరించింది. కంపెనీ ఇప్పటికే ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, చండీగఢ్, పట్నాలాంటి అయిదు నగరాల్లో 5జీ సేవలు అందిస్తోంది. 22 టెలికం సర్కిళ్లకు గాను 17 సర్కిళ్లలో 5జీ స్పెక్ట్రమ్‌ను వొడా–ఐడియా కొనుగోలు చేసింది. 4జీ సేవలకు సంబంధించి సుమారు 65,000 సైట్లలో నెట్‌వర్క్‌ను పటిష్టం చేసుకున్నామని, కవరేజీని మెరుగుపర్చామని కంపెనీ పేర్కొంది. వచ్చే ఆరు నెలల్లో కొత్తగా 1 లక్ష టవర్లను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపింది.

# మార్కెట్లకు స్వల్ప లాభాలు

## ట్రేడ్ డీల్‌పై మదుపర్ల దృష్టి..




ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని స్వల్ప లాభాలతో ముగించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ. .భారత్–అమెరికా ట్రేడ్ డీల్ వార్తలపై దృష్టిపెట్టిన మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటకు గురైన సూచీలు చివరకు స్వల్ప లాభాలను దక్కించుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 200 పాయింట్లు పెరగ్గా.. నిఫ్టీ 25,450 మార్క్ దాటింది. ఈ ఉదయం 83,306.81 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్.. కాసేపటికే ఒత్తిడికి గురైంది. ఒక దశలో 83,015.83 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివర్లో కాస్త కోలుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి 193.42 పాయింట్లు లాభపడి 83,432.89 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 25,331.65 – 25,470.25 మధ్య కదలాడింది. చివరకు 55.70 పాయింట్లు పెరిగి 25,461 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు బలపడి 85.38గా స్థిరపడింది. ఆటోమొబైల్, టెలికాం, లోహ రంగాలు మినహా మిగతా అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫార్మా, చమురు, ఐటీ, రియల్టీ, మీడియా రంగ సూచీలు 0.4 నుంచి 1 శాతం మేర పెరిగాయి. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, రెడ్డీస్ ల్యాబ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యునిలివర్ షేర్లు రాణించగా.. ట్రెంట్, టాటా స్టీల్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు స్వల్పంగా పెరిగాయి.

## రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు తగ్గాయ్..



భారత రియల్ ఎస్టేట్ మార్కెట్లో సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు (ఇనిస్టిట్యూషన్స్) నీరసించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో (ఏప్రిల్–జూన్) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 33 శాతం తగ్గిపోయి 1.69 బిలియన్ డాలర్లు (14,365 కోట్లు)గా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా వెల్లడించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితులు ఇందుకు దారితీసినట్టు తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇనిస్టిట్యూషన్స్ 2.53 బిలియన్ డాలర్లను (రూ.21,505 కోట్లు) రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే సగానికి తగ్గి 1,048 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం 643 మిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేశారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 486 మిలియన్ డాలర్ల పెట్టుబడుల కంటే 32 శాతం అధికమయ్యాయి. 'దేశీ పెట్టుబడులు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు కీలక చోదకంగా మారాయి. భారత రియల్ ఎస్టేట్‌లో దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 2021లో 16 శాతంగా ఉంటే, అక్కడి నుంచి క్రమంగా పెరుగుతూ 2024 నాటికి 34 శాతానికి చేరింది' అని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. ఇక 2025 మొదటి ఆరు నెలల కాలంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో దేశీ పెట్టుబడుల వాటా 48 శాతంగా ఉన్నట్టు చెప్పారు. దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడం.. అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సాయపడ్డాయని, మొదటి ఆరు నెలల్లో మొత్తం పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లకు దూసుకువెళ్లాయని తెలిపారు. ఈ ఏడాది జనవరి–జూన్ మధ్యకాలంలో రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇనిస్టిట్యూషనల్ పెట్టుబడులు 15 శాతం తగ్గి 2,998 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. మొదటి ఆరు నెలల్లో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 2,594 మిలియన్ డాలర్ల నుంచి 1,571 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 53 శాతం ఎగసి 1,427 మిలియన్ డాలర్లకు చేరాయి. ఫ్యామిలీ ఆఫీసులు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంక్‌లు, ప్రొప్రయిటరీ బుక్‌లు, పెన్షన్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు, లిస్టెడ్ రీట్‌లు సంస్థాగత పెట్టుబడిదారుల కిందకు వస్తాయి.

## జోరు చూపించిన సేవల రంగం



**జనంసాక్షి:**సేవల రంగం జూన్ నెలలో బలమైన పనితీరు చూపించింది. ఇందుకు నిదర్శనంగా హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజెనెస్ యాక్టివిటీ ఇండెక్స్ పది నెలల గరిష్ట స్థాయిలో 60.4 పాయింట్లకు చేరింది. మే నెలలో ఇది 58.8 పాయింట్ల వద్ద ఉంది. స్థానిక మార్కెట్ నుంచే కాకుండా ఎగుమతి మార్కెట్ల నుంచి కొత్త ఆర్డర్లు రావడం బలమైన పనితీరుకు దోహదం చేసింది. వ్యయాలు తగ్గడం మార్జిన్ల విస్తరణకు దోహదం చేసినట్టు హెచ్‌ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. 2024 ఆగస్ట్ తర్వాత తొలిసారి కొత్త ఆర్డర్లు జూన్ నెలలో గణనీయంగా పెరిగాయి. దేశీ మార్కెట్లో కార్యకలాపాలు పెరగడం, ఎగుమతులు వృద్ధి చెందడం మెరుగైన పనితీరుకు సాయపడ్డాయి. ముఖ్యంగా ఆసియా, మధ్యప్రాచ్యం, యూఎస్ మా ర్కెట్ల నుంచి డిమాండ్ అధికమైందని భండారీ అంచనా వేశారు. వరుసగా 37వ నెలలోనూ జూన్‌లో ఉపాధి అవకాశాలు పెరిగినట్టు చెప్పారు. వచ్చే ఏడాది కాలంలో వృద్ధి పట్ల 18% సేవల రంగ సంస్థలు సానుకూలంగా ఉన్నాయి. 2022 తర్వాత చూస్తే ఇదే కనిష్ట స్థాయి.

**61పాయింట్లకు కాంపోజిట్ ఇండెక్స్**

తయారీ, సేవల రంగ కార్యకలాపాలను ప్రతిబింబించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూన్‌లో 61 పాయింట్లకు పెరిగింది. మే నెలలో ఇది 59.3గా ఉంది. 14 నెలల్లోనే ఇది గరిష్ట స్థాయి కావడం గమనార్హం.

# 'ఫేస్‌జిమ్'లో రిలయన్స్‌కు వాటా




డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్(ఆర్‌ఆర్‌వీఎల్) తాజాగా యూకే సంస్థ ఫేస్‌జిమ్‌లో మైనారిటీ వాటాను సొంతం చేసుకుంది. తద్వారా దేశీయంగా ఫేషియల్ ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ బ్రాండును ప్రవేశపెట్టనుంది. తాజా పెట్టుబడులతో దేశీయంగా అధిక వృద్ధిలోనున్న సౌందర్యం, వెల్‌నెస్ విభాగంలో కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు తెలియజేసింది. అయితే వాటా కొనుగోలు విలువను వెల్లడించలేదు. ఓమ్నిచానల్ బ్యూటీ రిటైల్ ప్లాట్‌ఫామ్ 'టిరా' ద్వారా ఫేస్‌జిమ్‌ను భారత్‌లో ప్రవేశపెట్టేందుకు తాజా భాగస్వామ్యం వీలు కల్పించనున్నట్లు పేర్కొంది. రానున్న ఐదేళ్లలో ఫేస్‌జిమ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలియజేసింది. తాజా భాగస్వామ్యం వీలు కల్పించనున్నట్లు పేర్కొంది. రానున్న ఐదేళ్లలో ఫేస్‌జిమ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలియజేసింది. కీలక పట్టణాలలో స్టాండెలోన్ స్టుడియోలు, ఎంపిక చేసిన టిరా స్టోర్ల ద్వారా ఇందుకు అవకాశాలను సృష్టించనున్నట్లు వివరించింది.

## గుడ్ల ధరలు



హైదరాబాద్ ₹ 5.15
వరంగల్ ₹ 5.17

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్



₹ 90,500 (22 క్యారెట్లు)
₹ 98,730 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్



₹ 1,20,000



# మళ్లీ కరుగుతోన్న బంగారు కొండ..


**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర ఈ రోజు వినియోగదారులకు ఊరట కల్పించింది. గురువారంతో పోలిస్తే శుక్రవారం బంగారం ధర తగ్గింది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.**

## ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో తీపికబురు

**జనంసాక్షి:**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు జులై 2025 నుంచి కరువు భత్యం (డీఏ) 4 శాతం పెరిగే అవకాశం ఉందని కొన్ని సంస్థలు అంచనా వేస్తున్నాయి. వాటిలోని వివరాల ప్రకారం ఇటీవలి ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగా ఈమేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న 55 శాతం డీఏను 59 శాతానికి పెంచాలని యోచిస్తోంది. ఈ పెంపు జులై నుంచి అమల్లోకి రానుండగా ఆగస్టు లేదా సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో పండుగ సీజన్‌కు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. డీఏ లెక్కింపునకు ఆధారమైన ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ (ఏఐసీపీఐ–ఐడబ్ల్యూ) 2025 మేలో 0.5 పాయింట్లు పెరిగి 144కు చేరింది. గత మూడు నెలల్లో సూచీ స్థిరమైన పెరుగుదలను చూపించింది.

# ఎన్నారైలకు బిగ్ ట్రబుల్

## ట్రంప్ మెగా బిల్లుతో వారికి ఇబ్బందులే..




**జనంసాక్షి:**ట్రంప్ కలల బిల్లు.. బిగ్ బ్యూటిఫుల్ బిల్లును అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించింది. గురువారం సుదీర్ఘ చర్చ అనంతరం జరిగిన ఓటింగులో బిల్లు ఆమోదం పొందింది. అంతకుముందు ఈ బిల్లుకు సెనెట్‌లో ఆమోదం లభించింది. ట్రంప్ సంతకం తర్వాతనే ఈ బిల్లు చట్టంగా మారనుంది. అటు అమెరికా రాజకీయాల్లో, ఇటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అంశంగా నిపుణులు ఈ బిల్లును భావిస్తున్నారు. అయితే ఇది ఎన్నారైలపై ఎంతంగా ప్రభావం చూపించనుందో ఓ లుక్కేద్దాం.. 2026 జనవరి 1 నుంచి, అమెరికా నుంచి భారత్‌కు పంపే నగదు ఆధారిత బదిలీలపై 1% పన్ను విధించనున్నారు. నగదు, మనీ ఆర్డర్, చెక్కుల రూపేణా పంపేవాటికి ఇది వర్తిస్తుంది. మొదట ఇది 5%గా ప్రతిపాదించబడింది. తర్వాత 3.5%కి తగ్గించి చివరకు 1 శాతంగా నిర్ణయించారు. ఇది చిన్న మొత్తంగా అనిపించినా.. తరచూ డబ్బు పంపే కుటుంబాలకు ఇది లక్షల్లో అదనపు భారం కానుంది. అయితే డిజిటల్ మార్గాలు ఉపయోగించే వారు పన్ను నుంచి తప్పించుకోవచ్చు. అయితే.. భారత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో, అలాగే వయసు పైబడినవాళ్లు ఇంకా నగదు మార్గాన్నే నమ్ముకుంటున్నారనేది గుర్తించాల్సిన విషయం. ఉదాహరణకు.. నెలకు పంపే వ్యక్తి.. ఏడాదికి %వి%6,000 పంపుతాడు. బిగ్ బ్యూటీఫుల్ బిల్లు అమల్లోకి వస్తే.. %వి%60 అదనపు పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇది చిన్న మొత్తంగా అనిపించినా.. గణనీయమైన భారంగానే మారనుంది. భారత్‌కు వచ్చే రెమిటెన్స్‌లో తగ్గుదల బిగ్ బ్యూటిఫుల్ బిల్ ద్వారా అమెరికా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1% రెమిటెన్స్ పన్ను ప్రభావం కేవలం ప్రవాస భారతీయులకే కాదు, భారత ఆర్థిక వ్యవస్థ మొత్తానికే గణనీయంగా ఉండనుంది. రెమిటెన్స్ అంటే ఒక వ్యక్తి విదేశంలో పని చేసి, అక్కడి నుంచీ తన స్వదేశంలోని కుటుంబానికి లేదా ఖాతాకు డబ్బు పంపడం. 2023–24లో భారత్‌కు వచ్చిన మొత్తం రెమిటెన్స్ 135.46 బిలియన్ డాలర్లు. అందులో 32 బిలియన్ డాలర్లు అమెరికా నుంచే వచ్చింది. అయితే1% పన్ను విధానం వల్ల 10–15% తగ్గుదల నమోదయ్యే అవకాశం ఉంది. అంటే.. 12–18 బిలియన్ డాలర్ల వరకు నష్టం జరగవచ్చు. రెమిటెన్స్‌లు భారతదేశానికి విదేశీ కరెన్సీ ప్రవాహంలో ప్రధాన భాగం. కాబట్టి ఈ తగ్గుదల వల్ల విదేశీ మారక నిల్వలపై ప్రభావం పడుతుంది. డాలర్ నిల్వలు తగ్గి, రూపాయి విలువపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది ద్రవ్యోల్బణం పెరగడానికి దారితీయవచ్చు. అదే సమయంలో.. రెమిటెన్స్‌లు అనేక కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. ముఖ్యంగా కేరళ, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో అనేక కుటుంబాలకు. అయితే.. డబ్బు తక్కువగా రావడం వల్ల విద్య, వైద్యం, పెళ్లిళ్లు, గృహ నిర్మాణం వంటి అవసరాలపై ప్రభావం పడుతుంది. ఇంకోవైపు.. బ్యాంకింగ్ వ్యవస్థపై ఇది ప్రభావం చూపించనుంది. రెమిటెన్స్ తగ్గితే బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతాయి, ఇది వడ్డీ రేట్ల పెరుగుదలకు దారితీయవచ్చు.



# హోమ్ లోన్ కస్టమర్లు మరింత హ్యాపీ..

**• జీరో ప్రాసెసింగ్ ఫీజు**

**జనంసాక్షి:**హోమ్ లోన్ గ్రహీతలకు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా మరోసారి శుభవార్త చెప్పింది. గృహ రుణాలపై వడ్డీ రేటును 7.45 శాతానికి తగ్గించింది. ప్రస్తుతం ఇది 7.50 శాతంగా ఉంది. అలాగే కొత్త రుణ గ్రహీతలకు ప్రాసెసింగ్ ఫీజును కూడా మాఫీ చేసినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పాలసీ రెపో రేటును తగ్గించిన తరువాత గత జూన్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా ఇప్పటికే గృహ రుణ రేట్లను 8.00 శాతం నుండి 7.50 శాతానికి తగ్గించింది. ఇప్పుడు వడ్డీ రేటును ఇంకాస్త తగ్గించడంతో హోమ్‌లోన్ కస్టమర్లకు మరింత ఉపశమనం కలగనుంది. ఈ తాజా తగ్గింపు గృహ యాజమాన్యం మరింత చౌకగా మారుతుందని, దేశంలోని గృహ రంగంలో డిమాండ్‌ను ఉత్తేజపరిచే ప్రభుత్వ విస్తృత ఆర్థిక లక్ష్యానికి మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. గృహ రుణాలను మరింత చేరువ చేయడంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా హోమ్ లోన్‌కు దరఖాస్తు చేసుకునేవారికి ప్రాసెసింగ్ ఫీజును కూడా రద్దు చేసింది. ఇంతవరకూ ఈ బ్యాంక్ లోన్ మొత్తంలో అర శాతం వరకూ ప్రాసెసింగ్ రుసుముగా తీసుకొనేది. ఇది గరిష్టంగా రూ.15 వేల వరకూ ఉంటుంది. దీనికి జీఎస్టీ అదనం. కస్టమర్లు లోన్ కోసం బ్యాంక్ బ్రాంచిల్లోనే కాకుండా పూర్తిగా డిజిటల్ విధానంలో బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

# పాత వాహనాలపై నిషేధం ఎత్తివేత

**జనంసాక్షి:**దేశరాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యాన్ని ఎదుర్కోవడానికి పాత వాహనాల నిషేధానికి సంబంధించి ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన విధానాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. కేవలం వాహనాల కొనుగోలు తేదీని బట్టి ఆటోమేటిక్ స్క్రాపింగ్ లేదా సీజ్ చేసే ప్రక్రియను అధికారులు ఇకపై కొనసాగించరని పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. పదేళ్లకు పైబడిన డీజిల్ వాహనాలు, 15 ఏళ్లకు పైబడిన పెట్రోల్ వాహనాలను ఢిల్లీలో నడపకుండా నిషేధించాలన్న దీర్ఘకాలిక విధానాన్ని ఈ నిర్ణయంతో నిలిపేశారు. వాస్తవ ఉద్గారాలతో సంబంధం లేకుండా తమ వాహనాలను బాగా నిర్వహించిన వారికి లేదా క్లీనర్ టెక్నాలజీలను ఏర్పాటు చేసిన వారికి ఇది నష్టం కలిగిస్తుందని కొందరి నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించింది. 'పాలసీ ఫ్రేమ?వర్క్‌పై పునరాలోచన చేస్తున్నాం. ఇప్పుడు కేవలం వాహనాల వయసుపై కాకుండా వాస్తవ ఉద్గారాలపై దృష్టి సారించాం' అని సిర్సా విలేకరుల సమావేశంలో చెప్పారు. పాత వాహనాలనే కాకుండా కాలుష్య కారకాలను లక్ష్యంగా చేసుకునే శాస్త్రీయ, సాంకేతిక ఆధారిత విధానాన్ని తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.లక్షలు పోగేసి కొన్న వాహనాలను మెరుగ్గా నిర్వహిస్తున్నా,

# ఏకకాలంలో నాలుగైదు ఉద్యోగాలు.. తీరా దొరికాక..

**జనంసాక్షి:**ఏకకాలంలో నాలుగైదు అమెరికా స్టార్టప్‌ల్లో ఉద్యోగం చేస్తూ వార్తల్లో నిలిచిన అమెరికాకు చెందిన భారతీయ టెక్ ప్రొఫెషనల్ సోహమ్ పరేఖ్ ఎందుకు అలా చేయాల్సి వచ్చిందో వివరించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనపై వచ్చిన ఆరోపణలను అంగీకరించిన ఆయన అందుకు సంబంధించిన వివరాలు పంచుకున్నారు. ఆర్థిక ఒత్తిళ్ల వల్లే తాను ఒకేసారి రిమోట్‌గా నాలుగైదు కంపెనీల్లో పని చేయాల్సి వచ్చిందన్నారు. అందుకు అత్యాశ కారణం కాదని తెలిపారు. టీబీపీఎన్ షోలో పాల్గొన్న పరేఖ్‌ను తనపై వస్తున్న ఆరోపణలు నిజమేనా అని ప్రశ్నించగా ఆయన వాటిని అంగీకరించారు. 'నేను ఒకేసారి పలు కంపెనీల్లో పనిచేశాను. కొందరివల్ల అదికాస్తా వైరల్‌గా మారింది. ఈ ప్రక్రియలో నా ఉద్యోగ స్థితిగతులను తప్పుగా చూపించారు. వ్యక్తిగత లాభం కోసం అక్రమాలకు పాల్పడ్డారని పలువురు ఆరోపించారు. కానీ నేను లాభాపేక్షతో అలా చేయలేదు. ఆర్థిక ఒత్తిళ్లతోనే అలా బహుళ కంపెనీల్లో పని చేయాల్సి వచ్చింది' అన్నారు.

**గర్వపడటం లేదు**

'వారానికి 140 గంటలు పనిచేయడానికి ఎవరూ ఇష్టపడరు. కానీ నా అవసరాన్ని బట్టి అలా చేయవలసి వచ్చింది' అని వివరించారు. వృత్తిపరంగా మనుగడ, ఆర్థిక స్థిరత్వమే కీలకమని భావించి క్లిష్ట సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మీరు చట్టాలను ఉల్లంఘించారని విశ్వసిస్తున్నారా అని అడిగినప్పుడు, పరేఖ్ అందుకు పూర్తి బాధ్యత స్వీకరిస్తానని చెప్పారు. 'నేను చేసిన పనికి గర్వపడటం లేదు. ఇది సమర్థించే విషయం కాదు' అని అన్నారు. పలు ఉద్యోగాలు చేస్తూ జూనియర్ డెవలపర్లను ఉపయోగించుకున్నారనే ఆరోపణలను ఆయన ఖండించారు. అందులో నిజం లేదన్నారు.

**సోహమ్ పరేఖ్ ఎవరు?**

ముంబైకి చెందిన పరేఖ్ ఉన్నత చదువుల కోసం 2018లో అమెరికా వెళ్లాలని భావించాడు. కానీ ఆర్థిక సమస్యల వల్ల తాను వెళ్లడం ఆలస్యం అయింది. చివరకు 2020లో అమెరికాకు వెళ్లాడు. అతను 2020లో ముంబై విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో అండర్ గ్రాడ్యుయేషన్



పూర్తి చేశాడు. తరువాత 2022లో జార్జియా టెక్ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశాడు. విశ్లేషణ సంస్థ మిక్స్ పానెల్ సహ వ్యవస్థాపకుడు సుహైల్ దోషి అమెరికా స్టార్టప్ కంపెనీలను సోహమ్ పరేఖ్ మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆయన వెలుగులోకి వచ్చాడు. పరేఖ్ ఒకేసారి నాలుగైదు స్టార్టప్‌ల్లో పనిచేస్తున్నారని చెప్పారు. విమర్శలు వస్తున్నప్పటికీ పరేఖ్ ఈ వ్యవహారంతో పాఠాలు నేర్చుకున్నానని, ఆ తప్పులు పునరావృతం చేసే ఆలోచన లేదని చెప్పాడు.

# హిమాచల్‌లో వరదబీభత్సం

63 మంది చనిపోగా.. రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక డజన్ల కొద్దీ గల్లంతయ్యారు. వారి వివరాలు తెలియడం లేదు. గత కొద్ది రోజులుగా హిమాచల్‌ప్రదేశ్‌లో నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు కారణంగా మేఘాలు రాష్ట్రాన్ని కమ్ముకున్నాయి. అంతేకాకుండా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఇంకోవైపు భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఇప్పటి వరకు 63 మంది చనిపోగా.. పదుల కొద్దీ గల్లంతయ్యారు. మరోవైపు అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. ఇక జూలై 7 వరకు అన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రూ.400 కోట్ల విలువైన ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. మండి జిల్లాలో సహాయ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. రుతుపవనాలు జూన్ 20న హిమాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా విధ్వంసం సృష్టించాయి. తాజా సమాచారం ప్రకారం మండి జిల్లాలో 40 మంది మరణించగా, కాంగ్రాలో 13 మంది, చంబాలో ఆరుగురు, సిమ్లాలో ఐదుగురు మరణించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక వందలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. 300 పశువులు చనిపోయాయి. ఇక విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతినడంతో వేలాది మంది ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నీరు, ఆహారం కొరత కూడా ఏర్పడింది.

# యూరియా ఇచ్చినా కేంద్రాన్ని బదనాం చేస్తారా!

- 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా ప్రధాని,సీఎంలను చేశారా
- ఏఐసీసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి/ కొనరావుపేట (జనం సాక్షి) : వేములవాడ నియోజకవర్గం లోని కొనరావుపేట మండలంలో గల మరిమడ్ల ఏకలవ్య స్కూల్‌లో శుక్రవారం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రూ 5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్లు,డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.కేంద్ర మంత్రికి విద్యార్థులు వినూత్న రీతిలో ఘన స్వాగతం పలికారు. గిరిజన నృత్యలతో ఆకట్టుకు న్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులు, జిల్లా బీజేపీ నేతలతో కలిసి అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల సమస్యలపై అధ్యాపకులు, విద్యార్థులతో ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల విజప్తి మేరకు ల్యాబ్,ఇతర సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా 27 మంది ఓబీసీలను, 12 మంది దళితులను, 6 గురు దళితు లను, 8 మంది మహిళలను కేంద్ర కేబినెట్లో చోటు కల్పించిన చరిత్ర బీజేపీదేనని,బీసీనైన నన్ను కేంద్ర మంత్రిగా చేసిందన్నారు.పార్టీ పరంగా నాతోపాటు లక్ష్మణ్, దత్తాత్రేయలకు అనేక పదవులిచ్చిందని బీజేపీ. బీసీకి చెందిన మోదీని ప్రధాని అయితే చాయ్ వాలా అంటూ హేళన చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు.అంతెందుకు ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లపాటు అధికారాన్ని చెలాయించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీనైనా సీఎం చేశారా ఎందుకు చేయలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ప్రకటించిన నేత మోదీ అన్నారు.యూరియా కొరతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలనే కేంద్రాన్ని బదనాం చేస్తున్నాయనిలోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమవుతుంటే ఓర్వలేక బదనాం చేస్తున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుభవజులు, అధికారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

తెలంగాణకు గత సీజన్లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చిందని, ఈ సీజన్ లో కూడా కోరినంత యూరియా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. గత సీజన్‌లో అదనంగా కేటాయించి న యూరియా ఎటు పోయిందన్నారు. వాటిని ఏం చేశారో లెక్కలు చెప్పకుండా కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదన్నారు.దేశ వ్యాప్తంగా 20 వేలకు పైగా గిరిజన జనాభా ఉన్న మండలాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నమన్నారు. 728 స్కూల్స్ లక్ష్యం కాగా, దాదాపు 500 స్కూల్స్ ప్రారంభమయాయని, 1.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. సమాజంలో పూర్తిగా వెనుకబడ్డ ఆదివాసీ, గిరిజనులకు నవోదయ స్థాయిలో విద్యను అందించడం ద్వారా సమాజంలోని అసమానతల ను తొలగించి విద్యలో సమానత్వం సాధించాలన్నదే ఈ ఏకలవ్య స్కూల్స్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. చదువే కాకుండా క్రీడా, కళా, సాంస్కృతిక రంగాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను ఈ స్కూల్స్ ద్వారా సిద్ధం చేస్తున్నాం.

ఉచిత వసతి, భోజనం, డ్రెస్, పాఠ్య పుస్తకాలను అందిస్తున్నమన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూళ్లలో ఐఐటి, జేఈఈ, నెట్ ఆన్లైన్ కోచింగ్ ఇస్తున్నారని, గిరిజ న బిడ్డలకు అర్థం కావడం కోసం ప్రాంతీయ భాషలను నేర్పేందుకు సంబంధిత భాషా బోధకులను నియమిస్తున్నమన్నారు. ఇక్కడి నుండి మెడిసిన్, ఇంజినీరింగ్, ఐటీ, లా తదితర కోర్సులకు గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయే షన్ చదవాలనుకునే విద్యార్థులకు జాతీయ స్కాలర్‌షిప్ స్కీమ్ కింద సాయం చేస్తున్నమనారు. ఎంఫిల్, పీహెచ్డీ వంటి కోర్సులు చదవాలనుకునే ఎస్టి విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్ అందిస్తున్నమన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య చదవాలను కునే వాళ్లకు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నమన్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, భాజపా రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గోపి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ,నాయకులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, రేగుల మల్లికార్జున్,రాపెల్లి శ్రీధర్, పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తహశీల్దార్లు మరింత ఫోకస్ చేయాలని, షెడ్యూల్ సిద్ధం చేసి నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై రెవెన్యూ, గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లతో మండలాల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలు, నోటీసులు జారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి తగిన షెడ్యూల్ సిద్ధం చేసి, దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేయాలని, నోటీసుల్లో సూచించిన తేదీన విచారణ పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 48,651 దరఖాస్తులు వచ్చాయని, కానీ ఇప్పటి వరకు 1600 నోటీసులు జారీ చేశారని వేగం పెంచాలని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేది వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన అన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉన్నందున అంతకు ముందే దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో పురోగతి చాలా తక్కువగా ఉందని వేగం పెంచాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ ఇండ్ల నిర్మాణానికి మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని డిఆర్డీఓకు సూచించారు. ఇళ్ళు నిర్మాణానికి ఇసుక కొరత లేదని దశల వారిగా నిర్మాణ ప్రగతిపై నిధులు జమ జరుగుతుందని జాప్యం చేయక నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 4779 ఇండ్లు మంజూరు అయ్యాయని 1558 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, 2794 ఇళ్లు మంజూరు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మంజూరు ఉత్తర్వులు జారీ చేసిన ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, డిపిఓ వీరభద్రయ్య, డిఆర్డీఓ బాలకృష్ణ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడీఓలు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు పలువురుపై కేసులు



గంగారం జులై 4 (జనం సాక్షి) : వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి అంజన్ రావు, మహబూబాబాద్ డిపిఈఓ బి కిరణ్ ఆదేశాల మేరకు గంగారం మండలం కామారం, మామిడి గూడెం దుబ్బగూడంలలో నాటు సారా అమ్మకం దారులు మరియు తయారీ కేంద్రాలపైదాడులు జరపడం జరిగింది. ఈ దాడులలో 20 లీటర్ల నాటసారాను స్వాధీనం చేసుకుని, 500 లీటర్ల బెల్లం పానకమును ధ్వంసం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగింది అలాగే తొమ్మిది మంది అనుమానితులను గంగారం తహసిల్దార్ శ్రీ బాదావత్ బాలకిషన్ ముందు బైండోవర్ చేయడం జరిగింది. కేసు నమోదు అయిన వారు అలాగే బైండోవర్ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. మామిడిగూడెంకు చెందిన చెన్నూరి కృష్ణమూర్తి, జనగం వెంకటేశ్వర్లు, పైరి చుక్కయ్య, గంధర్ల పాపయ్య, గందర్ల లక్ష్మి, జనగం లక్ష్మి, జనగం బుచ్చక్కరామ టెంకి శ్రీనివాస్, అను ఎనిమిది మందిని మరియు కామారం కు చెందిన గడ్డి నవీన్, మహేష్ అను ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగినది. ఈ దాడులలో గూడూరు ఎక్సైజ్ సీఐ ఎన్ బిక్షపతి గూడూరు ఎక్సైజ్ ఎస్సై ఎస్ రాజేశ్వరి మహబూబాబాద్ టాస్క్ ఫోర్స్ ఎస్సై ఆర్ కిరీటి అలాగే గూడూరు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, మహబూబాబాద్ టాస్ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు ఎక్సైజ్ సీఐ మామిడిగూడెం, దుబ్బగూడం గ్రామాలకు చెందిన మహిళలను సమావేశపరిచి నాటు సారా కు సంబంధి చిన దుష్ఫలితాలను వివరించడం జరిగింది సారా కేంద్రాలపై నాటు సారా ముడి సరుకు రవాణా దారులపై నిఘా పెంచామని, నాటు సారా తయారుచేసిన, అమ్మిన, కొనినా, రవాణా చేసిన, నాటు సారా తయారీకి ఉపయోగించు ముడి పదార్థాలైన బెల్లం, పట్టిక, నాటు సారా తయారీకి వాడే చెక్కర మరియు ఈస్టులను కూడా అక్రమంగా రవాణా చేసిన నిలువ చేసిన చట్ట పరంగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు. విస్తృతంగా దాడులు నిర్వహించనున్నామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



## కాళేశ్వరంలో పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

కాళేశ్వరం, జూలై 04,( జనం సాక్షి) : ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతుంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాణహితకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటి మట్టం పెరుగుతుంది. మేడిగడ్డ బ్యారేజీ లోకి 75 వేల రెండు వందల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా బ్యారేజీలోని 85 గేట్లు ఎత్తి మొత్తం నీటికి కిందికి విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం వద్ద నీటిమట్టం పుష్కర ఘాట్‌ను ఆనుకొని ప్రవహిస్తుండడంతో భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## విగ్రహ ధ్వంసం దుండగుల రిమాండ్ : డీఎస్పీ శ్రీనివాస్



పరిగి జులై 4 జనం సాక్షి వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టా పహాడ్ గ్రామంలో జూన్ 21వ తేదీ అర్ధరాత్రి సమయంలో ప్రధాన చౌరస్తా లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకొని పలు సెక్షన్ల పై కేసులను నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం ఐదు గంటలకు విలేకరుల సమావేశం లో డిఎస్పీ శ్రీనివాస తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని పుట్టా పహాడ్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హరివర్ధన్ శ్రద్ధాంజలి బ్యానర్ను అంబేద్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేయగా చాలా రోజులైట్కనందు వల్ల గ్రామస్తులు ఆ బ్యానర్ను పక్కకు మడత చేసి పెట్టారు. బ్యానర్ తీసినందుకు హరివర్ధన్ అన్న బ్రహ్మం, అతని స్నేహితులు మహేష్, సూర్య ప్రకాష్, రమేష్ తో కలిసి జూన్ 21న అర్ధరాత్రి సమయంలో అంబేద్కర్ విగ్రహాన్ని బ్రహ్మం రాయితో కొట్టి పగలగొట్టగా ముగ్గురు ఎవరైనా వస్తే చెప్పడానికి సహాయం చేసి అందరూ కలిసి ఈ నేరానికి పాల్పడ్డారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పమన్నారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

## దొడ్డి కొమరయ్య ఆశయాలను కొనసాగించాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జనగామ ప్రతినిధి, జులై 4(జనంసాక్షి ): శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 79వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ... తెలంగాణ రైతాంగ పోరాటం లో వెనుకబడి న తరగతుల కులాలకు అండగా నిలబడిన దొడ్డి కొమరయ్య మహెూన్నత వ్యక్తి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వెనుకబడిన తరగతుల కులాలకు ప్రాధాన్యతనిచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నదన్నారు. వసతి గృహాలు నిర్మించి నాణ్యమైన విద్య తో పాటు భోజనాన్ని అందిస్తూ ఆర్థికంగా చేయూత అందిస్తున్నదన్నారు. వసతి గృహాలను వినియోగించుకోవాలని, విద్యార్థుల సంఖ్య 100% నమోదు కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కంచె రాములు, పట్టణ అధ్యక్షులు బల్దే మల్లేశం, పట్టణ కార్యదర్శి జూకంటి శ్రీశైలం, కోశాధికారి ఎంద్రు వైకుంఠం, యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు కానుగంటి ముత్తయ్య, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల బాలరాజు, రజక సంఘం జిల్లా సెక్రటరీ పదునూరి మాదార్, కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బల్దే వెంకట మల్లయ్య, కోపా అధ్యక్షులు కర్రే కృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అకస్మితంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య అధికారి రజిత

ముస్తాబాద్ జులై 4( జనం సాక్షి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత రాజన్న సిరిసిల్ల పోతుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో, ఆవునూరు ,ఉపకేంద్రంను శుక్రవారం డ్రై డే సందర్భంగా ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినారు. ఈ తనిఖీల్లో భాగంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, ఇంటింటి సర్వేలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొని, లార్వాలు నీరు నిల్వ ఉన్న నీటి తొట్టిలను పరిశీలించి, ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం నిర్వహించి ఇంటింటి సర్వేలను తప్పనిసరిగా నిర్వహించి జ్వరంలు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తూ, కేంద్ర ఆరోగ్య పథకాల నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రాజేందర్, హెచ్ ఈ ఓ లింగం, సింధుజ, సాయి మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తన శుద్ధి చేయడం - అధిక దిగుబడికి మొదటి మెట్టు

- డాక్టర్ తాటికొండ వినోద్ కుమార్ రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త





ముత్తారం జులై 4(జనంసాక్షి) : పంటల సాగులో విత్తనశుద్ధి చాలా ముఖ్యమైన పద్ధతిగా భావించబడుతుంది. విత్తనాలను పురుగుమందులు, శిలీంధ్రనాశిని జీవ సంబంధమైన రసాయనా లతో శుద్ధి చేయడం వల్ల మొలకలను ప్రారంభ దశలోనే మట్టిలో ఉండేలా లేదా విత్తనాల ద్వారా వ్యాపించే చీడపీడల నుండి రక్షణ కలిగించవచ్చు. విత్తనశుద్ధి వల్ల మొలకలు సమానంగా వస్తాయి. వ్యాధుల ప్రభావం తగ్గుతుంది. మొదటి దశలో స్ప్రే అవసరం తక్కువగా ఉంటుంది.ఇది తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఇచ్చే, పర్యావరణానికి హానికరం కాకుండా పంటల ఆరోగ్యాన్ని మెరుగు పరిచే పరిష్కార మార్గం. తెలంగాణలో వానా కాలంలో వివిధ పంటలను సాగుచేసే రైతులు నాణ్యమైన, తెగుళ్ళను తట్టుకునే పంట రకాలను ఎంచు కోవడంతో పాటు క్రింద తెలిపిన విధంగా విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలి.

నారుమడులను సిద్ధం చేసుకునే రైతులు ముందుగా విత్తనశుద్ధి పై శ్రద్ధ వహించాలి. మెట్ట నారుమడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రా.కార్బండాజిమ్‌ను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ము చేసిన నారు మడులకైతే లీటరు నీటికి 1 గ్రా.కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి, తరువాత మండే కట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు రసాయనం కలిపిన నీరు సరిపోతుంది.ఈ విధంగా శిలీంధ్రనాశినితో విత్తనశుద్ధి చేయ డం వలన మొక్కకు తొలి దశలో ఆశించే అగ్గితెగులు ఆకు మచ్చ తెగుళ్ళను నివారించవచ్చు.అదేవిధంగా వరి నాట్లు వేసే ముందు నారు కట్టలను, క్లోరిపైరిఫాస్ 50% ఇసి 1.6 మి.లీ.లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 12 గం.ఉంచినట్లైతే తొలి 30 రోజుల వరకు వరి పంటను ఆశించే కాండం తొలిచే పురుగు, తాటాకు తెగులు, పచ్చదోమలను నివారించవచ్చు. పంటలో కాండం కుళ్ళు, ఆకుమాడు తెగులు మరియు మసీకుళ్ళు అధికంగా ఆశించే ప్రాంతాలలో మ్యాంకోజెబ్ 3గ్రా. కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేసుకోవాలి.అదేవిధంగా కత్తెర పురుగు మరియు గులాబిరంగు కాండం తొలుచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్ ం సయాంట్రానిలిప్రోల్ 4మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

పసుపు పంటను దుంప వేరుకుళ్ళు తెగులు మరియు ఆకుమచ్చ తెగుళ్ళ నుండి కాపాడుకోవడానికి లీటరు నీటికి 3గ్రా. మ్యాంకోజెబ్ లేదా 3 గ్రా. మెటలాక్సిల్ కలిపిన ద్రావణంలో 40 నిమిషాల సేపు కొమ్ములను ఉంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టాలి. పసుపు కొమ్ము/విత్తనాలకు పొలుసు పురుగు ఆశించి ఉన్నప్పుడు శిలీంధ్రనాశినితో పాటు లీటరు నీటికి 5 మి.లీ. మలాథియాన్ మరియు 2 మి.లీ. మోనోక్రోటోఫాస్ కూడా కలిపి, తర్వాత నీడలో ఆరబెట్టి, నీటిని మార్చి 5గ్రా. ట్రైకోడెర్మా విరిడె కలిపినా ద్రావణం లో ముంచి కొమ్ములని నీటిలో ఆరబెట్టు కోవాలని డాక్టర్ తాటికొండ వినోద్ కుమార్ రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త తెలిపారు

## దొడ్డి కొమురయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం

వరంగల్ ఎంజీఎం, జూలై 4 (జనంసాక్షి): మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన కామ్రేడ్ దొడ్డి కొమురయ్య వారసత్వాన్ని కొనసాగిద్దామని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ అన్నారు. ఈరోజు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సభ ఖిలా వరంగల్ మధ్య కోటలోసిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ నాటి తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగి న సాయుధ రైతాంగ పోరాటంలో అనేక మంది కమ్యూనిస్టు నాయకులు కార్యకర్తలు అమరులయ్యారని ఆయన అన్నారు. విసునూరు దొరలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కామ్రేడ్ దొడ్డి కొమురయ్య మొదటి అమరవీరునిగా నిలిచాడన్నారు .ఆయన అమరత్వమే నక్సల్ బరి శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతిఘటన పోరాటాలకు మార్గం చూపిందన్నారు.న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ మాట్లాడుతూ గత 75 సంవత్సరాలలో ప్రజల బ్రతుకులు మారలేదన్నారు. దేశాన్ని నాటి నెహ్రూ నుండి నేటి మోడీ ప్రభుత్వం వరకు ఏలిన నాయకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలను కోరారు.





## సీజనల్ వైద్యులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ములుగు ప్రతినిధి, జులై 04(జనంసాక్షి) : మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వైద్యుల పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం ఏటూరు నాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అకస్మిక తనిఖీ చేసి, హాస్పిటల్లోని, క్యాజువల్టీ, పిఎన్‌సి, డెంగ్యూ వార్డులను పరిశీలించి, రోగుల యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలు తీరును అలాగే మెనూ ప్రకారంగా అందజేస్తున్న భోజన సౌకర్యాన్ని రోగులను మొదలగు విషయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హస్పటల్ సూపరిండెంట్ సురేష్ కు తెలిపారు. అలాగే హాస్పిటల్ బిల్డింగును పరిశీలించి కారిడార్లో లీకవుతున్న నీటి తీరును కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ సురేష్ ఆసుపత్రి స్టాఫ్ నర్సులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి ప్రభావం పెరిగిందాని, ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం కరకట్టను, మంగపేట లోని పొడుమూరు కరకట్టను, వరద తీరాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వరద కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సకాలంలో నివాస గ్రామాలను ఖాళీ చేయాల్సిన అవసరం తలెత్తిన పక్షంలో తగిన చర్యలు తీసుకోవడానికి, గోదావరి నదిలో నీటి మట్టాన్ని నిరంతరం పై అధికారులకు నివేదించాలని సాగునీటి శాఖ, ఎంపీడీఓ, తహసీల్దార్, సిబ్బందికి సూచించారు. అలాగే, ప్రమాదకర ప్రాంతాల్లో తగినంత ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. గోదావరి నదిలో నీటి మట్టం పెరుగుదలపై 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, వరద సమయంలో సకాలంలో చర్యలు తీసుకోవడానికి కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇర్రిగేషన్ ఈ ఈ జగదీశ్వర్, తహసిల్దార్ జగదీష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరదలు వస్తే జాగ్రత్త వహించాలి

- ప్రజలకు ఎలాంటి ప్రాణహాని జరగకుండా చూసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జిల్లాలో వరదలు వస్తే జాగ్రత్త వహించాలని, ప్రజలకు ఎలాంటి ప్రాణహాని జరగకుండా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో వరద సహాయక చర్యలపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మున్సిపల్, విద్యా, అగ్నిమాపక శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు, వరదలు ఎపుడు సంభవిస్తాయో తెలియదని యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామాలు, మండలాల వారిగా వరద సహాయక చర్యలపై కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. ముంపు గ్రామాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలానికి ఫ్లడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నీరు రహదారులపై చేరిన సందర్భాలలో బారికేడింగ్ ఏర్పాటు చేసి, ప్రజల రాకపోకలను నియంత్రించాలని, తగు జాగ్రత్తలతో అత్యవసర సేవలు మినహా ప్రయాణాలు నిలిపివేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రసవ సమయం దగ్గరలో ఉన్న గర్భిణీ మహిళలను గుర్తించి ఆసుపత్రులకు తరలించి వైద్య సేవలు అందించాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. అత్యవసర వైద్య సేవలకు. మందులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అవసరమైన ఔషధాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజల రక్షణకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలతో పాటు పశువుల రక్షణ కూడా చాలా ముఖ్యమని, వరదల సమయంలో లోతట్టు ప్రాంతాల నుండి ఎత్తయిన ప్రదేశాలకు తరలించి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు, వరదలు వచ్చినపుడు విద్యుత్తు ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని, ముందస్తుగా మంచినీటి పైపులు, కుళాయిలు పరిశీలించి లేకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల నివేదిక ఇవ్వాలని, ఆర్ అండ్ బి అధికారులు ధ్రువీకరణ తదుపరి కూల్చివేత చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతి, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని తెలిపారు. వరదల సమయంలో అత్యవసర సేవలకు కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర సేవలకు అగ్నిమాపక, ఎస్డీఆర్ ఎఫ్ టీములు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, డిఎస్పీ సంపత్ రావు, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, విద్యా, పంచాయతి రాజ్, విద్యా, వైద్య, డిఆర్డీఓ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సిరీస్‌పై అనిశ్చితి

## రోహిత్, కోహ్లీ అభిమానులకు నిరాశ



భారత క్రికెట్ జట్టు ఆగస్టు 2025లో బంగ్లాదేశ్‌లో పర్యటించి మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అయితే, ఈ పర్యటన రద్దయ్యే అవకాశం ఉన్నట్లు తాజా సమాచారం సూచిస్తోంది. బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి మరియు ద్వైపాక్షిక సంబంధాల నేపథ్యంలో భారత ప్రభుత్వం టీమ్ ఇండియాను అక్కడికి పంపడానికి అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అశాంతి కారణంగా ఆటగాళ్ల భద్రత విషయంలో భారత ప్రభుత్వం ఎలాంటి రాజీకి సిద్ధంగా లేదని సమాచారం. ఈ కారణంగా బీసీసీఐకి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదు. భారత ప్రభుత్వ అనుమతి లేకుండా ఆటగాళ్లను బంగ్లాదేశ్‌కు పంపడం సాధ్యం కాదని బీసీసీఐ స్పష్టం చేసింది.

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఈ సిరీస్‌కు ఆతి థ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఒకవేళ ఆగస్టులో ఈ సిరీస్ జరగకపోతే, తదుపరి షెడ్యూల్‌లో నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరుతోంది. బీసీసీఐ మరియు బీసీబీ త్వరలో సంయుక్త ప్రకటన ద్వారా సిరీస్‌ను వాయిదా వేస్తారా లేక పూర్తిగా రద్దు చేస్తారా అనే విషయంపై స్పష్టత ఇవ్వనున్నాయి. సిరీస్‌ను బంగ్లాదేశ్‌లో నిర్వహించడం సాధ్యం కాకపోతే, తటస్థ వేదికల్లో మ్యాచ్‌లు ఆడే అవకాశాన్ని పరిశీలించాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇలాంటి ఆలోచనలు గతంలో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌ల కోసం ఐసీసీ టోర్నమెంట్లలో అమలు చేశారు. రోహిత్ శర్మ మరియు విరాట్ కోహ్లీ టెస్ట్ మరియు టీ20 ఫార్మాట్ల నుంచి రిటైర్ అయిన తర్వాత, వన్డేల్లో కొనసాగుతున్నారు. ఈ సిరీస్‌లో వారు ఆడతారని అభిమానులు ఆశించారు. అయితే, పర్యటన రద్దయ్యే అవకాశం ఉండడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

ఈ సిరీస్ రద్దైతే, టీమ్ ఇండియా తదుపరి వన్డే సిరీస్‌ను ఆస్ట్రేలియాతో అక్టోబర్ 19, 2025 నుంచి ఆడనుంది. ఈ టూర్‌లో పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో వన్డేలు మరియు మనుకా ఓవల్‌లో టీ20 సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ రద్దు నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఆర్థికంగా పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది, ఎందుకంటే మీడియా హక్కుల అమ్మకాల ద్వారా వారు భారీ ఆదాయం ఆశించారు.



**బ్రూక్ ఔట్ :**
టీ సెషన్ తర్వాత ఆకాశ్ దీప్ భారత జట్టుకు కీలక బ్రేక్‌త్రూ ఇచ్చాడు. రెండో కొత్త బంతితో హ్యారీ బ్రూక్ (158)ను బౌల్డ్ చేసి, ఆరో వికెట్‌కు 303 పరుగుల రికార్డు భాగస్వామ్యానికి తెరదించాడు. బ్రూక్ ఆఫ్ స్టంప్ ఆవల పడిన బంతిని ఆడగా, అది ఇన్‌సైడ్ ఎడ్జ్ తాకి వికెట్లను గిరాటేసింది. ఈ వికెట్‌తో భారత ఆటగాళ్ల ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది.బ్రూక్ ఔట్ అయిన సమయంలో ఇంగ్లాండ్ స్కోర్ 387/6. ప్రస్తుతం జేమీ స్మిత్ (170 నాటౌట్) మరియు క్రిస్ వోక్స్ క్రీజులో ఉన్నారు. భారత్‌కు 587 పరుగుల భారీ స్కోర్ ఉండగా, ఇంగ్లాండ్ ఇంకా 200 పరుగుల వెనుకబడి ఉంది. తొలి రెండు రోజులు టీమ్ ఇండియా ఆధిపత్యం చెలాయిస్తే, మూడో రోజు ఇంగ్లాండ్ బ్యాటర్లు బజ్‌బాల్ శైలితో జోరు చూపించారు. తొలి సెషన్‌లో మహ్మద్ సిరాజ్ విజృంభణతో జో రూట్ (22), బెన్ స్టోక్స్ (0) వరుస బంతుల్లో ఔట్ కాగా, ఇంగ్లాండ్ 85/5తో కష్టాల్లో పడింది. అయితే, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై హ్యారీ బ్రూక్ (158), జేమీ స్మిత్ (172 నాటౌట్) సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 303 పరుగుల భాగస్వామ్యంతో ఇంగ్లాండ్ బలమైన స్థితిలో నిలిచింది. లంచ్ సమయానికి ఇంగ్లాండ్ 249/5తో ఉంది. టీ సెషన్ తర్వాత బ్రూక్ సెంచరీ, స్మిత్ 150 క్లబ్‌లో చేరారు.సిరాజ్ తొలి సెషన్‌లో రూట్, స్టోక్స్‌లను ఔట్ చేసి ఇంగ్లాండ్‌ను ఒత్తిడిలో నిలిపాడు. ఆకాశ్ దీప్ బ్రూక్ వికెట్‌తో కీలక బ్రేక్‌త్రూ సాధించాడు. ఈ ఇద్దరు బౌలర్లు భారత్‌ను మ్యాచ్‌లో ఆధిపత్య స్థితిలో నిలబెట్టారు. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ రసవత్తరంగా సాగుతోంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగుల భారీ స్కోర్ సాధించగా, ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్లు విఫలమైనప్పటికీ, యువ ఆటగాళ్లు బ్రూక్, స్మిత్ మొక్కవోని పట్టుదలతో రాణించారు. బ్రూక్ ఔట్ కావడంతో భారత్ మళ్లీ పట్టు బిగించింది. రానున్న రోజుల్లో మ్యాచ్ ఫలితం ఆసక్తికరంగా ఉండనుంది.

# స్వల్ప ఆధిక్యం

## సిరాజ్, ఆకాశ్ దీప్ బౌలింగ్ మ్యాజిక్

### ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో ఆరు డకౌట్లు

బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఆధిపత్యం కొనసాగిస్తోంది. మూడో రోజు ఆటలో మహ్మద్ సిరాజ్ (6-74) ఆరు వికెట్లతో చెలరేగి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను 407 పరుగులకు కుప్పకూల్చాడు. దీంతో భారత్‌కు 180 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. మూడో రోజు తొలి సెషన్‌లో సిరాజ్ జో రూట్ (22), బెన్ స్టోక్స్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్‌కు పంపి ఇంగ్లాండ్‌ను 85/5 స్థితిలో నిలిపాడు. హ్యాట్రిక్ బంతిని జేమీ స్మిత్ (184) ఎదుర్కొని క్రీజులో నిలదొక్కుకున్నాడు. హ్యారీ బ్రూక్ (158)తో కలిసి ఆరో వికెట్‌కు 303 పరుగుల రికార్డు భాగస్వామ్యం నమోదు చేసిన స్మిత్, ఇంగ్లాండ్‌ను పటిష్ట స్థితిలో నిలిపాడు. లంచ్ సమయానికి ఇంగ్లాండ్ 249/5తో ఉంది.

టీ సెషన్ తర్వాత ఆకాశ్ దీప్ రెండో కొత్త బంతితో బ్రూక్‌ను (158) బౌల్డ్ చేసి భారత్‌కు కీలక బ్రేక్‌త్రూ ఇచ్చాడు. బ్రూక్ ఔట్ అయిన తర్వాత సిరాజ్ టెయిలెండర్లను వరుసగా ఔట్ చేశాడు. క్రిస్ వోక్స్‌ను కరుణ్ నాయర్ క్యాచ్ ద్వారా, బ్రైడన్ కార్స్‌ను ఎల్బీడబ్ల్యూ ద్వారా, షోయబ్ బషీర్‌ను బౌల్డ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను ముగించాడు. ఆకాశ్ దీప్ 88 పరుగులకు 4 వికెట్లు తీసుకున్నాడు.


ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో జేమీ స్మిత్ (184), హ్యారీ బ్రూక్ (158)లు సెంచరీలతో రాణించగా, మిగతా బ్యాటర్లు ఆటగాడు అయినప్పటికీ, ఈ సిరీస్‌లో భారత ఫీల్డింగ్ మెరుగైన ప్రదర్శన కనబరిచింది. మొదటి టెస్టులో ఆరేడు క్యాచ్‌లను వదిలేసిన భారత ఫీల్డర్లు, ఈ మ్యాచ్‌లో మూడు క్యాచ్‌లను అద్భుతంగా అందుకున్నారు. శుభ్‌మన్ గిల్, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్ క్యాచ్‌లు పట్టారు. గిల్ బెన్ డకెట్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో అందుకున్నాడు, ఇది తన ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని తెలిపాడు. మ్యాచ్ అనంతరం శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, "గత కొన్ని రోజులుగా స్లిప్ క్యాచ్‌ల కోసం ప్రాక్టీస్ చేయలేదు. ఈ టెస్ట్‌లో బ్యాటింగ్ కోసం క్రీజులో ఎక్కువ సమయం గడిపాను. రెండో ఓవర్‌లోనే క్యాచ్ అందుకోవడం సంతోషంగా అనిపించింది. ఫీల్డింగ్ ఎంత ముఖ్యమో మాకు తెలుసు. గత మ్యాచ్‌లో క్యాచ్‌లను వదిలేయడం నష్టం చేసింది. ఈసారి మా ప్రదర్శన మెరుగైంది," అని అన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడేందుకు ఐపీఎల్ ముగిసిన తర్వాత నుంచి సాధన చేశానని, ఈ క్యాచ్ తన ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచిందని గిల్ తెలిపాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేసింది, ఇందులో గిల్ డబుల్ సెంచరీ (269), జడేజా (89), సుందర్ (42) రాణించా రు. ఇంగ్లాండ్ 407 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ 180 పరుగుల ఆధిక్యంతో బలమైన స్థితిలో ఉంది. ఈ టెస్ట్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది, రానున్న రోజుల్లో ఫలితం ఆసక్తికరంగా ఉండనుంది.

## పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు, 50 వేలు జరిమానా

ఖమ్మం (జనం సాక్షి) :
బాలికపై లైంగిక దాడి కేసు (పోక్సో)లో మామి డి పాపారావు 30 సం,, 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ ఎఫ్‌టిసి-II ఖమ్మం, న్యాయమూర్తి కె. ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలానికి చెందిన 7 ఏళ్ల బాలిక 2023 ఆగస్టు 13 న ఇంటి బయట అడుకుంటున్న చిన్నారిపై సత్తుపల్లిమండలం, కొత్తూరు గ్రామానికి చెందిన మామిడి పాపారావు బాధిత బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో అమె ఏడుస్తూ తీవ్ర భయాందోళనకు గురై ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు జరిగిన విషయాన్నిచెప్పడంతో 2023 ఆగస్టు 13న స్థానిక సత్తుపల్లి పోలీస్ స్టేషన్ లో బాలికతల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు పూర్వాప రాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయ మూర్తి నిందితులపై మోపిన నేరం రుజువు కావడంతో తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ మహ్మద్ ఇస్రద్ వాదించారు. విచారణ అధికారులు. అప్పటి ఏసీపీ రామానుజం, ప్రస్తుత ఏసీపీ రఘు, ఇన్స్పెక్టర్, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమా రాణి, కోర్టు కానిస్టేబుల్ రవి కుమార్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, శ్రీకాంత్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# కెప్టెన్సీ చేసే అవకాశం ఇప్పుడు లేదు

## భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా



టెస్ట్ క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. రోహిత్ శర్మ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత జడేజా పేరు కెప్టెన్సీ, వైస్-కెప్టెన్సీ రేసులో పెద్దగా వినిపించలేదు. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు టీమిండియా టెస్ట్ సారథ్య బాధ్యతలు దక్కాయి. జడేజా కూడా తనకు టీమిండియా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు లేవని అంగీకరించాడు.దాంతో సీనియర్ ఆటగాడిగా జట్టులో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో జడేజా అద్భుత ప్రదర్శన కనబర్చాడు. 137 బంతుల్లో 89 పరుగులు చేసి తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి 6వ వికెట్‌కు 203 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు భారీ స్కోర్ చేసింది.రెండో రోజు ఆట అనంతరం జడేజా మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా టీమిండియా కెప్టెన్సీ చేయాలనే కోరిక ఉందా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆ అవకాశం ఇప్పుడు లేదు'అని జడేజా నవ్వుతూ బదులిచ్చాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌పై జడేజా ప్రశంసల జల్లు కురిపించాడు. 'నిజాయితీగా చెప్పాలంటే.. శుభ్‌మన్ గిల్ ఆత్మవిశ్వాసం అద్భుతం. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు అతను అసలు కెప్టెన్‌గా కనిపించలేదు. అదనపు బాధ్యతలను సమర్థవంతంగా మోస్తున్నాడు. ఈ రోజు దురదృష్టవశాత్తు ఔటయ్యాడు తప్పా.. ఈ ఇన్నింగ్స్‌లో అతను ఔట్ అవుతాడని నాకు అనిపించలేదు. చాలా బాగా ఆడాడు. మేము బ్యాటింగ్ చేసేటప్పుడు భాగస్వామ్యాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేదానిపై చర్చించుకున్నాం.'అని జడేజా చెప్పుకొచ్చాడు.గిల్‌తో కలిసి జడేజా 203 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు వైపు దూసుకెళ్లింది. అయితే, జోష్ టంగ్ వేసిన షార్ట్-పిచ్ బంతిని పుల్ చేయబోయి జడేజా ఔటయ్యాడు. ఆ తర్వాత గిల్ (269) వాషింగ్టన్ సుందర్ (42)తో కలిసి 144 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్ 587 పరుగులు చేసింది.అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లండ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్లకు 77 పరుగులు చేసింది. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్ ఓ వికెట్ పడగొట్టాడు. భారత బౌలర్ల ధాటికి ఇంగ్లండ్.. తమ బజ్‌బాల్ గేమ్‌ను పక్కన పెట్టి జిడ్డు బ్యాటింగ్‌తో అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్ ఆడింది. బెన్ డకెట్ (0), ఆలీ పోప్ (0), జాక్ క్రాలీ (19) విఫలమవ్వగా.. హ్యారీ బ్రూక్(30 బ్యాటింగ్), జోరూట్(18 బ్యాటింగ్) ఆచితూచి ఆడి ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు.మూడో రోజు ప్రణాళిక గురించి జడేజా మాట్లాడుతూ, "మేము ఎక్కువగా ఆలోచించడం లేదు. మూడో రోజు ఆటలో లంచ్ బ్రేక్ సమయానికి 2-3 వికెట్లు తీయాలి. అలా చేస్తే, మేము కచ్చితంగా ఆటలో ముందుంటాము. పెద్ద భాగస్వామ్యాలు నమోదైనా.. ఆటను తేలికగా తీసుకోము. ఈ రోజు ఉత్సాహంగా ఆడాము. అదే జోరును కొనసాగించే ప్రయత్నం చేస్తాం. అనుకూల ఫలితం వస్తుందని ఆశిస్తున్నాం.'అని జడేజా చెప్పుకొచ్చాడు.

# మాజీ వరల్డ్ నంబర్ 1కు షాక్

## తొలిసారి నాలుగో రౌండ్‌లో రష్యన్ స్టార్

వింబుల్డన్‌లో ఫేవరెట్లకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. మహిళల సింగిల్స్‌లో నవోమి ఒసాకా అనూహ్యంగా మూడో రౌండ్‌లోనే వెనుదిరిగింది. మూడేళ్ల తర్వాత వింబుల్డన్ ఆడుతున్న ఈ మాజీ వరల్డ్ నంబర్ 1కు అనస్టాసియా పవ్లిచెంకోవా(రష్యా) షాకిచ్చింది. మూడు సెట్లపాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఒసాకా తొలి సెట్ గెలుపొందినప్పటికీ అదే జోరు చూపలేక పోయింది. రెండో సెట్‌లో పుంజుకున్న అనస్టాసియా విజేతగా నిలిచింది. దాంతో ఉసూరుమంటూ నిష్క్రమించింది ఆసియా టెన్నిస్ స్టార్. నాలుగు గ్రాండ్‌స్లామ్స్ విజేత ఒసాకా వింబుల్డన్‌లో మూడో రౌండ్ దాటలేకపోయింది. 53వ ర్యాంకర్ అనస్టాసియా ధాటికి నిలువలేకపోయింది. తొలి సెట్‌ను ఒసాకా 3-6తో సులువుగా గెలుపొందింది. ఆ తర్వాత అనస్టాసియా తన అసలైన గేమ్‌తో విరుచుకుపడి 6-4, 6-4తో రెండు సెట్లలో పైచేయి సాధించింది. తదుపరి రౌండ్‌లోనూ ఇదే ఉత్సాహంతో చెలరేగాలని భావిస్తున్నట్టు చెప్పింది 2021లో ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ అయిన రష్యా క్రీడాకారిణి. తొమ్మిదేళ్లలో అనస్టాసియా నాలుగో రౌండ్‌కు చేరడం ఇదే తొలిసారి. 'నేను కచ్చితంగా గెలుస్తానని అనుకు న్నా. కానీ, అనస్టాసియా అద్భుతంగా ఆడింది. నేను మరింత మెరుగవ్వాలి. వింబుల్డన్‌లో ముందడుగు వేసేందుకు నేను చాలా కష్టపడ్డాను. కానీ, రెండుసెట్లలో అత్యుత్తమంగా ఆడలేకపోయాను అని మ్యాచ్ అనంతరం చెప్పింది. గతంలో యూఎస్ ఓపెన్, రెండుసార్లు ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఛాంపియన్ అయిన ఒసాకా పునరాగమనం తర్వాత నిరాశపరుస్తోంది. గాయం నుంచి కోలుకొని ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ క్లబ్ టోర్నీతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. వరుసగా మూడు మ్యాచుల్లో ఓడిపోయింది.

## డేవిడ్ లాయిడ్ వివాదాస్పద వ్యాఖ్యలు

ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్ మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు రెండో రోజు కూడా అద్భుత ప్రదర్శన కనబరిచింది. అయితే, ఈ ఆధిపత్యాన్ని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ డేవిడ్ లాయిడ్ జీర్ణించుకోలేక పోయాడు. భారత ఆటగాళ్లు తీసుకున్న బ్రేక్‌లపై అతడు తీవ్ర విమర్శలు చేశాడు. డేవిడ్ లాయిడ్ మాట్లాడుతూ, "రెండో రోజు ఆట ప్రారంభమైన 15 నిమిషాల్లోనే రవీంద్ర జడేజా బ్రేక్ తీసుకున్నాడు. డ్రింక్స్‌తో పాటు టాబ్లెట్స్ వేసుకున్నాడు. 40 నిమిషాల తర్వాత మళ్లీ ఆటను ఆపాడు. ఈ బ్రేక్‌ల వల్ల కొన్ని ఓవర్లు కోల్పోయాం. ఐసీసీ ఈ బ్రేక్‌లపై నిబంధనలు రూపొందించాలి. గాయపడిన బ్యాటర్ స్థానంలో మరో ఆటగాడు క్రీజులోకి రావాలి, తద్వారా ఆటకు అంతరాయం కలగకుండా చూడాలి. అభిమానులు 85 యూరోలు (సుమారు 10,000 రూపాయలు) ఖర్చు చేసి మైదానంలో గడ్డి చూడటానికి రాలేదు," అని అక్కసు వెళ్లగక్కాడు. అంతేకాదు, జడేజా బ్యాటింగ్ సమయంలో 'డేంజర్ జోన్' వైపు వెళ్లడంపై కూడా లాయిడ్ విమర్శలు చేశాడు. "జడేజా పిచ్‌పై బ్యాట్‌తో కొట్టడం, పాదంతో రుద్దడం డ్రామాటిక్‌గా అనిపించింది. ఇది డ్రై పిచ్, రానున్న రోజుల్లో స్పిన్‌కు అనుకూలంగా మారే అవకాశం ఉంది. వెల్ డన్, జడ్డూ! నేనూ ఇలాంటివి చేసేవాడిని," అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు.

**భారత బ్యాటింగ్‌లో గిల్, జడేజా రాణించారు**
రెండో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 310/5 నుంచి భారత్ 587 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 387 బంతుల్లో 269 పరుగులతో డబుల్ సెంచరీ సాధించి అదరగొట్టాడు. రవీంద జడేజా 137 బంతుల్లో 89 పరుగులతో సెంచరీకి చేరువలో ఔటయ్యాడు. గిల్-జడేజా ఆరో వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ (103 బంతుల్లో 42)తో గిల్ ఏడో వికెట్‌కు 144 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 3 వికెట్లు, క్రిస్ వోక్స్, జోష్ టంగ్ రెండేసి వికెట్లు, బ్రైడన్ కార్స్, బెన్ స్టోక్స్, జో రూట్ ఒక్కో వికెట్ తీశారు. భారత జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తున్నప్పటికీ, డేవిడ్ లాయిడ్ విమర్శలు వివాదాస్పదంగా మారాయి. ఈ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగిస్తుందా లేక ఇంగ్లాండ్ పుంజుకుంటుందా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.





# నాటుకోడి పులుసుతో కమ్మని విందు..

## ఆ తర్వాత ఇసుక సెటిల్మెంట్

వైరా, జులై 04 (జనం సాక్షి) :
నాటుకోడి పులుసుతో కమ్మని విందును ఆరగించిన ఓ అధికారి తాపీగా తాను పట్టుకున్న అక్రమ ఇసుకను వదిలేసేందుకు సెటిల్మెంట్లు చేసుకున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.న అందులో భాగంగానే సీజ్ చేసిన సుమారు రెండు వందల ట్రిప్పుల ఇసుక మాయమవుతుంది. ప్రభుత్వానికి రావాల్సిన సుమారు మూడు లక్షల రూపాయల ఆదాయానికి గండి పడింది. ప్రభుత్వం ఏమైపోతే మాకేంటి.. మేము చేసేదే ఉద్యోగం.. మా నిర్ణయమే ఫైనల్ అంటూ ఓ అధికారి అక్రమాలకు తెర లేపారు. వైరా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి పనితీరు రోజురోజుకు వివాదాస్పదంగా మారుతుంది. వైరా మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసిన అధికారులు ఆ తరువాత ఆ ఇసుక గురించి కనీసం పట్టించుకోవడం లేదు. లింగన్నపాలెం గ్రామ సమీపంలోని గంగదేవిపాడు వాగు నుంచి గ్రామంలోకి వందలాది ట్రిప్పుల ఇసుకను అక్రమంగా రవాణా చేశారు. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న వైరా రెవెన్యూ అధికారులు పది రోజుల క్రితం ఆ గ్రామంలోని సుమారు 200 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు.ఇసుక డంపులకు చుట్టూ ముగ్గు పోశారు. ఆ తర్వాత ఒక్కో ఇసుక ట్రిప్ కు ప్రభుత్వానికి 1500 రూపాయలు చొప్పున జరిమానా చెల్లించాలని ఇసుకను అక్రమంగా నిల్వ చేసిన వారిని ఆదేశించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాతే సీన్ రివర్స్ అయింది. ఇసుకను పట్టుకున్న మూడు రోజుల తర్వాత ఆ గ్రామానికి వెళ్లిన ఓ రెవెన్యూ అధికారి ఆ కుప్పలను పరిశీలించారు. అనంతరం నాటుకోడితో విందు ఆరగించి అక్రమంగా ఇసుక నిల్వలు చేసిన వారితో మాట్లాడారని ఆ గ్రామస్తులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నిబంధన ప్రకారం 10 రోజుల క్రితం పట్టుకున్న ఇసుకకు సంబంధించి ప్రభుత్వానికి నేటి వరకు జరిమానా చెల్లించలేదు. ఓ అధికారిని ప్రసన్నం చేసుకున్న అక్రమ వ్యాపారులు దర్జాగా ఆ ఇసుకను గ్రామాలకు ట్రాక్టర్లో తీసుకు వెళ్లి విక్రయిస్తున్నారు. అధికారులు సీజ్ చేసిన సుమారు 200 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారుల అండతోనే అక్రమ రవాణా చేస్తున్నారని ఆ గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. సుమారు 200 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక పట్టుబడిన విషయాన్ని కనీసం బహిర్గతం కాకుండా అధికారులు ఎందుకు రహస్యంగా ఉంచారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.శుక్రవారం సీజ్ చేసిన ఇసుకను ట్రాక్టర్లలో ఇతర గ్రామాలకు అక్రమంగా తరలించారు. ఈ వ్యవహారాన్ని తెలిసిన రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇప్పటికే వైరా తహసీల్దార్ కార్యాలయంలో కొంతమంది అధికారులు ప్రజలకు కనీస అవసరాలైన సర్టిఫికెట్లు పనులు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అయితే ప్రస్తుతం లింగన్నపాలెం వాసులు తమ గ్రామంలో ఇసుక పట్టుబడిన విషయాన్ని బహిర్గతం చేయటంతో అధికారుల బాగోతం బయటపడింది . ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా రవాణా చేసేందుకు దొడ్డిదారిన అనుమతులు ఇచ్చి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని లింగన్నపాలెం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై వైరా తహసీల్దార్ కెవి శ్రీనివాసరావును వివరణ కోరగా లింగన్నపాలెం గ్రామంలో పది రోజుల క్రితం ఇసుక కుప్పలను సీజ్ చేసిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. అయితే వర్షానికి ఇసుక కుప్పలు చుట్టు పోసిన ముగ్గు కొట్టుకుపోయిందని వివరించారు. అయితే సీజ్ చేసిన ఇసుక ఎన్ని ట్రిప్పులో తనకు తెలియదని పేర్కొనడం విశేషం.

# పాలేరు టెన్నల్ పనుల్లో అవకతవకలు





- టెండర్ ప్రక్రియ లేకుండా పనులు ప్రారంభించడమేంది
- 15 కోట్ల ఖర్చుపై వివరాలు వెల్లడించాలి
- యూ టీ పనులు ఆలస్యమైతే మళ్ళీ రైతులకు నష్టం
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, పాలేరు అసెంబ్లీ ఇంచార్జ్ నున్నా రవికుమార్
- అండర్ టర్నల్ నిర్మాణ పనులు పరిశీలించిన బిజెపి నేతలు

పాలేరు,(జనం సాక్షి) : పాలేరు సాగర్ ఎడమ కాలువ అండర్ టెన్నల్ నిర్మాణ పనులపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, టెండర్ ప్రక్రియకు విరుద్ధంగా కాంట్రాక్టులు అప్పగించారని ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించా రు. శుక్రవారం పాలేరు అసెంబ్లీ ఇంచార్జ్ నున్నా రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా నాయకుల బృందం పాలేరు వద్ద జరుగుతున్న అండర్ టెన్నల్ పనులను పరిశీలించింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.గత ఏడాది అకస్మాత్తుగా సంభవించిన భారీ వర్షాలకు నాగార్జునసాగర్ ఎడమ కాలువకు అనుసంధానంగా ఉండే అండర్ టెన్నల్ కొట్టుకుపోయిన విషాద ఘటనను వారు గుర్తు చేశారు. కాలువ తెగిపోవడం వల్ల ఆయకట్టు రైతులు పంటలు నష్టపోయారని, సాగు నిష్ప్రయోజనమై రైతులు అప్పుల్లో మునిగిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అనుభవం మరువకముందే ప్రభుత్వం తగిన గమనిక తీసుకోకుండా మరోసారి అదే తప్పిదాన్ని పునరావృతం చేస్తుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.15 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెబుతూనే, దానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించ కుండా మౌనాన్ని పాటిస్తోందని బీజేపీ విమర్శించింది. కాంట్రాక్టు పద్ధతిలో పనులను అప్పగించడంలో అనేక అనుమానాస్పద అంశాలున్నాయని నేతలు తెలిపారు. పారదర్శకత లేకుండా టెండర్లను పక్కనపెట్టి ఇష్టానుసారంగా పనులను అప్పగించడం న్యాయపరంగా కూడా తప్పుపట్టదగిన చర్య అని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని, వర్షాకాలం ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిస్థితి రైతులకు మరోసారి చేదు అనుభవాన్ని మిగిల్చే అవకాశముందని హెచ్చరించారు. తక్షణమే పనులను వేగవంతం చేయకపోతే సాగర్ జలాలు ఆయకట్టుకు చేరక మళ్లీ పంటలు నష్టపోవడం అనివార్యమవుతుందన్న భావన రైతుల మధ్య వ్యాపిస్తోంది.

పనుల్లో నాణ్యత లేకపోవడం స్పష్టంగా కనిపిస్తున్నందున వాటిపై సాంకేతిక పరిశీలన జరిపించాలని, నిధుల వినియోగంపై సమగ్ర ఆడిట్ చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. నిర్మాణ ప్రక్రియలో జరుగుతున్న అన్ని ఖర్చుల వివరాలను ప్రభుత్వం తక్షణమే బహిరంగ పరచాలని కోరారు. లేకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యాచరణ చేపడతామంటూ బీజేపీ నేతలు స్పష్టంగా హెచ్చరించారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదు, రైతుల హక్కులను కాపాడే పోరాటమని వారు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించే వరకు బీజేపీ కార్యకర్తలు కలెక్టరేట్ స్థాయిలో నిరసనలు, మండల కేంద్రాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాలేరు అండర్ టెన్నల్ పనులు పూర్తవకపోతే, ఖమ్మం జిల్లాలో పలు మండలాలకు సాగర్ జలాల చేరిక కష్టమవుతుందని బీజేపీ హెచ్చరించింది. రైతుల జీవనాధారమైన కాలువల పనులపై నిర్లక్ష్యం ప్రదర్శించడం క్షమించలేని తప్పు అని బీజేపీ నాయకులు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నున్నా రవికుమార్, రమేష్, మందడపు సుబ్బారావు, రవి రాథోడ్, కోటమర్తి సుదర్శన్, హట్యా నాయక్, గుత్తా వెంకటేశ్వరరావు, గడ్డం వెంకటేశ్వర్లు, పుణ్యవతి, పాగర్తి సుధాకర్, జాటోత్ మధు నాయక్, బజ్జూరి మల్లారెడ్డి, బెల్లం మురళి, గుండా ఉపేందర్ రెడ్డి, రజిని రెడ్డి,మణి, మేకల నాగేందర్, జ్వాలా గౌడ్, రవీందర్, నాయకులు పాల్గొన్నారు

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం
05 జులై 2025



# జూరాలకు భారీగా వరదనీరు

**14 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**

**గద్వాల, జూలై4 (జనంసాక్షి) :** ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది పరీవాహక ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకళను సంతరించు కున్నాయి. శుక్రవారం ఎగువ ప్రాంతం నుండి జూరాలకు 1,15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ప్రాజెక్టు 14 గేట్లు దిగువకు 95,566 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల కుడి, ఎడమ కాలువలు, బీమా లిఫ్ట్ 1, విద్యుత్ ఉత్పత్తికి, కోయిల్ సాగర్ సమాంతర కాలువలకు అన్నింటికీ కలిపి 1,27,659 క్యూసెక్కులకు వదులుతున్నట్లు- జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. శు క్రవారం ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి మట్టం 129.72 టిఎంసిలకు గాను 90.91 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 94,767 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు 1,00,670 క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 37.646 టిఎంసిలకు గాను 30.98 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుండి 99,583 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువకు 99,583 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. జూరాల జలాశయం 9.667 టిఎంసిలకు గాను 7.991 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణ పూర్ జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టంతో కళకళలాడుతుండడంతో అక్కడి ప్రాజెక్టుల నుండి వస్తున్న వరద నీటితో జూరాల వద్ద జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకొని జూరాల ప్రాజెక్టులపై ఆధారపడి నిర్మించిన ఎత్తిపోతల పథకాలకు అధికారులు నీటి విడుదలను కొనసాగిస్తుండడంతో ఆయకట్టు- రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# రోశయ్య అరుదైన రాజకీయవేత్త

**బడ్జెట్ సర్దుబాటులో ఆయనది అందెవేసిన చేయి**

**16సార్లు బడ్జెట్ సమర్పించిన ఘనత రోశయ్యది**

**రోశయ్య జయంతి వేడుకల్లో స్పీకర్ ప్రసాద్ కుమార్**



**హైదరాబాద్, జులై 4(జనంసాక్షి) :** దేశంలో ఒక రాష్ట్ర ఆర్థికమంత్రిగా అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యదని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. అప్పులు చేయకుండా ఉన్నంతలో బ్జడెట్ ను సర్దుబాటు చేయడంలో రోశయ్యది అందెవేసిన చెయ్యని అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రుల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధుల కొరత లేకుండా సర్దుబాటు చేసిన ఘనత రోశయ్య గారిదని అన్నారు. నిండైన తెలుగు తనానికి ప్రతిరూపం రోశయ్య అని,. పంచెకట్టు, భుజంపై పై పంచెతో ఆకట్టుకునే ఆహార్యం రోశయ్యదని అన్నారు. స్వర్గీయ కొణిజేటి రోశయ్య 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభా వేదికపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుని ప్రముఖులు సన్మానించారు. .ఈసందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషం. గొప్ప రాజకీయ నేతకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులకు నా అభినందనలు తెలుపుతున్నానని అన్నారు అదేవిధంగా ఈరోజు వారి విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరించడం ద్వారా రోశయ్య గారి గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు వారి తెలియజేయడం జరిగిందన్నారు. ఇక వాక్పటిమ, వాగ్దాటి, చతురతలో రోశయ్య గారితో ఇంకొకరిని పోల్చలేం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గవర్నర్ గా నియామకం అయ్యి బిజెపి ప్రభుత్వంలో కూడా కొనసాగిన అరుదైన వ్యక్తులలో రోశయ్య గారు ఒకరు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు కానీ వ్యక్తిగతంగా అందరికీ ఆజాత శత్రువు రోశయ్య గారని అన్నారు. రోశయ్య గారిది మన తెలంగాణ ప్రాంతం కాకపోయినా వారిని మనం గౌరవించడానికి కారణం మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం వారి పెద్దరికానికి గౌరవం ఇవ్వడమేనని అన్నారు. రోశయ్య గారు శాసనసభలో మాట్లాడుతుంటే స్వపక్షంతో పాటుగా విపక్షాలు కూడా ఏకాగ్రతతో వినేవాళ్ళు. యువ, నూతన శాసన సభ్యులకు రోశయ్య గారి ప్రసంగం ఒక పుస్తకం. 2008 ఉప

ఎన్నికలలో నేను మొదటిసారి శాసనసభ్యునిగా ఎన్నికై అసెంబ్లీకి వచ్చినప్పుడు సమావేశాలో రోశయ్య గారి ప్రసంగాలను ప్రత్యేక్షంగా వినే భాగ్యం కలిగింది, వారి ప్రసంగాలకు నేను అభిమానిని. వారి నుండి నేను ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. నేటి యువ రాజకీయ నాయకులు రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నానని గడ్డం ప్రసాద్ అన్నారు.

# ఈద్గాను వివాదాస్పద నిర్మాణంగా గుర్తించలేం

**శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై హైకోర్టు కీలక నిర్ణయం**



**ప్రయాగ్‌రాజ్, జులై 4 (జనంసాక్షి) :** మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఆ జన్మభూమిలో షాహి ఈద్గా మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ హిందువాదులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తొసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టేసింది. పూర్తి విచారణకు ముందు మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించడం తుది తీర్పుపై ప్రభావం చూపిస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఈ మసీదు వివాదాస్పద నిర్మాణమంటూ మహేందర్ ప్రతాప్ సింగ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ముస్లింలు రాత పూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ముస్లిం పక్షానికి భారీ ఊరట లభించినట్లయింది. ప్రస్తుతం ఈ కేసును సింగిల్ జడ్జి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం విచారిస్తుంది. ఈ కేసులో హిందువుల వైపు నుంచి ప్రస్తుతం 18 పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

# పాశమైలారం సందర్శించిన సిఎస్ రామకృష్ణారావు బృందం

**సిగాచి ప్రమాద స్థలిని పరిశీలించిన హైలెవల్ కమిటీ**

**ప్రమాద ఘటనలో మరొకరు ఆస్పత్రిలో మృతి**



**సంగారెడ్డి, జూలై4 (జనంసాక్షి) :** పాశమైలారంలోని సిగాచి ప్రమాద ఘటనా స్థలిని సీఎస్ రామకృష్ణ రావు నేతృత్వంలోని హై లెవెల్ కమిటీ పరిశీలించింది. ప్రమాద స్థలిని హైలెవల్ కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీకి చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణ రావు, సభ్యులుగా రెవెన్యూ, ఇండస్ట్రీ చీఫ్ సెక్రటరీలతో పాటు కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైర్ డీజీ, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉన్నారు. ఘటనా స్థలిని పరిశీలించిన తర్వాత బాధిత కుటుంబాలతో కమిటీ మాట్లాడింది. సిగాచి యాజమాన్యంతో కూడా మాట్లాడి వివరాలను సేకరించనుంది. ఇక ప్రమాద స్థలిని గురువారం నిపుణుల కమిటీ పరిశీలించిన విషయం తెలిసిందే. సుమారు మూడు నాలుగు గంటల పాటు నిపుణుల కమిటీ విచారించింది. టెక్నికల్ అంశాలపై నిపుణుల కమిటీ నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. మరోవైపు ఈ ప్రమాద ఘటనలో మరొకరు మృతి చెందారు. దీంతో సిగాచి ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. సిగాచి పరిశ్రమలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమ్ రావు అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భీరామ్ స్వస్థలం మహారాష్ట్ర. పోస్టుమార్టం అనంతరం భీమ్ రావు మృతదేహాన్ని స్వస్థలానికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాద స్థలిలో ఐదవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం నుంచి 61 మంది సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ దుర్ఘటనలో 38 మంది మృతి చెందారని.. అందులో ఇప్పటి వరకు 31 మృతదేహాలను గుర్తించామని వెల్లడించారు. ఇంకా 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఆస్పత్రి నుంచి ఇప్పటి వరకు 12 మంది డిశ్చార్జ్ అయ్యారని.. ప్రస్తుతం ఆస్పత్రులలో 23 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంకా 9 మంది ఆచూకీ లభించలేదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. వీరి కోసం ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సిగాచి పరిశ్రమ వద్ద బాధితుల ఆందోళన కొనసాగుతోంది. ఐదు రోజులు గడిచినప్పటికీ తమ వారి ఆచూకీ తెలియడం లేదంటూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పాటు ఏపీ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన ఓ కుటుంబం కూడా నిరీక్షిస్తోంది.

# ఖర్గే రాకతో గాంధీభవన్‌లో సందడి

**సిఎం, మంత్రుల హాజరుతో భద్రత పెంపు**

**పోలీసుల తీరుపై రేణుకాచౌదరి అసహనం**




**హైదరాబాద్, జూలై4 (జనంసాక్షి) :** గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ సమావేశం కొనసాగుతున్న వేళ కార్యకర్తల తాకిడి పెరిగింది. ఏఐసీసీ చీఫ్ కర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు గాంధీ భవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూ కట్టింది. ఈ క్రమంలో కేడర్ లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వారిలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యక్తిగత సిబ్బంది కూడా ఉన్నారు. దీంతో ఆమె స్వయంగా పోలీసుల వద్దకు వచ్చి సిబ్బందిని లోపలికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్యురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావుడి ఎక్కువైందంటూ రేణుకా చౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పీఏసీ సమావేశంలో పార్టీ నేతలకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. సమావేశం మొదలైన వెంటనే పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో చనిపోయిన మృతులకు సంతాపం తెలుపుతూ పీఏసీ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆపై ఏజెండా ప్రకారం పీఏసీ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎంత మేరకు తీసుకెళ్లారనే దానిపై చర్చించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి చేరికలను ప్రోత్సహించాలని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాష్ట్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ వంటి కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై రిపోర్టును పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశంలో చదివి వినిపించారు. గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అంశంపై కూడా పీఏసీలో చర్చ జరిగింది.

# దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి

**తొలి ప్రయత్నంగా మహిళా అధ్యక్షురాలు**

**ముందువరసలో నిర్మలా సీతారామన్,వానతీ శ్రీనివాసన్**





**న్యూఢిల్లీ, జూలై4 (జనంసాక్షి) :** సంస్థాగత ఎన్నికల ప్రక్రియను భారతీయ జనతా పార్టీ వేగంగా ముందుకు తీసుకుని వెళ్తున్న వేళ కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా దక్షిణాదిలో పాగా వేయాలన్న బలమైన కోరికతో ఉంది. ఉత్తరాది పార్టీ అన్న ముద్రను తొలగించుకునే క్రమంలో వేస్తున్న అడుగులు ఇప్పుడు జాతీయ అధ్యక్ష పదవి విషయంలో ఆయరించే ప్రయత్నాలు మొదలయ్యాని తెలుస్తోంది. బిజెపి సాహసాలు చేయడంలోను, ప్రయోగాలు చేయడంలోనూ ముందుంటుంది. దీనితో ఏ పార్టీ పోటీపడలేదు. కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబ వారసత్వమే కొనసాగుతుంది. ప్రాంతీయ పార్టీల్లో కూడా వారసత్వ రాజకీయాలే ఉంటాయి. ఈ వాసనలు లేకుండా మనగలుగుతున్న పార్టీ బిజెపి మాత్రమే. ఇందులో చేరిన సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి దక్షిణాది నుంచి పార్టీ అధ్యక్ష పదవిని ఎంచుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. అందులోనూ మహిళలయితే మంచిదనే భావనా ఉంది. దీనికితోడు ఉత్తర, దక్షిణ భారతాలు కలుపుతూ...భాషా పరంగా నైపుణ్యాలు ఉండేవారిని కూడా వెతుకుతున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె హిందీ, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడడమే గాకుండా కఠినంగా పరిశ్రమ చేయగలరు. ఇకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో బిజెపి సారథుల నియామకాలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో అధ్యక్షులను ఖరారు చేశారు. ఈ క్రమంలో ఇటీవలే అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ అధ్యక్షుల ఎంపిక సాగింది. తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ పార్టీకి అంకితమై పనిచేస్తున్నవారే. ఇక్కడ కులాల కన్నా పార్టీకి అంకితమై ఉన్నవారినే గుర్తించారు. ఇలా అధ్యక్షుల ఎంపిక పూర్తయిన తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి భాజపా జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాదికి మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఎందుకంటే దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి ఇలా చేయడంలో ఆశ్యర్యం లేదు. గతంలో వెంకయ్యనాయుడు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరవాత ఉపరాష్ట్రపతి కూడా అయ్యారు. జాతీయ అధ్యక్ష పదవి రేసులో పరధానంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనించాలి. అలాగే పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కూడా దక్షిణాది నుంచి మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేం దుకు ఆలోచనలు చేస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో భాజపా అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. ఇకపోతే భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్1993 నుంచి భాజపాలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె కూడా ఈరేసులో ఉన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు బిజెపి కసరత్తు చేస్తోంది. అన్నామలైని తప్పించాలన్న డిమాండ్‌ను కూడా అంగీకరించింది. స్టాలిన్ ప్రభుత్వాన్ని సాగనంపే క్రమంలో ఈ ప్రయత్నాలు ఫలించవచ్చని అంటున్నారు.

# విషం చిమ్ముతున్న దేశద్రోహులు

**సోషల్ మీడియా వేదికగా విద్రోహ ప్రచారం**

**అలాంటి వాటిని మూసేసేందుకు కేంద్రం చర్యలు**

**న్యూఢిల్లీ, జులై4 (జనంసాక్షి) :** ఈ దేశంలో ఉంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపోర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హోం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి. ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికారులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హోమ్ మినిస్ట్రీకి చెప్పారట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందని తెలుస్తోంది. దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిని, వ్యతిరేకంగా పని చేసే వారిని గుర్తించడానికి కేంద్రం ఓ టీమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ టీమ్ దేశ వ్యతిరేక కార్యాకలాపాలపై దృష్టి పెడుతుంది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ గురుపత్వంత్ సింగ్ పన్నులాంటి వారి ఖాతాలు కూడా ఇండియాలో బ్యాన్ అవ్వనున్నాయి. ఈ కొత్త పాలసీ కోసం సోషల్ మీడియా కంపెనీలతో పాటు అమెరికా ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

# మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదనీరు

**కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి**



**జయశంకర్ భూపాలపల్లి, జూలై4 (జనంసాక్షి) :** కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పక్కన ఎలాంటి శాశ్వత ఏర్పాట్లు లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిబ్బందిని మోహరించారు. ఇక ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరద నీరు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతానికి బ్యారేజీకి పై నుంచి సుమారు 84,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి, అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోలో సమానంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దిగువన ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరద ఉధృతికి సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టి, అవసరమైతే స్థానికులను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద స్థాయిలను గమనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తులు కూడా నదిలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370